శుక్రవారం
28•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 244
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE









గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ టోలిచౌకిలో మార్గమధ్యంలో ఆగి దివ్యాంగుడైన మహ్మద్ సలీంతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

# కాన్వాయ్ ఆపి.. కరుణ చూపి..

## రహదారిపై వృద్ధుడిని పలుకరించిన సీఎం కేసీఆర్

**సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఆదేశాలు**

**దివ్యాంగ పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ టోలిచౌకి.. గురువారం మధ్యాహ్నం 3:30 గంటలు. స్థానిక ఆదిత్యా ఎన్‌క్లేవ్‌లో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు.. తన కాన్వాయ్‌లో క్యాంప్ ఆఫీసుకు బయలుదేరారు. కాన్వాయ్ వేగంగా వెళ్తున్నది. కొద్దిదూరం రాగానే.. దారిలో అంగవైకల్యంతో ఉన్న ఓ వృద్ధుడు చేతిలో దరఖాస్తుతో నిలబడి ఉండటాన్ని సీఎం గమనించారు. అతను కాన్వాయ్ వైపు రావడానికి సిద్ధమవగా.. అప్రమత్తమైన పోలీసులు అతడిని అడ్డుకొన్నారు. అంతలోనే సీఎం కేసీఆర్ తన కాన్వాయ్‌ని ఆపారు. కారులోంచి కిందకు దిగి నడుచుకుంటూ ఆ వృద్ధుడి దగ్గరకు వెళ్లారు. ఆర్తిగా చూస్తున్న ఆ వృద్ధుడిని ఆప్యాయంగా పలుకరించారు. సమస్యలను సావధానంగా విన్నారు. అతని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. పింఛన్ మంజూరుచేయించారు. డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇప్పించారు. తనపై సీఎం చూపించిన అపారమైన కరుణకు ఆ వృద్ధుడు ఆనందంతో తబ్బిబ్బయ్యాడు. మా ముఖ్యమంత్రి మనసుగల్ల

మిగతా 2వ పేజీలో

# ఎన్పీఆర్ వాయిదా

## కేసీఆర్ ప్రభుత్వం కీలక నిర్ణయం • అసెంబ్లీ సమావేశాల తర్వాతే ఖరారు

**సవరించిన ఫార్మాట్‌పై అభ్యంతరాలు • కేంద్రప్రభుత్వ సమాచారం సందిగ్ధం • ఇతర రాష్ట్రాలతోనూ సంప్రదింపులు**




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్పీఆర్ విషయంలో పలు వర్గాల్లో సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకొన్నది. దేశంలో ప్రతి పదేండ్లకొకసారి జనగణన చేపడుతారు. ఈసారి 2020-21లో జనగణన జరుగాల్సి ఉన్నది. అలాగే ప్రతి ఐదేండ్లకోసారి ఎన్పీఆర్ సవరణ జరుగుతుంది. జనగణనకు సన్నాహకంగా హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహిస్తారు. దాంతోపాటే ఎన్పీఆర్ వివరాలను సేకరించాల్సిందిగా కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. అయితే గతంలో ఉన్న ఎన్పీఆర్ ఫార్మాట్‌ను సవరించి మరికొన్ని ప్రశ్నలను జోడించింది. జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ) తయారీకి ఎన్పీఆర్ ప్రాతిపదికగా భావిస్తున్న నేపథ్యంలో కొత్త ప్రశ్నల జోడింపు తీవ్ర వివాదాస్పదమైంది.

**ఎన్పీఆర్ ఉద్దేశం ఇదీ..**

జనాభా లెక్కల చట్టం ప్రకారం జనగణన నిర్వహిస్తారు. దేశంలో జనసంఖ్యను కనుక్కోవటం దీని ప్రధాన ఉద్దేశం. అట్లాగే పౌరసత్వ చట్టం -1955, పౌరసత్వ నియమాలు-2003 కింద ఎన్పీఆర్ చేపడతారు. ఒక నివాసిత ప్రాంతంలో గత ఆరునెలలుగా నివసిస్తున్న, లేదా వచ్చే ఆరునెలలు నివసించాలనుకొంటున్న వ్యక్తుల వివరాలను సేకరించడం ఎన్పీఆర్ ప్రధాన ఉద్దేశం. జనగణన అయినా.. ఎన్పీఆర్ అయినా చట్టంలోని ఫలానా సెక్షన్ కింద నిర్వహించాలని కేంద్రం నోటిఫై చేయాల్సి ఉంటుంది. సవరించిన నమూనాతో ఎన్పీఆర్ వివరాలను సేకరించాల్సిందిగా రాష్ట్రాలకు సూచించిన కేంద్రం.. ఆ ప్రశ్నలను చట్టంలోని ఏ సెక్షన్ ప్రకారం చేర్చిందో మాత్రం స్పష్టతనివ్వలేదు. ఒకవైపు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ).. వివాదాస్పదమైన నేపథ్యంలో తాజాగా ఎన్పీఆర్‌పై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి కూడా వివాదాస్పదమవుతున్నది. దీంతో ప్రస్తుతానికి దీని అమలును పక్కనపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరిన సంగతి తెలిసిందే. ఎన్పీఆర్ విషయంలో కూడా తాజాగా సవరించిన ఫార్మాట్‌తో కాకుండా పాత నమూనానే ప్రాతిపదికగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరనున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. షెడ్యూలు

మిగతా 2వ పేజీలో

# హైదరాబాద్‌లో ప్రావిడెన్స్

- అమెరికా హెల్త్‌కేర్ దిగ్గజం గ్లోబల్ సెంటర్
- వినూత్న, సాంకేతిక అభివృద్ధికి అవకాశం
- నాలుగేండ్లలో 700 కోట్ల పెట్టుబడులు
- సానుకూలతల వల్లే రాష్ట్రానికి పరిశ్రమలు
- తెలంగాణలో ఉన్నతస్థాయి వసతులు
- హెల్త్‌హబ్‌గా తెలంగాణ స్థానం బలోపేతం
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ సానుకూల విధానాల వల్ల పరిశ్రమల స్థాపనలో తెలంగాణ ఇతర రాష్ట్రాల కంటే ముందున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. సులభ వాణిజ్య విధానంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉన్నదని చెప్పారు. అత్యున్నతస్థాయి మౌలిక వసతులు ఇక్కడ ఉన్నాయని అన్నారు. అమెరికాకు చెందిన అతిపెద్ద హెల్త్‌కేర్ సేవల సంస్థ ప్రావిడెన్స్.. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన గ్లోబల్

మిగతా 2వ పేజీలో



గురువారం హైదరాబాద్‌లో ప్రావిడెన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో యూఎస్ కాన్సుల్ జనరల్ జోయెల్ రిఫ్‌మ్యాన్, ప్రావిడెన్స్ ప్రతినిధులు, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణ్యన్ కూడా ఉన్నారు.



షెఫాలీ

**మహిళల టీ20 ప్రపంచకప్**

## సెమీస్‌లో భారత్

న్యూజిలాండ్‌పై ఉత్కంఠ విజయం
రాణించిన షెఫాలీ
బౌలర్ల సమిష్టి ప్రదర్శన

వివరాలు ఆటలో



## జస్టిస్ బదిలీపై రగడ

బీజేపీ నేతలపై కేసు నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టిన జస్టిస్ మురళీధర్
గంటల వ్యవధిలోనే బదిలీ వేటు
కేంద్రం ప్రతీకార చర్యలు: కాంగ్రెస్
కొలీజియం సిఫార్సుల మేరకే: బీజేపీ

5

## ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

1,339 పరీక్ష కేంద్రాలు..
9.65 లక్షలమంది విద్యార్థులు

2

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 52.00 | రిటైల్ లైవ్ | 74.00 |
| డ్రెస్డ్ | 107.00 | స్కిన్‌లెస్ | 122.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 316.00 | రంగారెడ్డి | 316.00 |
| మెదక్ | 316.00 | కరీంనగర్ | 319.00 |
| వరంగల్ | 319.00 | డజన్ ధర | 60.00 |

# అడ్డదారిలో పసిడి

## దేశంలోకి భారీగా అక్రమరవాణా

- రోజుకు 700 కిలోలకుపైగా స్మగ్లింగ్
- ఎప్పటికప్పుడు స్మగ్లర్ల సరికొత్త ఎత్తులు
- డబ్బు ఆశతో సామాన్యులే సమిధలు
- డీఆర్‌ఐ నిఘాతో భారీగా పుత్తడి సీజ్
- అయినా కన్నుగప్పి అక్రమ తరలింపు



ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్న బంగారం పేస్టు, క్యాప్సూల్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

వాళ్లకు తనిఖీలు పెద్ద విషయమేకాదు! అక్రమ మార్గాల అన్వేషణలో దిట్టలు! అవసరమైతే ఉద్దేశపూర్వకంగా ఒకళ్లను పట్టించి.. పదిమంది తప్పించుకుపోయేలా ప్లాన్‌చేయడం వారి కళ! నరమానవుడు ఊహించని రీతిలో.. ఆఖరుకు పురీషనాళాల్లో పెట్టిమరీ సరుకును తరలించడం వారి స్పెషాల్టీ! వారే బంగారం స్మగ్లర్లు! నిఘా అధికారులు పకడ్బందీగా వల వేస్తున్నా.. తప్పించుకుని.. దేశంలోకి అడ్డదారిలో పసిడి రాశులను ప్రవహింపజేస్తున్న ఘరానా దొంగలు! ఫలితం.. ఆకాశ.. సముద్ర మార్గాలే కాదు.. ఏ ఎల్లలు లేకుండా దేశంలోకి వందల కిలోలకొద్దీ బంగారం అక్రమమార్గంలో వెల్లువెత్తుతున్నది. స్మగ్లర్ల ఎత్తులకు సామాన్యులే సమిధలుగా మారుతుండటం విషాదం. కాసింత డబ్బు ఆశ చూపి.. వారిద్వారా సాధ్యమైనంత బంగారాన్ని రవాణాచేస్తున్నారు. నిఘా అధికారులకు పట్టుబడితే.. బంగారాన్ని తీసుకొచ్చినవారే విచారణ ఎదుర్కోవలసి వస్తున్నది. సూత్రధారులు మాత్రం దర్జాగా తప్పించుకుంటున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) లెక్కల ప్రకారమే గత మూడేండ్లలో తెలంగాణ రాష్ట్రంలోనే బంగారం స్మగ్లింగ్ 40% పెరుగటం ఆందోళన కలిగిస్తున్నది. విదేశాల నుంచి రోజూ దాదాపు 700 కిలోల పుత్తడి మన దేశంలోకి వస్తున్నట్టు అధికారిక సమాచారం. ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాలు, సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా పెడుతున్న డీఆర్‌ఐ అధికారుల తనిఖీల వల్ల గత ఐదేండ్లలో దాదాపు 233 కిలోల బంగారం పట్టుబడింది. పదులసంఖ్యలో స్మగ్లింగ్ ముఠాలు అరెస్టయ్యాయి. అయినప్పటికీ బంగారం అక్రమ రవాణా ఆగడంలేదు. తాజాగా సోమవారం రూ.1.38 కోట్ల విలువైన 3.09 కిలోల పుత్తడి పట్టుబడింది. అసలు ఇంత పెద్ద మొత్తంలో బంగారం అక్రమంగా ఎలా రవాణా అవుతున్నది? ఏ మార్గాల్లో తరలిస్తున్నారు? ప్రధానంగా ఏ దేశాల నుంచి వస్తున్నదన్న అంశాలను గమనిస్తే నివ్వెరపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

**కిలో రవాణాకు రూ.3.5 లక్షల లాభం**

ప్రపంచంలో బంగారాన్ని అత్యధికంగా ఇష్టపడేది భారతీయులే. మన దగ్గర బంగారం అంటే మోజు ఎక్కువ. పెట్టుబడి రూపంలో కూడా బంగారాన్ని నిల్వ ఉంచుకోవడం రివాజు. నగదు కంటే బంగారానికే విలువ ఎక్కువ కావడంతో డిమాండ్ కూడా మన దగ్గర ఎక్కువే. మరోవైపు స్మగ్లర్లకూ మన దేశంలో బంగారం మార్కెట్ స్వర్గధామంలాంటిది. బంగారం దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం వేస్తున్న పన్నుల కారణంగా కిలో పుత్తడి ధర విదేశాలతో

మిగతా 4వ పేజీలో

# ఆడబిడ్డలు మురిసేలా..

## మస్తు రంగుల్లో కోటి బతుకమ్మ చీరెలు

- 225 డిజైన్లలో పట్టును తలపించేలా..
- అంచులకు బంగారు, వెండి రంగుల మెరుపులు
- 6.30 మీటర్ల చీరెలు 90 లక్షలు.. 9 మీటర్లవి 10 లక్షలు
- రూ.317 కోట్ల విలువైన చీరెల తయారీలో సిరిసిల్ల
- మంత్రి కేటీఆర్ చొరవతో మరోసారి భారీ ఆర్డర్లు



**పట్టును** తలపించేలా.. బంగారు, వెండి రంగుల్లో మెరుస్తూ.. ఆడబిడ్డ మురిసేలా బతుకమ్మ చీరెలు సిద్ధమవుతున్నాయి. ఈసారి నూరువర్ణాలు.. 225 డిజైన్లతో కోటి చీరెల తయారీకి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. మున్సిపల్, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ చొరవతో రూ.317 కోట్ల విలువైన కోటి చీరెల ఆర్డర్లు మరోసారి సిరిసిల్లకు దక్కాయి. గతంలో శ్రమకు తగ్గ ఫలితం నేపథ్యంలో.. మరోసారి బతుకమ్మ చీరెల తయారీకి సిరిసిల్ల కార్మిక క్షేత్రం సన్నద్ధమైంది. పట్టుచీరెలను తలపించేలా 6.30 మీటర్ల పొడవైన చీరెలు 90 లక్షలు, తొమ్మిది మీటర్ల పొడవైన పదిలక్షల చీరెలను వచ్చే సెప్టెంబర్ నెలలోగా సిద్ధంచేసేందుకు చేనేత జౌళిశాఖ చర్యలు చేపట్టింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటే బతుకమ్మ పండుగ సందర్భంగా 18 ఏండ్లు నిండిన ప్రతి పేదింటి మహిళలకు నాలుగేండ్లుగా ప్రభుత్వం చీరెలను కానుకగా అందిస్తున్నది. నాణ్యతలో రాజీపడకుండా, అందరినీ ఆకట్టుకొనేలా రంగురంగుల చీరెల తయారీకి రూపకల్పన చేసింది. గుజరాత్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన నూలుతో 18 వేల మరమగ్గాలపై తయారీకి సిద్ధమైంది. దీంతో 10 వేల మంది నేతన్నలకు చేతినిండా పని, శ్రమకు తగిన వేతనం లభించనున్నది.

వివరాలు 2వ పేజీలో

# డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ఎన్నిక రేపు

**ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు**

**టీఆర్‌ఎస్ మద్దతుదారులే ఏకగ్రీవమయ్యే అవకాశం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా కేంద్ర మార్కెటింగ్ సంస్థ (డీసీఎంఎస్)ల చైర్మన్లు, వైస్‌చైర్మన్ల ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రంలోని 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్ చైర్మన్లు, వైస్‌చైర్మన్ల ఎన్నికకు ఈ నెల 29న పోలింగ్ జరుగనున్నది. 9 డీసీసీబీలలో 147 మంది, 9 డీసీఎంఎస్‌లలో 77 మంది డైరెక్టర్లు పోలింగ్‌లో పాల్గొననున్నారు. ఆయా జిల్లాల్లోని డీసీసీబీ కార్యాలయాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11.30 వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఉపసంహరణ ఉంటుంది. పోటీ అనివార్యమైతే మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అన్ని జిల్లాల్లోని డీసీసీబీ, డీసీఎంఎస్‌ల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులే డైరెక్టర్లుగా ఏకగ్రీవం కావడంతో చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక కూడా ఏకగ్రీవంగా జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే జిల్లాలవారీగా చైర్మన్, వైస్‌చైర్మన్ అభ్యర్థులను టీఆర్‌ఎస్ అధిష్ఠానం ఖరారుచేసినట్టు సమాచారం.

# ముగ్గురు జలసమాధి

**నల్లగొండ జిల్లాలో కాల్వలోకి దూసుకెళ్లిన కారు • దంపతులతోపాటు కూతురు మృతి**

**బాలుడిని కాపాడిన స్థానిక రైతు • స్వగ్రామానికి వెళ్లొస్తుండగా ఘటన**



నల్లగొండ జిల్లా ఏఎమ్మార్పీ కాల్వలో పడ్డ కారును వెలికితీస్తున్న స్థానికులు



ప్రమాదం నుంచి బయటపడిన కార్తీక్

**పెద్దఅడిశర్లపల్లి:** కారు కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు జలసమాధి అయ్యారు. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలతోపాటు వారి కూతురు మృతిచెందగా, కొడుకును స్థానికులు కాపాడారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని వడ్డెరగూడేనికి చెందిన ఓర్సు రంగయ్య(40) ఇరవై ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. నాలుగు రోజుల కింద సమీప బంధువుల వివాహానికి భార్యాపిల్లలతో కలిసి గ్రామానికి వచ్చాడు. గురువారం హైదరాబాద్ వెళ్తుండగా దుగ్యాల సమీపంలో ఏఎమ్మార్పీ లింక్ కెనాల్ కాల్వ కట్టపై గుంతను తప్పించే క్రమంలో అదుపుతప్పి వీరు ప్రయాణిస్తున్న కారు కాల్వలోకి దూసుకెళ్లింది. నీటిలో కొట్టుకుపోతున్న కారును గమనించిన రాంబాబు అనే రైతు వెంటనే కాల్వలోకి దూకి రంగయ్య కుమారుడు కార్తీక్‌ను కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చాడు. మరోసారి ప్రయత్నించేలోపే కారు సుమారు 400 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. దీంతో కాల్వ కట్టకు మరోవైపు ఉన్న రైతులు కారును తాళ్లతో కట్టేసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. జేసీబీతో కారును బయటకు తీయగా అప్పటికే రంగయ్యతోపాటు ఆయన భార్య అలివేలు(38), కూతురు కీర్తి(19) చనిపోయారు. కీర్తి ఘట్‌కేసర్‌లోని వీడీఐటీ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నది. ప్రమాద స్థలాన్ని దేవరకొండ డీఎస్పీ ఆనంద్ రెడ్డి పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం దేవరకొండ దవాఖానాకు తరలించారు. రంగయ్య తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



## రాబడి పెరిగేదెట్లా!

### బడ్జెట్‌పై సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే ఆర్థిక సంవత్సర (2020-21) బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం సుదీర్ఘసమీక్ష నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు ఆయన అధికారులతో సంప్రదింపులు జరిపారు. దేశంలో ఆర్థికమాంద్యం నెలకొన్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అవలంబించాల్సిన ఆర్థికవిధానంపై లోతుగా చర్చించారు. బడ్జెట్లో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి? ఏ రంగాలకు ఎంత కేటాయింపులు జరుపాలి? ప్రభుత్వ ప్రాధాన్యాలు ఏమిటి? స్వీయ ఆదాయం పెంచుకునే మార్గాలేమిటి? తదితర అంశాలపై కసరత్తు చేశారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి రొనాల్డ్‌రాస్, సీఎం ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో పైరసీకి అడ్డుకట్ట

- ప్రయాణికుడి ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ తక్షణ స్పందన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో పైరసీని తక్షణమే అరికట్టాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. ఖమ్మం డిపో బస్సులో కొత్త సినిమా వేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని గురువారం ఓ ప్రయాణికుడు ట్విట్టర్‌లో ట్యాగ్ చేయగా.. దీనిపై కేటీఆర్ స్పందించారు. పైరసీ సినిమా వేసినవారిపై చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కు మార్‌కు సూచించారు.

## చేనేతకు యువ డిజైనర్లు అవసరం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రానికి యువ డిజైనర్ల అవసరం ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన గురువారం నారాయణపేట చేనేతవస్త్రాల తయారీ ప్రాంతాలను సందర్శించి చేనేత కళాకారులను ట్విట్టర్‌లో ప్రశంసించారు. రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు వెల్లడించారు. ఈ ట్వీట్‌పై కేటీఆర్ స్పందిస్తూ పోచంపల్లి, కొత్తకోట, సిద్దిపేట, దుబ్బాకను కూడా సందర్శించాలని నీరజ కోనను కోరారు.

## వాట్సప్, ట్విట్టర్, టిక్‌టాక్‌పై కేసు

- దేశంపై దుష్ప్రచారం సాగిస్తున్నాయని ఫిర్యాదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై సామాజిక మాధ్యమాల్లో దేశానికి వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నదన్న ఫిర్యాదు మేరకు వాట్సప్, ట్విట్టర్, టిక్‌టాక్‌పై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీనియర్ జర్నలిస్టు సిల్వేరి శ్రీశైలం ఫిర్యాదుపై నాంపల్లి కోర్టు ఆదేశం మేరకు ఈ కేసు దాఖలైంది. ఈ విషయమై పిటిషనర్ తొలుత సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌లో ఆయన వాట్సప్, ట్విట్టర్, టిక్‌టాక్‌లో సర్క్యులేట్ అవుతున్న కొన్ని పోస్టులను కూడా జతచేశారు. వీటిని పరిశీలించిన న్యాయస్థానం.. ఆయా సామాజిక మాధ్యమాలపై కేసు నమోదు చేయాలని సైబర్‌క్రైమ్ పోలీసులను ఆదేశించింది.





గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో దివ్యాంగుడైన మహ్మద్ సలీం ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ శ్వేతామహంతి, ఇతర అధికారులు

# ..కరుణ చూపి

మొదటిపేజీ తరువాయి...

మారాజంటూ దిల్‌ఖుష్ అయ్యాడు. ముఖ్యమంత్రి ఆ వృద్ధుడితో జరిపిన సంభాషణ..

**వృద్ధుడు:** సార్ నమస్తే..

**కేసీఆర్: షేక్‌హ్యాండ్ ఇస్తూ. ఏమిటి నీ సమస్య?**

**వృద్ధుడు:** నాపేరు మహ్మద్ సలీం. గతంలో డ్రైవర్‌గా పనిచేశా. అల్సర్‌తో బాధపడుతున్నా. నాలుగేండ్ల క్రితం బిల్డింగ్ పైనుంచి పడటంతో ఎడమకాలు తుంటిఎముక విరిగింది. నా కొడుకు ఆరోగ్యం కూడా బాగాలేదు. డబ్బుసాయం చేయండి. సదరం సర్టిఫికెట్ ఉన్నా దివ్యాంగ పింఛన్ ఇవ్వట్లేదు. ఓ బ్రోకర్ పింఛన్ ఇప్పిస్తానని మోసం చేశాడు. అద్దె ఇంట్లో ఉంటున్న నాకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, రేషన్‌కార్డు, వైద్యంకోసం ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించండి. అప్పులుకూడా ఉన్నాయి.

**కేసీఆర్: (వృద్ధుడి చేతిలో చేయివేసి) ఇతన్ని వెంట తీసుకురండి. అంటూ వెంటఉన్న అధికారులను ఆదేశించారు.**

అధికారులు మహ్మద్ సలీంను తీసుకెళ్లి భోజనం పెట్టించి, సమస్యలను సావధానంగా విన్నారు. తర్వాత మరో వాహనంలో గోల్కొండ మోతీమహల్‌లోని అతడి ఇంటివద్ద దింపారు. వృద్ధుడి సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ కలెక్టర్ శ్వేతామహంతిని ఆదేశించారు. దీంతో కలెక్టర్.. ఆర్డీవో శ్రీను, తాసిల్దార్లు అయ్యప్ప, విష్ణుసాగర్, వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ ఇక్బాల్ సిద్ధిఖీ, ఉస్మానియా వైద్యులతో హుటాహుటిన మహ్మద్ సలీం ఇంటికి వెళ్లారు. విచారణ జరిపి, అతడి వివరాలు సేకరించారు. సదరం సర్టిఫికెట్ ఉండటంతో అక్కడికక్కడే పింఛన్‌ను మంజూరుచేశారు. ఒకనెల పింఛన్ మొత్తం రూ.3,016 సలీంకు అందజేశారు. జియాగూడలో డబుల్‌బెడ్‌రూం ఇంటిని మంజూరుచేశారు. సలీం కుమారుడి వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ సహాయంతోపాటు.. ఫుడ్ సెక్యూరిటీ కార్డును మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు.

**నా జన్మ ధన్యమయ్యింది: మహ్మద్ సలీం**

ఆ దారిలో ముఖ్యమంత్రి వస్తున్నట్టు తెల్వదు. పోలీసోళ్లు అనుకుంటుంటే విని.. నా సమస్య చెప్పకుందామనుకున్నా. ముఖ్యమంత్రి కేసీఆర్ నన్నుచూసి కారు ఆపి మాట్లాడటంతో నాజన్మ ధన్యమయింది. నన్ను కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి బిర్యానీ పెట్టించి ఇంటి దగ్గర దింపారు. ఆర్నెళ్లకెల్లి పింఛన్ కోసం తిరుగుతున్నా. ఇప్పుడు కలెక్టర్ మేడం, పెద్దసార్లు వచ్చి రూ.3,016 చేతుల పెట్టిపోయిండ్రు. డబుల్‌బెడ్‌రూం ఇస్తామన్నరు. నాకు చాలా ఖుష్ అయింది. కేసీఆర్‌కు నేను, నా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటాం.

# బతుకమ్మ చీరెలు కోటి

- 225 డిజైన్లు.. వంద వర్ణాలు
- బంగారు, వెండి రంగుల అంచులు
- పట్టును తలపించేలా.. ఆడబిడ్డ మురిసేలా తయారీ
- మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్లకు మరోసారి ఆర్డర్లు
- సెప్టెంబర్‌లోగా లక్ష్యాన్ని చేరేందుకు చేనేత. జౌళిశాఖ చర్యలు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

బతుకమ్మ చీరెల తయారీని ఈసారి ప్రభుత్వం రెండునెలల ముందే ప్రారంభించింది. నాలుగేండ్లుగా చీరెలను అత్యంత నాణ్యతతో అందిస్తున్న ప్రభుత్వం ఏటా సరికొత్త డిజైన్లను రూపొందిస్తూ వస్తున్నది. గతంలో పండుగకు ఐదునెలల ముందు ఆర్డర్లు ఇవ్వడంతో లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేకపోయింది. అందుకే ఈ ఏడాది ఏడునెలల ముందుగా ఆర్డర్లు ఇవ్వడంతో చీరెల తయారీలో నాణ్యతతోపాటు నిపుణత, సరికొత్త డిజైన్లు ఉండేలా చర్యలు తీసుకొంటున్నది. ఆడబిడ్డలకు కానుకగా అందించే చీరెల తయారీతో ఇటు నేత కార్మికులకు కూడా చేతినిండా పని, శ్రమకు తగ్గ వేతనం దక్కేలా చూస్తున్నది. నిష్ణాతులతో ఆకర్షణీయమైన డిజైన్లు, అందమైన రంగుల్లో తయారుచేయిస్తున్నది. ఏటా మార్పులు చేర్పులుచేస్తూ పట్టు చీరెలను తలపించేలా నాణ్యమైన నూలును వినియోగిస్తున్నది. ఈసారి గుజరాత్ నుంచి నూలును తెప్పించింది. చెక్స్, లైనింగ్, ప్లెయిన్ చీరెలు రూపుదిద్దుకోనున్నాయి. ఈ కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవైనవి 90 లక్షలు, 9 మీటర్ల పొడవైనవి 10 లక్షలు తయారుకానున్నాయి.

**మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్లకే ఆర్డర్లు**

టెక్స్‌టైల్స్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్ననేపథ్యంలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమను ఆదుకొనేందుకు మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుంచి వస్త్ర తయారీ ఆర్డర్లు ఇప్పిస్తున్నారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ చీరెల తయారీతో ఇక్కడి నేతన్నలకు చేతినిండా పని, శ్రమకు తగ్గ వేతనం లభిస్తున్నది. దీంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కి అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నది. ఈసారి బతుకమ్మ చీరల తయారీకి రూ.317 కోట్ల ఆర్డర్లు ఇవ్వడంతో సిరిసిల్లలోని 18 వేల మరమగ్గాలు, 10 వేల మంది కార్మికులకు ఉపాధి లభించనున్నది. చీరెల నాణ్యతను పరిశీలించేందుకు చేనేత జౌళిశాఖ 50 మంది అధికారులను నియమించింది. క్వాలిటీలో రాజీపడకుండా నాణ్యమైన చీరెల తయారీకి పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నది.



రూ.317 కోట్ల విలువైన చీరెలు

| | |
|---|---|
| 6.30 మీటర్ల చీరెలు 90 లక్షలు | మరమగ్గాలు 18 వేలు |
| 9 మీటర్లవి 10 లక్షలు | ఉపాధి పొందే కార్మికులు.. 10 వేలు |

**30 లక్షల మీటర్ల ఉత్పత్తి**

సిరిసిల్ల పార్కు అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటున్నది. మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరుచేస్తున్నారు. పార్కులోని యూనిట్లు సంక్షోభంలో కూరుకుపోతే రుణాలు మాఫీ చేయించడంతోపాటు విద్యుత్ సబ్సిడీ రూ.7కోట్లకుపైగా ఇప్పించి ఆదుకొన్నారు. తెలంగాణతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కార్మికులకు పనికల్పిస్తున్నారు. పట్టణంలోని మరమగ్గాలతోపాటు పార్కులోని 62 యూనిట్లకు 30 లక్షల మీటర్ల బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చారు. రేపియర్ మరమగ్గాలపై చెక్స్, లైనింగ్, వివిధరకాల డిజైన్లను తయారుచేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.



**సెప్టెంబర్‌లోగా పూర్తిచేయాలి**

బతుకమ్మ చీరెలు మంచి డిజైన్లతో తయారుచేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. గతంకంటే ఈసారి అందమైన డిజైన్లు, ఆకర్షణీయమైన రంగుల్లో తయారుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు టెక్స్‌టైల్స్ పార్కులోని 62 యూనిట్లను ఎంపికచేశాం. 30 లక్షల మీటర్లు సెప్టెంబర్ నెలలోగా పూర్తిచేస్తాం.

**- తస్లీమా, చేనేత, జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్, సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కు అడ్మినిస్ట్రేటర్**

**మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు**



**వస్త్రపరిశ్రమను** ఆదుకొనేందుకు మంత్రి కే తారకరామారావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ చీరెల ఆర్డర్లు సిరిసిల్లకే ఇవ్వడంతో అందరం సంతోషంగా ఉన్నాం. కార్మిక, యజమాన్య కుటుంబాల పక్షాన కేటీఆర్‌కు కృతజ్ఞతలు. ఈసారి బతుకమ్మ చీరెల ఆర్డర్లు కూడా పెంచారు. పార్కులో దాదాపు 1,500 మంది ఉపాధి పొందుతున్నారు. మంచి డిజైన్లు, చెక్స్, లైనింగ్‌తోపాటు వివిధరకాల డిజైన్లు రాపియర్ లూంలపై తయారీకి సిద్ధంచేస్తున్నాం.

**- అన్నల్‌దాస్ అనిల్, టెక్స్‌టైల్స్ పార్కు వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు**

## ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 9.65 లక్షల మంది విద్యార్థులు రాయనున్నారు. హాల్‌టికెట్లను శుక్రవారం నుంచి కళాశాలలో లేదా ఆన్‌లైన్‌లో www.tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారాతీసుకోవచ్చని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4 నుంచి 18 వరకు జరిగే పరీక్షలకు మొదటి సంవత్సరం 4.8 లక్షల మంది, రెండో సంవత్సరం 4.85 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.36 గంటలకు

సూర్యాస్తమయం: 6.15 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం చతుర్థి ఉదయం 6.45 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: అశ్విని శనివారం తెల్లవారుజాము 4.03 వరకు, తదుపరి భరణి, అమృతఘడియలు: రాత్రి 7.59 నుంచి 9.47 వరకు, రాహుకాలం: ఉదయం 10.58 నుంచి మధ్యాహ్నం 12.26 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.56 నుంచి 9.42 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.49 నుంచి 1.35 వరకు, వర్జ్యం: రాత్రి 11.34 నుంచి 1.22 వరకు.

# హైదరాబాద్‌లో ప్రావిడెన్స్

మొదటిపేజీ తరువాయి...

ఇన్నోవేషన్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ గురువారం ప్రారంభించారు. వినూత్న, సాంకేతికత అభివృద్ధికి అవకాశం కల్పించే నూతన సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం సంతోషంగా ఉన్నదని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ప్రావిడెన్స్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఆరోగ్య సంరక్షణ పరిశ్రమ హబ్‌గా తెలంగాణ స్థానాన్ని ప్రావిడెన్స్ గ్లోబల్‌సెంటర్ మరింత పటిష్ఠంచేస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రావిడెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ బీజే మూరే మాట్లాడుతూ.. 'మెరుగైన ప్రపంచం కోసం ఆరోగ్యం' అనేది తమ సంస్థ ఆశయమని చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సెంటర్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. డిజిటల్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ దిశగా ప్రయాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన ఉన్నతస్థాయి ప్రతిభ భారత్‌లో ఉన్నదని చెప్పారు. వచ్చే నాలుగేండ్లలో రూ.700కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు మూరే తెలిపారు. సమావేశం అనంతరం కంపెనీ కంట్రీ మేనేజర్ మురళీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. 80వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌లో ప్రస్తుతం 350 మంది సిబ్బంది కూర్చోవడానికి వీలుంటుందని తెలిపారు. వచ్చే నాలుగేండ్లలో ఈ సంఖ్యను 2వేలకు పెంచుకోబోతున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్‌లో నైపుణ్యం కలిగిన సిబ్బందికి కొదువ లేదన్న ఆయన.. నైపుణ్యం కలిగిన వారికోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన టాస్క్‌తో చర్చలు జరుపనున్నట్టు చెప్పారు.

**ఆరోగ్యరక్షణ సేవల్లో మేటి.. ప్రావిడెన్స్**

అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థ ప్రావిడెన్స్.. ఆరోగ్యరంగంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటి. ఈ సంస్థకు అమెరికాలో 51 దవాఖానలు, వెయ్యి క్లినిక్‌లు ఉన్నాయి. 1.19 లక్షల మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ సాంకేతికత, వినూత్నతపై దృష్టి పెట్టేందుకు 2019లో ప్రావిడెన్స్, మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ హెల్త్‌కేర్ డిజిటల్ పరివర్తనను ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించనున్నది. ఇంజినీరింగ్, ఆధునిక మౌలిక వసతులు, డాటా ఇంటెలిజెన్స్, డిజిటల్ ఇన్నోవేషన్, ప్రొఫెషనల్ సర్వీసులు, సైబర్‌సెక్యూరిటీ, అప్లికేషన్స్ డెవలప్‌మెంట్, సపోర్ట్‌పై ఈ సెంటర్ ప్రధానంగా దృష్టిసారిస్తుంది. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జోయల్ రీఫ్‌మాన్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రావిడెన్స్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తబితా లిబర్‌మాన్ పాల్గొన్నారు.

## రాష్ట్రాలకు ప్రాధాన్యం

**సీఈఏ సుబ్రమణ్యన్‌కు మంత్రి కేటీఆర్ వినతి**

**పారిశ్రామిక అభివృద్ధి చర్యల నివేదన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్రం తీసుకొనే విధాన నిర్ణయాల్లో రాష్ట్రాలకు ప్రాధాన్యమివ్వాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు కోరారు. గురువారం ప్రగతిభవన్‌లో కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) కృష్ణమూర్తి సుబ్రమణ్యన్‌తో మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. ప్రగతిపథంలో వేగంగా దూసుకుపోతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలను కేంద్రం ఉపేక్షించరాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి తీసుకొంటున్న చర్యలను సుబ్రమణ్యన్‌కు వివరించారు. పెట్టుబడుల సమీకరణకోసం చేస్తున్న ప్రయత్నాలు.. సాధించిన విజయాలను వెల్లడించారు. గతంలో హైదరాబాద్ ఐఎస్‌బీలో పనిచేసిన నాటి నుంచి సుబ్రమణ్యన్‌తో తనకు అనుబంధం ఉన్నదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. సుబ్రహ్మణ్యన్ ఆధ్వర్యంలో దేశ ఆర్థికవ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు, ప్రాధాన్యాలను మంత్రి కేటీఆర్‌కు సీఈఏ సుబ్రహ్మణ్యన్ వివరించారు.



గురువారం ప్రగతిభవన్‌లో కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్‌కు శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు

## మూగ బాలుడికి మంత్రి కేటీఆర్ భరోసా

- శస్త్ర చికిత్సకు రూ.3 లక్షల ఎల్వోసీ మంజూరు



సాత్విక్

**ఎల్లారెడ్డిపేట:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ముందుంటున్నారు. సమస్య దృష్టికి వస్తే చాలు స్పందిస్తూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన పుట్టుమూగ బాలుడు చీకట్ల సాత్విక్ వైద్యం కోసం రూ.3 లక్షల ఎల్వోసీ మంజూరుచేసి అండగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన చీకట్ల లక్ష్మి, కనకయ్య దంపతుల కుమారుడు ఆరేండ్ల వయసున్న సాత్విక్ పుట్టుకతోనే మూగవాడు. నెలకిందట సాత్విక్‌కు హైదరాబాద్‌లోని ఈఎన్టీ దవాఖానలో పరీక్షలు చేయించారు. బాలుడికి మాటలు వచ్చేందుకు రూ.4 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పగా, ఆర్థికస్తోమత లేకపోవడంతో సాత్విక్ కుటుంబ సభ్యులు మిన్నకుండిపోయారు. బాలుడి సమస్యను బండలింగంపల్లి మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ నర్సాగౌడ్ వారంకిందట మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సాయమందించిన మంత్రి అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారని మాజీ సర్పంచ్ చెప్పారు. త్వరలోనే సాత్విక్‌కు శస్త్రచికిత్స చేయనున్నారు. సాయంచేసిన మంత్రికి బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్పీఆర్ వాయిదా

మొదటిపేజీ తరువాయి...

ప్రకారం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య ఆర్నెళ్ల వ్యవధిలో ఏదో ఒక 45 రోజుల కాల పరిమితిలో ఎన్పీఆర్, జనగణన ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. పలు రాష్ట్రాలు ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ప్రక్రియను అమలు చేయనున్నాయి. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని వాయిదా వేసింది. ప్రక్రియ పూర్తికి చాలా సమయం ఉన్నందున ప్రస్తుతానికి ఎన్పీఆర్‌ను వాయిదా వేసి, పరిస్థితులమేరకు తర్వాత ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే కలెక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని కూడా వాయిదా వేసినట్లు తెలిసింది. రాష్ట్రమంతటా పట్టణ ప్రగతి కార్యక్రమం జరుగుతున్నది. ఆ తర్వాత వెంటనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఇవన్నీ పూర్తయిన తర్వాతే ఎన్పీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నది. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలు ఎన్పీఆర్ ప్రక్రియను పెండింగ్‌లో పెడుతున్నట్లు ప్రకటించాయి. వాటితోపాటు ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లను వ్యతిరేకిస్తున్న బీజేపీయేతర రాష్ట్రాలతో సంప్రదించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నది. ఎన్పీఆర్ కొత్త ఫార్మాట్‌ను మార్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్రాలు సంయుక్తంగా ప్రయత్నాలు చేసే అవకాశం ఉన్నది. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నదానిపై నిపుణులతో రాష్ట్ర అధికారులు చర్చిస్తున్నారు.

**లోకం పోకడ**




ముప్పై వేలు కట్టలేడట.. పోనీ, ముప్పై వేల మొక్కలు నాటాలని చెబుదామా?

## 68 జూనియర్ కాలేజీల మూసివేత

- పరీక్షలు ముగిశాక నిబంధనలు పాటించనివాటిపై చర్యలు
- హైకోర్టుకు తెలిపిన ఇంటర్‌బోర్డు
- ఏప్రిల్ 4కల్లా నివేదిక ఇవ్వాలన్న న్యాయస్థానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిబంధనలు పాటించని 68 జూనియర్ కాలేజీలను మూసివేస్తామని ఇంటర్‌బోర్డు తెలిపింది. పరీక్షలు అయిపోగానే వాటిపై చర్యలు తీసుకొంటామని హైకోర్టుకు విన్నవించింది. రూల్స్ పాటించని నారాయణ, శ్రీచైతన్య కాలేజీలపై చర్యలు తీసుకోవాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మరోమారు విచారణ చేపట్టింది. ఇంటర్‌బోర్డు తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఇప్పటికే ఆయా కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీచేశామని వివరించారు. గుర్తింపులేని కాలేజీల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందినవి 18, నారాయణకు చెందినవి 26 ఉన్నాయని తెలిపారు. నోటీసులిస్తే సరిపోదని, ఆయా కాలేజీలపై ఏం చర్యలు తీసుకున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. మార్చి 28తో విద్యాసంవత్సరం ముగుస్తుందని, ఆ తర్వాత గుర్తింపులేని 68 కాలేజీలను మూసేస్తామని సంజీవ్‌కుమార్ వివరించారు. ఈ కాలేజీలకు వచ్చే విద్యాసంవత్సరంలో అఫిలియేషన్ జారీచేయబోమన్నారు. గుర్తింపులేని 18 కాలేజీలకు అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేయబోమని శ్రీచైతన్య అండర్‌టేకింగ్ సమర్పించిందన్నారు. మూసేసిన కాలేజీల నివేదికను ఏప్రిల్ 4 నాటికి తమకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అగ్నిమాపకశాఖ తనిఖీచేసిన కాలేజీల సంఖ్యను కూడా తెలియజేయాలన్నది. విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేసింది.

# 3,4 రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక

- 'రేవంత్ భూదందా'పై అన్ని కోణాల్లో విచారణ
- విచారణాధికారిగా ఆర్డీవో చంద్రకళ
- గోపన్‌పల్లిలోని భూమివద్ద బాధిత కుటుంబీకుల బైఠాయింపు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిపై అన్నికోణాల్లో విచారణ జరుపుతామని రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళ తెలిపారు.1954 నుంచి అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి.. మూడు, నాలుగు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. 127 సర్వేనంబర్‌లోని 10.21 ఎకరాల భూవివాదంపై సమగ్రంగా విచారణ జరిపేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ గురువారం ఆర్డీవో చంద్రకళను విచారణాధికారిగా నియమించారు. భూమికి సంబంధించి పాత రికార్డులన్నీ తనిఖీ చేస్తామని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. 1954 కంటే ముందు ఎవరు పొజిషన్‌లో ఉన్నారు? తర్వాత ఎలా మారిందో రికార్డులను పరిశీలిస్తామన్నారు. రికార్డులు ఎప్పటివరకు సక్రమంగా ఉన్నాయి? ఎప్పటినుంచి మార్పులు జరిగాయో నివేదిక తయారుచేస్తామని చెప్పారు. ఫీల్డ్ విచారణకు వెళ్లి స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తామని తెలిపారు. వారసులుగా చెప్పుకొంటున్నవారు ఎప్పటి నుంచి ఎప్పటివరకు పొజిషన్‌లో ఉన్నారు? ఎప్పటినుంచి రికార్డులు తారుమారయ్యాయో పరిశీలిస్తామని ఆర్డీవో చెప్పారు. భూమికి సంబంధించి 6,7 ఆర్వోఆర్లు మారాయి, వాటిని పరిశీలించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఈసీలు, తాసిల్ నుంచి అన్ని డాక్యుమెంట్లు తీసుకొంటానని పేర్కొన్నారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి 3, 4 రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని చెప్పారు.



గురువారం రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళను కలిసిన 'రేవంత్ భూదందా' బాధితులు

**ఆర్డీవోను కలిసిన బాధిత కుటుంబీకులు**

తమకు న్యాయంచేయాలని కోరుతూ 'రేవంత్ భూదందా' బాధితులు గురువారం రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళను కలిశారు. అక్రమ మ్యుటేషన్లపై ఫిర్యాదుచేశారు. 127 సర్వేనంబర్‌లోని భూమికి సంబంధించి వారివద్ద నున్న పత్రాలను ఆర్డీవో సేకరించారు. బాధితుల్లో మరికొంతమంది కుటుంబసభ్యులతో సహ భూమి వద్ద బైఠాయించారు. తమకు న్యాయంకావాలంటూ నినాదాలు చేశారు.



గరుడముద్దలు ఎగురవేసి ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

## యాదాద్రిలో ధ్వజారోహణం

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాతాహ్వానం, భేరీపూజ తదితర తంతులను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. శుక్రవారం స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించనున్నారు. ఉదయం వేదపారాయణం, మత్స్యావతార అలంకారసేవ, రాత్రి శేషవాహనసేవ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపుడి నరసింహాచార్యులు, ఉప ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, యాజ్ఞికులు శేషం ప్రణీతాచార్యులు ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ హైవేలో మొక్కల పెంపకం నమూనా చిత్రం

## వరంగల్ హైవేకు పచ్చతోరణం

- రూ.5.55 కోట్లతో ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు సుందరీకరణ
- పనులను ప్రారంభించిన హెచ్‌ఎండీఏ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వరంగల్ జాతీయ రహదారి పచ్చని అందాలతో త్వరలోనే కనువిందు చేయనున్నది. హెచ్‌ఎండీఏ అర్బన్‌ఫారెస్ట్రీ విభాగం అధికారులు ఔటర్ రింగురోడ్డు ఘట్‌కేసర్ నుంచి రాయగిరి (యాదాద్రి) వరకు సుందరీకరణ పనులను గురువారం ప్రారంభించారు. సుమారు 30 కి.మీ. మేర నేషనల్ హైవే-163 వెంట సెంట్రల్ మీడియన్ (2.3 మీటర్లు)లో గ్రీనరీ పనులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కు మార్ పర్యవేక్షణలో మొదలయ్యాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు హెచ్‌ఎండీఏ ఈ పనులను రూ.5.55 కోట్లతో రెండునెలల్లో పూర్తిచేయాలని సంకల్పించింది. కి.మీ.కు రూ.18.50 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టారు. హైదరాబాద్ నుంచి యాదాద్రికి పెద్దసంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఆహ్లాదంగా ప్రయాణం సాగేలా సెంట్రల్ మీడియన్‌లో 3.72 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు.



## ఉపాధిహామీలో పారిశుద్ధ్య పనులు

- అవకాశాలను పరిశీలించాలి
- పంచాయతీరాజ్‌పై సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉపాధిహామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం పల్లెప్రగతి కార్యక్రమం చేపట్టామని, దీనిలో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉండటంతో పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన ఆయన.. పల్లెప్రగతి, పింఛన్ల పంపిణీపై చర్చించారు. ఉపాధి పథకం కింద చేపట్టిన శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డుల నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. హరితహారం కింద నాటిన మొక్కల్లో 85 శాతం బతికించాలని ఆదేశించారు. అభయహస్తం పథకం కింద లబ్ధిచేకూరనివారిలో అర్హులను గుర్తించి ఆసరా పింఛన్లు అందించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఉపాధి హామీ ప్రత్యేక కమిషనర్ సైదులు, ఈఎన్సీ సత్యనారాయణ రెడ్డి, సీఈ రవీందర్ పాల్గొన్నారు.

## బీసీ ఫెడరేషన్లతో ఉపాధి కల్పన

నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ■ అధికారులకు మంత్రి గంగుల ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీసీల ఆర్థిక, సామాజిక ప్రగతి లక్ష్యంగా 11 ఫెడరేషన్ల ద్వారా ఆయా వృత్తులవారికి ఉపాధి కల్పించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల సూచించారు. సంక్షేమహాస్టళ్లలో వసతులు మెరుగుపర్చాలని ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సంక్షేమభవన్ లో జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. పదివేలమంది బీసీ మహిళలకు శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లు అందించాలన్నారు. యువతులకు నిఫ్ట్‌ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరారు. ఐదుగురు నిరుద్యోగులు ఒక యూనిట్‌గా ప్రతిజిల్లాకు 'ఆపద్బంధు' పేరిట అంబులెన్సులను బీసీ కార్పొరేషన్ ద్వారా అందించేందుకు సీఎం కేసీఆర్ అనుమతి కోరనున్నట్టు చెప్పారు. రెగ్యులర్ సంక్షేమాధికారులను నియమించేందుకు తీసుకోవాల్సినచర్యలపై మంత్రి సమీక్షించారు.

# రైతు ఆదాయం రెట్టింపు

- వ్యవసాయం, అనుబంధరంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు
- ఐకార్ వార్షిక సమావేశంలో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్
- మరో 50 వేల టన్నుల కందుల కొనుగోలుకు అనుమతివ్వండి
- మద్దతు ధరపై అధికారం రాష్ట్రాలకివ్వాలి: రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి



గురువారం ఢిల్లీలో జరిగిన ఐకార్ వార్షిక సమావేశంలో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు నమస్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడమే కేంద్రప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అన్నారు. వ్యవసాయం, దాని అనుబంధరంగాలను ప్రోత్సహించేందుకు 2020-21 బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్టు తెలిపారు. వ్యవసాయంలో నూతన పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) 91వ వార్షిక సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. కార్యక్రమంలో కేంద్రమంత్రులు నరేంద్రసింగ్‌తోమర్, పీయూష్‌గోయల్, పురుషోత్తం రూపాల, కైలాష్ చౌదరి, ప్రతాప్ చంద్ర సారంగి, రావుచంద్రజింగ్‌సింగ్‌తో పాటు, తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్రవ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐకార్ 2019-20 వార్షిక నివేదికను కేంద్రమంత్రులు విడుదల చేశారు. దేశంలో ఏర్పాటుచేసిన కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను మంత్రి తోమర్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆయారాష్ట్రాల్లో భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఉత్పత్తి వ్యయంలో మార్పులు ఉంటున్నాయని.. ఈ మేరకు పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించే అవకాశం రాష్ట్రాలకే ఇవ్వాలని కోరారు. తెలంగాణ సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా పథకాలతో అన్నదాతలకు అండగా నిలిచారని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం సహకరించాలని కోరారు. నీటియాజమాన్యంపై పరిశోధన కోసం రాష్ట్రానికి ఏఐసీఆర్ ప్రాజెక్టును మంజూరుచేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను విత్తనకేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వివిధ రకాల చర్యలు చేపట్టినట్టు నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఐదేండ్లలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి అధిక దిగుబడులు ఇచ్చే తెలంగాణ సోన, కేఎన్ఎం13, బతుకమ్మ రకం వడ్లు, కరీంనగర్ 1 రకం మొక్కజొన్న, పీఆర్జీ 176 రకం కందులు, డబ్ల్యూజీజీ 42 రకం పెసలు తదితర 13 రకాల విత్తనాలు విడుదల చేసినట్టు వివరించారు. వర్షాధారంగా పండే పత్తికి ప్రత్యామ్నాయంగా కంది పంటను సాగుచేసేలా పీఆర్జీ176 రకం విడుదల చేసి, ప్రోత్సహించడం ద్వారా 2.86 లక్షల హెక్టార్లలో కందిపంట సాగు పెరిగిందని తెలిపారు. దాదాపు 2 లక్షల టన్నుల కంది దిగుబడి వచ్చిందని.. కానీ, కనీస మద్దతు ధరకు 47,500 మెట్రిక్ టన్నుల కొనుగోలుకే కేంద్రం, అనుమతిచ్చిందని చెప్పారు. మరో 50 వేల మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

### 40% పెరిగిన ఆహారధాన్యాల ఉత్పత్తి

మక్కజొన్నలో ఫాల్‌ఆర్మీవామ్ (కత్తెరపురుగు) అనే రకం పురుగును సమర్థంగా అరికట్టడం ద్వారా ఈ పంట సాగు 5 లక్షల హెక్టార్లకు పెరిగిందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. 25.59 లక్షల టన్నుల మక్కజొన్న ఉత్పత్తి సాధించినట్టు చెప్పారు. ఆరేండ్లలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న వ్యవసాయ అనుకూల చర్యలతో ఆహారధాన్యాల ఉత్పత్తి గతేడాదికన్నా ఈసారి 40.8 శాతం పెరిగి 130 లక్షల టన్నులకు చేరినట్టు తెలిపారు. వ్యవసాయ, ఆహారవృద్ధి పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. అనుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఏఐసీఆర్పీ కింద జగిత్యాల జిల్లాలో ఆవాల పంటపై పైలెట్‌ప్రాజెక్టును ఏర్పాటుచేయాలని, తెలంగాణలోకొత్తజిల్లాల ప్రాతిపదికన మరిన్ని కృషివిజ్ఞానకేంద్రాలు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తిచేశారు. అదనంగా కందుల కొనుగోలుకు మళ్లీ లేఖపంపాలని కేంద్రమంత్రి తోమర్ సూచించారని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జిపై వేటు

**కరీంనగర్ లీగల్:** పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కే బాలచందర్‌పై వేటుపడింది. ఆయనను సర్వీసు నుంచి పూర్తిగా తొలగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బాలచందర్ మేడ్చల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన సమయంలో ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. వీటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆరోపణలు వాస్తవమని తేలడంతో బాలచందర్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. కరీంనగర్ మొబైల్ కోర్టు (పీసీఆర్) మేజిస్ట్రేట్.. పెద్దపల్లి కోర్టుకు ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.

## బాబు యాత్ర ఉద్రిక్తం

**అమరావతి:** ఏపీ మాజీ సీఎం చంద్రబాబు ప్రజాచైతన్యయాత్ర పేరుతో ఉత్తరాంధ్ర పర్యటన చేపట్టిన సందర్భంగా గురువారం విశాఖ విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. విశాఖను పరిపాలన రాజధానిగా ఉత్తరాంధ్ర ప్రజలు స్వాగతిస్తుంటే టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్నందుకు నిరసనగా ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నేతలు చంద్రబాబును విశాఖ విమానాశ్రయం వద్దే అడ్డుకున్నారు. కొన్ని గంటలపాటు చంద్రబాబు వాహనంలోనే ఉండిపోయారు. ఆందోళనకారులు కోడిగుడ్లు, టమోటాలు విసరడంతో ఉద్రిక్తత నెలకొన్నది. పర్యటనను వాయిదా వేసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు కోరినా చంద్రబాబు ససేమిరా అనడంతో అదుపులోకి తీసుకొని హైదరాబాద్ విమానం ఎక్కించారు.

## సీపీఎస్‌పై నిర్ణయం రాష్ట్రాలకే

- టీఎన్జీవో అధ్యక్షుడు కారం డిమాండ్
- హైదరాబాద్‌లో ఉద్యోగుల డిమాండ్స్ డే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం (సీపీఎస్)ను రద్దుచేసే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని ఆలిండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సీపీఎస్‌ను రద్దుచేసి, పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఏఐఎస్‌జీఈఎఫ్ పిలుపుమేరకు కేంద్రప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం ఉద్యోగులు డిమాండ్స్‌డే నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కారం మాట్లాడుతూ.. చాలా రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దుచేయాలని నివేదికలు ఇచ్చినప్పటికీ, కేంద్రం సానుకూలంగా స్పందించడం లేదన్నారు. దీనిపై రాష్ట్రాలకు నిర్ణయాధికారం లేకపోవడంతో వెనక్కు తగ్గుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధానకార్యదర్శి మామిళ్ల రాజేందర్, సహాధ్యక్షురాలు రేచల్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముజీబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మీ సహనానికి జేజేలు

- ఆవేదనలో అనరాని మాటలన్నాం
- మా తిట్లను పట్టించుకోకండి
- సత్వర న్యాయానికి వందనాలు
- మాట నిలుపుకొన్న మంత్రి కేటీఆర్
- పోలీసులు, కలెక్టర్‌తో హాజీపూర్‌వాసుల ముఖాముఖి
- ప్రభుత్వ చర్యలపై ప్రశంసల వర్షం



గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్‌లో గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ మహేశ్‌భగవత్. చిత్రంలో కలెక్టర్ అనితారామచంద్రన్ తదితరులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ బొమ్మలరామారం:** 'మిమ్మల్ని అనరాని మాటలన్నాం. అప్పుడేదో బాధలో ఉన్నాం. మా పిల్లలు కనబడకుండాపోయి శవాలై కనిపించినప్పుడు మా గుండెలు బరువెక్కాయి. అవన్నీ పట్టించుకోకండి. మీ సహనానికి జేజేలు. నరహంతకుడిని పట్టుకొని వేగంగా శిక్ష కూడా విధించారు. ఇప్పుడు మా గ్రామం ప్రశాంతంగా ఉన్నది. ఇకనుంచి అధికారులకు, పోలీసులకు అండగా ఉంటాం. వారు చేపట్టబోయే ప్రతి పనికి సంపూర్ణ మద్దతు అందజేస్తాం. వేగంగా దర్యాప్తు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నందుకు మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు' అని యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్‌వాసులు తమ మనోభావాలను అధికారులతో పంచుకొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పోలీసులు చేపడుతున్న పటిష్ఠ చర్యలతో 10 నెలలుగా నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి, మద్యం తాగడం పూర్తిగా బంద్‌అయి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నదని చెప్పారు. ఈ ఘటన తర్వాత హాజీపూర్‌లో రూ.14 లక్షలు ఖర్చుచేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీపీ మహేశ్‌భగవత్ తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించామని, ప్రజల్లో నెలకొన్న అపనమ్మకాన్ని తొలిగించామని చెప్పారు. కొంత మంది బాలబాలికలు నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలను చూశానని, త్వరలో దాదాపు 15 మంది బాలికలకు సైకిళ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. హంతకుడికి వెంటనే ఉరిశిక్ష పడేలా కృషి చేసినందుకు బాధితుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామం నుంచి బొమ్మలరామారానికి త్వరగా చేరుకొనేలా బ్రిడ్జి నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని గ్రామస్థులు విజ్ఞప్తిచేశారు. కాగా, బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పించాలంటూ సర్పంచ్ కవితా వెంకటేశం అధికారులకు విన్నవించారు.

### కలెక్టర్‌కు మంత్రి కేటీఆర్ ఫోన్

మంత్రి కేటీఆర్.. గురువారం ఉదయం తనకు ఫోన్‌చేశారని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ తెలిపారు. హాజీపూర్ బాధితులకు అందిన, అందాల్సిన సాయం, సదుపాయాలను అడిగి తెలుసుకొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా హాజీపూర్‌వాసులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నదని మంత్రికి తెలుపగా.. ఆ గ్రామ ప్రజలు, బాధితుల కుటుంబాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలియజేయాలని కేటీఆర్ సూచించినట్టు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం, పోలీసులే కాకుండా ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా మహిళల జోలికి వచ్చేవారిని అణచివేయాలని కోరారు. బాధిత కుటుంబాల బాధను తీర్చలేం కానీ వారికి ఎప్పటికీ అండగా ఉంటామని చెప్పారు. జరిగిన ఘటనపై మంత్రి కేటీఆర్‌కు ట్వీట్‌చేసినప్పుడు ఆయన తమకు భరోసా కల్పించిన విధానం కొండంత ధైర్యాన్నిచ్చిందని పలువురు యువకులు తెలిపారు.

## స్వీయ క్రమశిక్షణ ముఖ్యం

- ఆత్మగౌరవం దెబ్బతీయొద్దు
- పటాన్‌చెరు ఘటన నేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి దిశానిర్దేశం

**హైదరాబాద్ / పటాన్ చెరు, నమస్తే తెలంగాణ:** పోలీస్‌శాఖ పనితీరును సమాజం సునిశితంగా పరిశీలిస్తున్నదని, ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. వ్యక్తి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిధంగా ప్రవర్తించవద్దన్నారు. పటానుచెరు లాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవహరించాలన్నారు. పటాన్‌చెరులో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని తండ్రి పట్ల ఒక కానిస్టేబుల్ అనుచితంగా ప్రవర్తించిన నేపథ్యంలో గురువారం ఆయన తన కార్యాలయం నుంచి పోలీస్ యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసింగ్‌పై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరించాలని, ఇందుకు పోలీస్‌స్టేషన్లవారీగా ఫోకస్‌గ్రూపులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

### తన్నిన కానిస్టేబుల్‌పై వేటు

ఆత్మహత్యకు పాల్పడిన వెలిమెల నారాయణ కాలేజీ విద్యార్థిని సంధ్యారాణి తండ్రి పట్ల అనుచితంగా ప్రవర్తించిన కానిస్టేబుల్ శ్రీధర్ (పీసీ-349)పై సస్పెన్షన్ వేటుపడింది. చంద్రశేఖర్‌ను కానిస్టేబుల్ శ్రీధర్ బూటుకాలితో తన్నారు. దీనిపై మంత్రి కేటీఆర్ ట్వీట్ చేయడంతో హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి దృష్టిసారించి.. కానిస్టేబుల్‌ను సస్పెండ్‌చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా ఇంచార్జి ఎస్పీ చందనాదీప్తి బుధవారం శ్రీధర్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్‌చేయగా గురువారం సస్పెండ్ చేశారు.


**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

**FOOD SAFETY OFFICER IN THE DIRECTOR, INSTITUTE OF PREVENTIVE MEDICINE PUBLIC (HEALTH) LABORATORIES & FOOD (HEALTH) ADMINISTRATION AND GREATER HYDERABAD MUNICIPAL CORPORATION VIDE NOTFN NO. 10/2019 & ASSISTANT REGISTRAR IN KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES, WARANGAL VIDE NOTFN NO. 08/2019**

TSPSC has conducted Written Examination for the notfn No. 10/2019 on 23/02/2020 and Preliminary Exam for notfn No. 08/2019 on 25/02/2020. The Preliminary Keys of these exams will be available on TSPSC website from 29/02/2020. The objections on the Preliminary Keys (Except of the Paper General English as the paper is qualifying in nature) will be accepted online on TSPSC Website from 02/03/2020 to 08/03/2020. Candidates are advised to note the above dates and submit their objections through the link provided. Objections received beyond 08/03/2020 will not be considered at any cost. For further details please visit www.tspsc.gov.in

Date: 27/02/2020
DIPR R.O. No. 723-PP/CL/Advt/1/2019-20
Sd/-
PRINCIPAL SECRETARY




నాంపల్లి కోర్టుకు హాజరైన నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత

## ఉద్యమ కేసులో కోర్టుకు మాజీ ఎంపీ కవిత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నిజామాబాద్ సిటీ:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన ఓ కేసుకు సంబంధించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2010లో అప్పటి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ రాజీనామా చేయడంతో ఉపఎన్నికలు వచ్చాయి. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు మద్దతుగా నిజామాబాద్‌లో జరిగిన ఆందోళనలో కవిత పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా ఎస్పీ ఆఫీస్ ఎదుట ధర్నాచేసిన కారణంగా కవితపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీనికి సంబంధించి ఇటీవల సమన్లు జారీకావడంతో ఆమె కోర్టుకు హాజరయ్యారు. వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని తెలిపిన కోర్టు.. కేసు విచారణను మార్చి 19కి వాయిదా వేసింది.

# టీబీ నియంత్రణలో మేటి

- వ్యాధిగ్రస్థుల గుర్తింపు, పరీక్షల్లో తెలంగాణ మొదటిస్థానం
- వ్యాధి నియంత్రణలో రెండో ర్యాంకు
- 2025కి వ్యాధినిర్మూలనే లక్ష్యం
- అసత్య వార్తా కథనాలను ఖండించిన హెల్త్ కమిషనర్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్షయ (టీబీ) వ్యాధి నియంత్రణలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉన్నది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న వైద్య విధానాలతో క్షయ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలనిస్తున్నది. వ్యాధిని యంత్రణలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రకటించిన ర్యాంకులే ఇందుకు నిదర్శనం. టీబీ వ్యాధిగ్రస్థుల గుర్తింపులో, వ్యాధి నిర్ధారణ పరీక్ష - యూడీఎస్టీ (యూనివర్సిల్ డ్రగ్ ససెప్టిబిలిటీ టెస్టింగ్)లో వందశాతం లక్ష్యాన్ని దాటి తెలంగాణ మొదటిస్థానంలో నిలిచింది. అలాగే వ్యాధి నియంత్రణలో 90 శాతం లక్ష్యాన్ని సాధించి రెండోస్థానంలో నిలిచింది. ఇక 2025 నాటికి రాష్ట్రంలో టీబీని సమూలంగా నిర్మూలించాలన్న లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం కృషిచేస్తున్నది. దీనిపై రాష్ట్రంలోని వివిధ వైద్య విభాగాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాయి. వ్యాధిగ్రస్థులను గుర్తించడంతోనే వదిలిపెట్టకుండా వారికి పూర్తిగా నయమయ్యేంతవరకూ మందులు పంపిణీ చేస్తున్నాయి.

### టీబీ నియంత్రణకు విస్తృతచర్యలు

క్షయ నియంత్రణలో భాగంగా వ్యాధినిర్ధారణ, వైద్యసేవలు అందించేందుకు హైదరాబాద్‌లో విస్తృత చర్యలు చేపట్టారు. వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు, వారికి నయమయ్యేవరకు పర్యవేక్షించేందుకు 19 యూనిట్లు సేవలందిస్తున్నాయి. గత ఏడాది హైదరాబాద్‌లోనే 16,594 కేసులు నమోదుకాగా, వారిలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు 3,575 మంది, ఇతర రాష్ట్రాలకు చెందినవారు 1,036 మంది ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటురంగంలో 13 వేలమందికి హైదరాబాద్‌లో వైద్యం అందించారు.

**కేంద్రప్రభుత్వం సూచించిన నాలుగు ప్రధాన అంశాల్లో తెలంగాణకు దక్కిన ర్యాంకు, సాధించిన లక్ష్యం వివరాలు**

| సూచిక | దేశంలో మనకు దక్కిన ర్యాంకు | సాధించిన లక్ష్యం శాతంలో |
| --- | --- | --- |
| టీబీ వ్యాధిగ్రస్థుల గుర్తింపు | 1 | 102 |
| యూడీఎస్టీ | 1 | 108 |
| వ్యాధినియంత్రణ | 2 | 90 |
| టీబీ హెచ్ఐవీ స్టేటస్ | 5 | 90 |

### టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం వాస్తవవిరుద్ధం

టీబీ వ్యాధి నియంత్రణలో తాము సదా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ యోగితా రాణా తెలిపారు. టీబీ వ్యాధి విస్తరణపై టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రికలో ప్రచురించిన కథనం వాస్తవవిరుద్ధంగా ఉన్నదని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో 19 టీబీ యూనిట్లు, 83 మైక్రోస్కోపిక్ కేంద్రాలు, ఏడు వైద్య కళాశాలలు, ఒక జిల్లా దవాఖాన, మూడు ఏరియా దవాఖానలు, 90 యూపీహెచ్‌సీల ద్వారా టీబీ వ్యాధిగ్రస్థులకు సేవలు అందిస్తున్నామని వివరించారు. నగరంలోని మురికివాడల్లో ఇంటింటి సర్వే నిర్వహించి టీబీపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. టీబీ చాంపియన్లు, ఆయా సంఘాల నేతలు, స్థానిక నాయకులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించి టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు యోగితారాణా వివరించారు.






## మొక్కనాటిన నవ వధువు

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** వనపర్తిలోని 19వ వార్డు గాంధీనగర్‌లో గురువారం నవ వధువు గీత కాంచన వార్డు కౌన్సిలర్ చంద్రకళతో కలిసి మొక్క నాటారు. వివాహం సందర్భంగా భాగంగా నవవధువుకు కౌన్సిలర్ మొక్కను పంపిణీచేసి పచ్చని మొక్కలా ఎప్పుడూ దాంపత్య జీవితం ఉండాలని ఆశ్వీరదించారు.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్. ఫోన్: 0878-2950033
సవరణ: తేది: 24.02.2020న "టైమ్స్ ఆఫ్ ఇండియా, నమస్తే తెలంగాణ, సియాసత్ మరియు ప్రజా తంత్ర పత్రికలలో ప్రచురించబడిన పనులలోని టెండరు నోటీసు నం. SE 36/2019-2020 తేది: 14.02.2020 నుండి SE 37/2019-2020 తేది: 14.02.2020 నకు సవరణ.
క్ర.సం. 1, డివిజన్ పేరు: కరీంనగర్-2, మొత్తం అంచనా విలువ: రూ. 4031.68 లక్షలు, ప్రచురించబడిన టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం: తేది: 27.02.2020 మ. 3.00 గంటల వరకు, సవరించబడిన చివరి తేది మరియు సమయం: తేది: 02.03.2020 మ. 3.00 గంటల వరకు. గమనిక: మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.in శ్రీ జి. అశోక్ కుమార్, B.E., పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, నీటిపారుదల శాఖ, కరీంనగర్
DIPR RO. No. 2545-DP/CL/Advt/1/2019-20, Dt: 27/02/2020



తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, PIU, సూర్యాపేట
No. D3/04/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 25-02-2020
దిగువ సంతకందారు ఆన్‌లైన్ టెండర్లు కోరుచున్నారు. పనుల సంఖ్య (8). దిగువ సంతకందారు పరిధిలో అరియగూడెం వద్ద UPSలో అదనపు తరగతి గదుల నిర్మాణం, సీతలా తాండా వద్ద AWC బిల్డింగ్ నిర్మాణం మరియు ఇతర సివిల్ పనులు. మొత్తం ECV: రూ. 6.62 కోట్లు. దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది: 16-03-2020, సా॥ 5.00 గం. వరకు. టెండరు షెడ్యూల్ జారీ: 19-03-2020, సా॥ 5.00 గం. వరకు. టెండర్ల స్వీకరణ తేది: 20-03-2020, మ॥ 3.00 గం. వరకు. టెండర్లు తెరచు తేది: 20-03-2020, మ॥ 3.30 గంటలకు. తదుపరి వివరాలకు దిగువ సంతకందారును సంప్రదించండి.
DIPR RO.No. 2543-DP/CL/ADVT/1/2019-20, Dt: 27-02-2020 సం/- జిల్లా P.R. ఇంజనీర్, PIU, సూర్యాపేట



తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
NIT No. 191/2020/C3 ఇ-టెండరు ప్రకటన తేది: 25-02-2020
పని పేరు: 2019-20 కాలంలో సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రెంజ యొక్క మార్గుడగా బీట్ వద్ద ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్ నిర్మాణం. ECV: రూ. 22.16 లక్షలు. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ దాఖలు తేది: 28-02-2020న ఉ. 10.00గం. నుండి 03-03-2020న సా. 5.00గం.కు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 04-03-2020న ఉ.11.00గం.కు. ధర బిడ్ తెరచు తేది: 04-03-2020న మ. 3.00గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం. 8106115963.
సం/- కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, మెదక్ సర్కిల్
DIPR RO. No. 2535-DP/CL/Advt/1/2019-20, Dt: 26/02/2020



తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇంజనీర్-ఇన్-చీఫ్(R&B) స్టేట్ రోడ్స్ & CRN:NIT No.3/PRP/DCE(R)/EE-R/DEE-2/AE-2/2020(3వ పిలుపు), తేది: 26-02-2020. NIT No. 3/PRP/DCE(R)/EE-R/DEE-2/AE-2/2020 (3వ పిలుపు), తేది: 26-02-2020 ప్రకారం (R&B) శాఖలోని మహబూబ్‌నగర్ సర్కిల్‌లో నాన్-ప్లాన్ క్రింద 3(మూడు) రోడ్ పనులు అనగా వనపర్తి జిల్లాలో 2 నం.ల పనులు మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలో 1 నం. పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు తదుపరి వివరాలు & టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా http://www.eprocurement.telangana.gov.in/లో 29-02-2020న సా. 4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది : 07-03-2020న లేదా ఆలోగా సా. 4.00 గం.వరకు.
సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరపున
DIPR RO No. 2542-DP/CL/Advt/1/2019-20, Dt: 27/02/2020



తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ, సర్కిల్: మహబూబ్‌నగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 07/SE/TS/R&B/MBNR/2019-20 తేది: 26-02-2020
దిగువ సంతకందారు నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల సంఖ్య: 6. వనపర్తి నుండి పెబ్బేరు రోడ్, కల్వకుర్తి నుండి నాగర్‌కర్నూల్ రోడ్, లింగసానిపల్లి నుండి తాడూరు (వయా) కుమ్మెర రోడ్, కృష్ణవేణిచౌక్-రాజీవ్‌చౌక్, అచ్చంపేట్ నుండి రాకొండ రోడ్, షానాయిపల్లి నుండి గౌరెడ్డిపల్లి రోడ్‌లకు కాలానుగత రెన్యూవల్స్. మొత్తం ECV: రూ. 2.45 కోట్లు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది, సమయం: 10-03-2020. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడవచ్చును. సంప్రదించు నం. 08542-222407
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్, మహబూబ్‌నగర్
DIPR R.O.No. 2539 DP/CL/Advt/1/2019-20 తేది: 27-02-2020



తెలంగాణ ప్రభుత్వం
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం-II, మిషన్ భగీరథ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-Proc.No. 14 & 13/CE-II/MB/2019-20 తేది: 26-02-2020
పనుల సంఖ్య: 2, సూర్యాపేట మరియు నల్గొండ జిల్లాలలో CPWS పథకం ఆపరేషన్ మరియు నిర్వహణ. ECV: రూ. 20.85 కోట్లు. టెండర్ డాక్యుమెంట్లు లభ్యత మరియు టెండర్ల స్వీకరణ తేదీలు: 03-03-2020 నుండి 17-03-2020న మ. 3.00 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరుచుట: 17-03-2020న సా. 4.00 గం.కు. ధర బిడ్ తెరుచు తేది: 20-03-2020న ఉ. 11.30 గం.కు. సంప్రదించు నం. 9100122269, 9100120934. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం @ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR R.O.No. 2538 DP/CL/Advt/1/2019-20 తేది: 27-02-2020 సం/- చీఫ్ ఇంజనీర్-II, MB, హైదరాబాద్



శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా
ఆర్.సి. నం. బి4/1293/2019 షార్ట్ టెండరు నోటిఫికేషన్ తేది: 26-02-2020
దేవస్థానమునకు చెందియున్న ఈ క్రింది అంశములను తేది: 01-04-2020 నుండి తేది: 31-03-2022 వరకు రెండు సంవత్సరముల (02) కాలం పాటు లీజుకు/లైసెన్సుకు ఇచ్చుటకు గాను ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును. (1) దేవస్థానం రెండు కళ్యాణ కట్టల యందు భక్తులు సమర్పించే తలనీలాలు ప్రోగుచేసుకొను లైసెన్సు హక్కు. (2) శ్రీ స్వామివారి ఆలయము నందు భక్తులు సమర్పించు కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొను లైసెన్సు హక్కు. (3) దేవస్థానం టి.టి.డి. భవనము ఖాళీ స్థలము నందు పార్కింగ్ ఫ్లేసును నిర్వహించు లీజు హక్కు. (4) శ్రీ స్వామివారి ఆలయము మరియు అనుబంధ ఆలయములకు వచ్చు భక్తుల పాదరక్షలు భద్రపరచు లీజు హక్కు. (5) శ్రీ స్వామివారి ధర్మగుండము నందు భక్తులు సమర్పించు కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొనుచు చెత్తాచెదారమును తొలగించు లైసెన్సు. పై అంశములకు బహిరంగ వేలం జరుగు తేది: 10-03-2020. ఆసక్తి గలవారు https://tender.telangana.gov.inనకు లాగాన్ చేసి పూర్తి వివరములు పొందవచ్చును. అట్టి దేవస్థానం లీజుల విభాగము నందు కూడా పూర్తి వివరములు తెలుసుకొనవచ్చును. పూర్తి వివరములకై సంప్రదించవలసిన పోన్ నంబర్లు. 9490525578, 8121269879 & 9963607403.
DIPR R.O.No. 722 PP/CL/Advt/1/2019-20 తేది: 27-02-2020 సం/- కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)



RITES లిమిటెడ్
RITES THE INFRASTRUCTURE PEOPLE
ప్రాంతీయ ప్రాజెక్ట్ కార్యాలయం (దక్షిణం) సికింద్రాబాద్
CIN నం. L74899DL1974GOI007227
ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన
క్లయింట్ TS GENCO తరపున, జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) RPO-సికింద్రాబాద్, RITES లిమిటెడ్ వారు దిగువ పని కోసం రెండు ప్యాకెట్ విధానంలో ఆన్‌లైన్ పర్సంటేజి రేట్ బిడ్లు కోరుతున్నారు. NIT No. RITES/SC/BTPS/EW & Br-II/మణుగూరు/2020 తేది: 27-02-2020. పని పేరు: ''తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు వద్ద (4x270MW) BTPS కోసం రైల్వే సైడింగ్ మరియు ఎక్స్‌చేంజ్ యార్డ్ నిర్మాణానికి సంబంధించి వంతెనల నిర్మాణం & ఇతర అనుబంధ పనులు, ఫార్మేషన్ కోసం గట్టు/కటింగ్‌లో మట్టి పని''. అంచనా వ్యయం: రూ. 129,57,14,915.76 బయానా: రూ. 2,60,14,300/- పూర్తి చేయు కాలం: 12 నెలలు. బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం: 20-03-2020న 15.00గం.లు. బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్: https://etenders.gov.in/eprocure/app నుండి పొందవచ్చును.
అనుబంధం/సవరణ ఏవైన వుంటే ఆన్‌లైన్‌లో మాత్రమే వుంచబడతాయి.




గురువారం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో మొక్కనాటి నీరుపోస్తున్న సినీనటులు తులసి, వై విజయ, జూనియర్ రేలంగి, శశాంక, కాదంబరి కిరణ్, కిశోర్ దాస్, దర్శకుడు రామకృష్ణ, కెమెరామన్ జగదీశ్ తదితరులు



ఏపీలోని విశాఖపట్నంలో 'గ్రీన్ ఇండియా చాలెంజ్', 'రోజా వనం' సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మొక్కనాటి నీరుపోస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఆమె భర్త శివప్రసాద్

# అడ్డదారిలో పసిడి

మొదటిపేజీ తరువాయి...

పోలిస్తే దాదాపు రూ.4.5 లక్షల మేర ఎక్కువ ఉంటుంది. అందుకే స్మగ్లర్లు రెచ్చిపోతారు. భారత్‌లోకి బంగారాన్ని అక్రమంగా తరలిస్తే లక్ష రూపాయల వరకు ఖర్చులు పోయినా.. కనీసం రూ.3.5 లక్షలు మిగులుతాయని సమాచారం.



ఇటీవల అధికారులకు చిక్కిన సుత్తిలో దాచి తరలించిన బంగారం



ఇటీవల ఐరన్ బాక్సుల్లో స్మగ్లర్లు తరలించగా పట్టుబడిన బంగారం

### శతకోటి మార్గాలు

బంగారం అక్రమంగా తీసుకొనిరావడానికి స్మగ్లర్లు శతకోటి మార్గాలను అనుసరిస్తున్నారు. ఒకసారి పాటించింది.. మరోసారి పాటించకుండా నిఘా వర్గాలకు దొరుకకుండా రోజుకో కొత్త ఎత్తు వేస్తున్నారు. చాలా సందర్భాల్లో సామాన్య ప్రయాణికులను తమ అక్రమరవాణాకు పావులుగా వాడుకొంటున్నారు. చిన్న మొత్తంలో బంగారాన్ని రవాణాచేసేందుకు సామాన్య ప్రయాణికులకు ఎంతో కొంత డబ్బు ఆశచూపుతారు. ఒక బిస్కెట్‌ను జేబులో వేసుకొని వస్తే.. విమానాశ్రయం లేదా ఓడరేవు బయట వాళ్ల మనుషులు వచ్చి తీసుకొని వెళ్తారు. మరికొన్ని సందర్భాల్లో విమానాశ్రయంలో దిగగానే వాష్‌రూంకు వెళ్లి టాయిలెట్లో వేసేసి వెళ్లమంటారు. వాష్‌రూంకు వెళ్లేసరికి అక్కడ స్మగ్లర్లతో కుమ్మక్కైన హౌస్‌కీపింగ్ స్టాఫ్ వాళ్లదగ్గరనుంచి బంగారాన్ని తీసుకొంటారు. అదీ సాధ్యపడకపోతే.. విమానాశ్రయంలోనే స్మగ్లర్లు ఒక గుర్తుగా చెప్పిన ప్రాంతంలో బిస్కెట్‌ను లేదా బిస్కెట్లను పడేసి వెళ్లిపోతారు. తర్వాత స్మగ్లర్లతో కుమ్మక్కైన మనుషులు వాటిని సురక్షితంగా బయటకు చేరవేస్తారు. ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారం జరిగిపోతుంటుంది. కొందరు సాధారణ వ్యక్తులు సైతం విదేశాల నుంచి తిరిగొచ్చేటప్పుడు ధనాశతో పెద్ద మొత్తంలో బంగారాన్ని కొని, వారికి తోచిన మార్గాల్లో అక్రమంగా తీసుకొస్తున్నారు.

### పెద్దపేగులో గోల్డ్‌పేస్ట్!

కొన్ని కేసులలో స్మగ్లర్లకు సంబంధించిన వ్యక్తులే ప్రయాణికుల్లా బంగారాన్ని తరలిస్తారు. పేస్ట్ రూపంలో ఉన్న బంగారాన్ని పురీషనాళం ద్వారా పెద్దపేగులోకి చొప్పించి రవాణా చేస్తారు. ఇందుకు వాళ్లు పెద్ద కసరత్తే చేస్తారు. రవాణాచేయడానికి ముందు కనీసం రెండురోజులపాటు ఏమీ తినకుండా.. పెద్దపేగును క్లీన్‌గా ఉంచుకొని బయలుదేరుతారు. ప్రయాణించడానికి ముందుగానీ, విమానం నుంచి దిగడానికి ముందుగానీ టాయిలెట్‌కు వెళ్లి.. పురీషనాళం ద్వారా పేస్ట్‌ను పెద్దపేగులోకి చొప్పిస్తారు. పసిడి వర్ణం కారణంగా తనిఖీల్లో దీన్ని గుర్తించడం అంత తేలికకాదు. మరికొన్ని సందర్భాల్లో ఎక్కువ బంగారాన్ని తరలించడానికి ప్రయత్నించినప్పుడు స్మగ్లర్లు నలుగురైదుగురు వ్యక్తులను ఎంచుకొంటారు. ఒక్కొక్కరూ ఒక్కో మార్గంలో బయటకు వెళ్లేందుకు ప్లాన్‌చేసుకొంటారు. పుత్తడిని అక్రమంగా రవాణాచేస్తున్నవారిలో ఒకరిగురించి స్మగ్లర్లే లీక్‌చేస్తారు. అధికారుల దృష్టి అంతా ఆ వ్యక్తివైపు మళ్లేట్లుచేసి మిగతా బంగారాన్ని బయటకు చేరవేస్తారు. ఈ విధంగా దేశంలోకి తరలివచ్చిన బంగారం గతేడాది 30 నుంచి 40 శాతం వరకు పెరిగింది. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశమున్నదని అంతర్జాతీయ ఎన్జీవో 'ఇంపాక్ట్' తన తాజా నివేదికలో పేర్కొన్నది.

### హవాలాకు చేదోడు

దేశంలోకి అక్రమంగా రవాణా అయిన బంగారం ఎక్కువగా హవాలా లావాదేవీలకు వినియోగమవుతున్నట్లు సమాచారం. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత ఉత్పత్తుల రవాణాకు బంగారాన్ని హవాలాదారుల్లో పంపిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన బంగారం హవాలా మార్గంలో తిరిగి విదేశాలకు చేరుతున్నది. కరెన్సీకి బదులుగా బంగారాన్ని పంపించడం స్మగ్లర్లకు సులువుగామారింది. హవాలా ద్వారా బంగారం రవాణా వెనుక పెద్ద మాఫియా ఉన్నట్లు డీఆర్ఐ అధికారులు చెప్తున్నారు.

### ఎక్కడి నుంచి.. ఏ విధంగా..

స్మగ్లర్లు మన దేశంలోకి ప్రధానంగా దుబాయ్, జెడ్డా, సింగపూర్, చైనా, తైవాన్, హాంగ్‌కాంగ్, నేపాల్, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. సముద్రమార్గం ద్వారా శ్రీలంక నుంచి కూడా పెద్దమొత్తంలో వస్తున్నది. దొంగ బంగారాన్ని ఎక్కువగా విమానమార్గాలతోనే తీసుకొస్తున్నారని, కడ్డీలు, క్యాప్సూల్స్, ఖర్జూర గింజలు, పేస్టు వంటిరూపాల్లో తీసుకొచ్చి ఆ తర్వాత రైలు, రోడ్డుమార్గాల్లో జిల్లాలకు తరలిస్తున్నారని అధికారులు చెప్తున్నారు. బస్సులో తరలిస్తున్న 3.09 కిలోల బంగారం సోమవారం రాయికల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుబడటమే ఇందుకు నిదర్శనం.

**డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ పరిధిలో స్వాధీనం చేసుకున్న బంగారం..**

| ఏడాది | నమోదైన కేసులు | పట్టుకున్న బంగారంవిలువ (కిలోల్లో) | (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2016-17 | 02 | 6.295 | 1.64 |
| 2017-18 | 13 | 24.09 | 7.30 |
| 2018-19 | 20 | 40.54 | 13.06 |
| 2019-2020 (ఈనెల 7 వరకు) | 25 | 162.62 | 59.16 |

**ఇటీవల హైదరాబాద్ యూనిట్ తనిఖీల్లో పట్టుబడ్డ ప్రధాన కేసులు**

- గతనెల 31న చెన్నై-హైదరాబాద్ రైలు మార్గం ద్వారా వరంగల్‌కు చేరవేస్తున్న 31.5 కిలోల (విలువ రూ.13.3 కోట్లు) బంగారాన్ని హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు జోన్ల పరిధిలో పట్టుకొని, 12 మందిని అరెస్టు చేశారు.
- ఈ నెల 11న దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులు సుత్తి, జ్యూస్ మిక్సర్‌లో దాచి తీసుకొచ్చిన 2.5 కిలోల (విలువ రూ.కోటి) బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకొని మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు.
- గతేడాది డిసెంబర్‌లో దుబాయ్ నుంచి విమానంలో హైదరాబాద్‌కు అక్రమంగా తరలించిన 14 కిలోల (విలువ రూ.5.46 కోట్ల) బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్నారు.
- గతేడాది డిసెంబర్ 5న చెన్నై నుంచి హైదరాబాద్‌కు బస్సులో తరలిస్తున్న 1.7 కిలోల (విలువ రూ.66.64 లక్షలు) బంగారాన్ని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టుచేశారు.

## రేపు ఎఫ్ఎస్వో పరీక్ష కీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆహార భద్రత అధికారుల (ఎఫ్ఎస్వో) పరీక్ష కీ శనివారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ గురువారం ప్రకటించింది. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మార్చి రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు లింక్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించింది.



ఎంసీఆర్‌హెచ్చార్డీలో డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, సీపీఏ హెడ్ డాక్టర్ మాధవితో ఆర్టీఐ కమిషనర్లు కట్టా శేఖర్‌రెడ్డి, ఎం నారాయణరెడ్డి, జీ శంకర్‌నాయక్, సయ్యద్‌ఖలీలుల్లా

## ఆర్టీఐ కమిషనర్లకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్తగా నియమితులైన సమాచార కమిషనర్లకు జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులను గురువారం ఆ సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్ హర్‌ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం- 2005 గురించి సీపీఏ (సెంటర్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి వివరించారు. ఆర్టీఐ కమిషనర్ల విధులు, బాధ్యతల గురించి సీపీఏ సీనియర్ ఫ్యాకల్టీ శ్రీనివాస్ మాధవ్ తెలియజేశారు. కమిషనర్లు కట్టా శేఖర్‌రెడ్డి, ఎం నారాయణరెడ్డి, జీ శంకర్‌నాయక్, సయ్యద్‌ఖలీలుల్లా, డాక్టర్ మహ్మద్ అమీర్ హుస్సేన్‌లను ఎంసీఆర్‌హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య శాలువాతో సన్మానించారు.



పీసీసీఎఫ్ ఆర్ శోభ అధ్యక్షతన గురువారం అరణ్యభవన్‌లో సమావేశమైన కంపా కార్యనిర్వాహక కమిటీ

## అడవుల పునరుద్ధరణకు 600 కోట్లు

- **కంపా నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రత్యామ్నాయ అటవీకరణ, అడవుల పునరుద్ధరణ తదితర పనుల కోసం రూ.603కోట్లు కావాలని తెలంగాణ అటవీశాఖ కేంద్రానికి ప్రతిపాదించింది. అరణ్యభవన్‌లో గురువారం జరిగిన కంపా(కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్ అథారిటీ) కార్యనిర్వాహక కమిటీ సమావేశం ఈ మేరకు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పీసీసీఎఫ్ ఆర్ శోభ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు. 2014-19 మధ్యకాలంలో రాష్ట్రానికి రూ.645 కోట్లు కేంద్రం కేటాయించగా, వాటిలో 99 శాతానికిపైగా నిధులు ఖర్చు చేశామని అదనపు పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్ చెప్పారు. కంపా నిధులతో రాష్ట్ర అటవీశాఖ చేపట్టిన పనులను కేంద్రం ప్రశంసించిందని తెలిపారు. చేసిన పనులపై నివేదికలు అం దించడంలో కూడా తెలంగాణ ముందువరుస లో ఉందని చెప్పారు. వచ్చే ఏడాది కోసం రూ.603 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని, వాటిని కేంద్రానికి పంపుతామని జైస్వాల్ తెలిపారు. సుమారు రూ.500 కోట్ల అంచనాలతో ప్రస్తుత ఏడాది జరుగుతున్న పనుల పురోగతిని కూడా కమిటీ చర్చించి, సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీదేవి, అదనపు పీసీసీఎఫ్‌లు ఆర్ఎం డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, ఎం సీ పర్గెయిన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో సేఫ్టీ క్లబ్బులు

- **రాష్ట్రవ్యాప్తంగా నియామకంపై ఉమెన్‌సేఫ్టీ వింగ్ కసరత్తు**
- **మార్చి 11న హైదరాబాద్‌లో ప్రిన్సిపాళ్లతో సమావేశం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బాలికలు, మహిళలు, విద్యార్థినుల భద్రతలో విద్యార్థిలోకాన్ని రాష్ట్ర పోలీస్‌శాఖ భాగస్వామ్యం చేస్తున్నది. ఇప్పటికే ఐదు కళాశాలల్లో 45 మంది (వలంటీర్ల బృందం) విద్యార్థుల చొప్పున ఐదు సేఫ్టీక్లబ్బులను ఏర్పాటుచేసింది. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో నియమించేందుకు రాష్ట్ర మహిళాభద్రతా విభాగం చర్యలు ప్రారంభించినట్టు ఐజీ స్వాతిలక్రా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 11న హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్ల (సుమారు 1500 మంది)తో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యాశాఖ భాగస్వామ్యంతో జరిపే ఈ సమావేశంలో కళాశాలల్లో విద్యార్థినుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలు, సేఫ్టీ క్లబ్బుల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

**సేఫ్టీక్లబ్ సభ్యులు ఏం చేస్తారంటే..**

కళాశాల పరిధిలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ అరికడతారు. వారుండే నివాసప్రాంతాల్లోనూ మహిళలు, విద్యార్థినులు, యువతుల భద్రతకు చర్యలు తీసుకుంటారు. కళాశాల పరిధిలో, వచ్చేదారిలో, బస్‌స్టాప్‌ల వద్ద, నివాస ప్రాంతాల్లో మహిళల భద్రత సరిగా ఉన్నదా? లేదా? ఇంకేమీ చర్యలు తీసుకోవాలి వంటి అంశాలపై సేఫ్టీఆడిట్ కూడా నిర్వహిస్తారు. సేఫ్టీక్లబ్ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, షీటీమ్స్‌తో అనుసంధానమై ఉంటారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించేందుకు తొలుత వీరే ప్రయత్నిస్తారు. కుదరకపోతే పోలీసులసాయం తీసుకుంటారు. రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో సేఫ్టీ క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుంది.

**సేఫ్టీక్లబ్‌లు ఉన్న కళాశాలలు ఇవే..**

హైదరాబాద్‌లోని భద్రుక కళాశాల, అరోరా డిగ్రీ, పీజీ కళాశాల, జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల, ఇందిర ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల.

# యువత సాగువైపు కదలాలి

- **నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్**

**భీమదేవరపల్లి:** యువత వివిధ రంగాల్లో స్థిరపడకుండా వ్యవసాయంపై దృష్టి సారించాలని నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ప్రణాళికబద్ధంగా వ్యవసాయం చేయాలని సూచించారు. రైతులు కలిసికట్టుగా ఉంటేనే పంటలకు కనీస మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. దీనికోసం అన్నిచోట్ల రైతు ఉత్పత్తిసంఘాలను నెలకొల్పుతున్నట్టు వివరించారు. వ్యవసాయంతో పాటు అనుబంధంగా బర్రెల పెంపకం, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాలు ఉంటే ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని సూచించారు. ప్రతి రంగంలోనూ ఒడిదొడుకులు ఉంటాయని చెప్పారు. పదవీ విరమణ తర్వాత రైతుగా మారుతానని తన మనోగతాన్ని వెల్లడించారు. రైతుగా జీవించడంలో ఉన్న ఆనందం ఏ రంగంలోనూ ఉండదని చెప్పారు. ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘానికి నాబార్డు పూర్తి సహకారం ఉంటుందని హామీఇచ్చారు. ఈ సందర్భంగా నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్‌ను బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ములుకనూరు సహకార సంఘం జీఎం మార్పాటి రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు చీకట్ల రాజయ్య, శంకరయ్య పాల్గొన్నారు.



ములుకనూరు మహిళా డెయిరీని సందర్శించిన నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్



గురుకులాల్లో ప్రవేశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థినులు గురువారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ఉమ్మడి ప్రవేశపరీక్షపై విద్యార్థినులునృత్యరూపంలో అవగాహన కల్పించారు. గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్వేరోస్ రాజన్న జోన్ అధ్యక్షుడు మేకల రవీందర్ సూచించారు. మార్చి ఒకటో తేదీవరకు గడువు ఉన్నదని, ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. - హుజూరాబాద్ టౌన్

## ఈ నామ్ అమలు భేష్

- **ఢిల్లీ ఎస్ఎఫ్ఏసీ సభ్యుల బృందం**
- **సూర్యాపేటట్‌లో మార్కెట్‌లో పరిశీలన**

**సూర్యాపేట అర్బన్:** సూర్యాపేట వ్యవసాయమార్కెట్‌లో అమలవుతున్న జాతీయ మార్కెట్ వ్యవసాయ విధానాన్ని గురువారం ఢిల్లీ ఎస్ఎఫ్ఏసీ(స్మాల్ ఫార్మర్స్ ఆక్రిడిటేషన్ కన్సాలిడేషన్, ఈ నామ్ విభాగం) సభ్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ సూర్యాపేట మార్కెట్ ఈ నామ్ విధానం ఉత్తమంగా ఉందని, ఈ విధానంలో ఇంకా ఎక్కువ మంది రైతులు పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. సూర్యాపేట మార్కెట్‌ను జాతీయ స్థాయిలో ఉత్తమ ఈ నామ్ అమలుకేంద్రంగా రూపొందేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బృందంలో సభ్యుల్లో రాజేశ్‌శర్మ మార్కెటింగ్ మేనేజర్ (ఈ నామ్), విశాల్ దినేష్ స్పెషల్ అడ్వయిజర్ ఎస్ఎఫ్ఏసీ, పర్మిందర్‌సింగ్ ఎన్ఎఫ్‌సీఎల్ (నాగార్జున ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్) ఉన్నారు.


THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala, India
ZONAL OFFICE : 1st Floor, Halcyon Complex, No.9, St. Mark's Road, Bangalore- 560 001.
e-mail: bgrr-cpc@federalbank.co.in Phone: 080-22074610/604/613/624/625.
BGRR/Pvt Sale/2019-20 NOTICE FOR PRIVATE SALE OF GOLD 26/02/2020
Notice is hereby given for the information of all concerned that Gold Ornaments pledged in the following Gold Loan accounts, with the under mentioned Branches of the Bank, which are overdue for redemption and which have not been regularized so far in spite of repeated notices, will be put for Private sale, in the respective Branches on any date after 18-03-2020 as shown below:
Br: Ecil Cross Roads: Maark Arcade, Mahesh Nagar, Ecil Cross Road, Kapra-500 062, (Ph No. 040-27121527) :-
16026400005622,16026400007016,16026400006760,16026400009004,16026400005812.
Br: Hyderabad: Ground Floor, Opp:Surabhi Complex, Bank Street, Sultan Bazar, Hyderabad, - 500 001 (Ph No.04023205381):-
11246100060686,11246100060710.
Br.Hyderabad/Madhapur: PLOT NO.80 & 81, ARUNODAYA COLONY, NEAR IMAGE GARDENS, MADHAPUR P O, HYDERABAD- 500 081 (Ph: 040 23115250) :-
15556100207111,15556100185242,15556100182397,15556100186554,15556100186562,15556100197221,15556100198245,
15556100207996,15556100208192,15556100204795,15556100207046,15556100207053.
Br: Hyderabad/Malakpet: Ground Floor, D no.16-11-20/6/6/1/1. Opp T V Tower, Gafoor Bagh, Hyderabad--500 036, (Ph no.-040 24540000):-
18266400003130,18266400005507,18266100072609,18266100074324,18266100074589.
Br: Hyderabad/Punjagutta: 6-3-456/C1 & C2, Ground Floor, Mgr Estates, Dwarakapuri Colony, Punjagutta- 500 082 (Ph No. 040- 23357575):-
14736400010099,14736400008630,14736400007012,14736400003532,14736400003540,14736400004464,14736400007210,
14736400004662,14736400004654,14736400006204,14736100092868,14736400009703,14736400009711,14736400008549,
14736100092850,14736400009752,14736400010610,14736400010602,14736400006717,14736400009810,14736400009901,
14736400006592,14736400009596.
Br.Hyderabad/Lakadi Ka Pul: Maruthi Plaza, Building No 6-2-981, Beside Shahdan College, Khairatabad, Lakdi Ka Pul, Hyderabad-500 004. ( Ph no.040-23322966 ):- 133261000049307.
Br: Hyderabad/Vanasthalipuram: Plot No 4. Vanasthali Hills, Near Panama Godown, Bhashyam School, Vanasthalipuram, Hyderabad-500 070 (Ph 040-24125544):-
19436100039507,19436100039598,19436100039622,19436400015348,19436400015884,19436400015892,19436400015900,
19436400015918,19436400015934,19436400015942,19436400015967,19436400015975,19436400016148.
Br.Kukatpally: Ground Floor, G V Arcade,269 MIG Road No.3, 50 Ft Road, KPHB Colony, Kukatpally, Ranga Reddy District-500085 (Ph: 04023053075):-
15696100479649,15696100481835,15696100483377,15696100486644,15696100486909,15696100486917,15696100511730,
15696100487824,15696100487659,15696400006399,15696400008056,15696400008098,15696400008783,15696400009153,
15696100475217.
Br. L B Nagar: Plot No. 142/A, Sbh Colony, Venture 2, Near L B Nagar Ring Road, Lb Nagar, Hyderabad-500 074 (Ph : 04024037333):-
16726100050493,16726100050485,16726100050501,16726100050469,16726100050477,16726100047945,16726400004885,
16726400007037,16726400007318,16726400007326,16726400007573.
Br. Ramachandrapuram: 25/35/1/G, Plot Nos. 14&15,N H - 9, Ramachandrapuram,502 032, Ph 040-20041892:- 16056100234164.
Br: Secunderabad: Shop No. 7, Ground Floor, Legend Crystal Building, Penderghast Road', Near Paradise Circle, Secunderabad - 500 003 (Ph 040-27896208):-
13956400003586,13957400001861,13956400003834,13956400003925,13956400003875,13956400003735,13956400003552,
13956400003610,13956400003883,13956400003958,13956400001812.
Br: Serilingampally: Vijaya Hospital Building, Madeenaguda, Serilingampally-500 049 (Ph No.040 23044334):-
16886100217391,16886100217417,16886100217433,16886100217425,16886100217409,16886100228331,16886100237365,
16886400025486,16886400018549,16886400018796,16886400018812,16886400018820,16886400025064,16886400025486.
Br: Uppalkalan: NO. 2-3-16 & 17, MAIN ROAD, UPPAL, RANGAREDDY, HYDERABAD- 500 039 (Ph 040-27203599):-
15836100221472,15836100221605,15836100221639,15836100221837,15836100222413,15836100222405,15836100222397,
15836100222389,15836400007084,15836400009312,15836400009361,15836400009569,15836400009973.
Br.Warangal:11-25-131, SSS Plaza, MG Road, Warangal- 506002 (Ph:8702500169) :-
17566400006335,17566400011855,17566400007218,17566400012259.
Bangalore 27-02-2020 Vice President & Zonal Head.



తీరప్రాంత భద్రత పెంపులో భాగంగా రూపొందించిన ఆరో పెట్రోలింగ్ నౌక 'యార్డ్ 45006 వజ్ర' గురువారం చెన్నైలో జలప్రవేశం చేసింది. నౌకాయానశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమక్షంలో ఆయన భార్య గీత ఈ నౌకను ప్రారంభించారు.

## ప్రశాంత్ కిశోర్‌పై కేసు

**పాట్నా:** తన అనుమతి లేకుండా తన ఆలోచనలను, సమాచారాన్ని ఎన్నికల వ్యూహకర్త-రాజకీయ నేత ప్రశాంత్ కిశోర్ వాడుకుంటున్నారని కాంగ్రెస్‌కి చెందిన సమాచార విశ్లేషణ సమన్వయ కర్త శాశ్వత్ గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రశాంత్ కిశోర్ గతవారం ప్రారంభించిన 'బాత్ బీహార్ కీ' ప్రచారోద్యమానికి సంబంధించి తన సమాచారాన్ని వాడుకుంటున్నారని గౌతమ్ చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం పాట్నా పోలీసులు కేసు నమోదు చేశారు.

## కేరళ బామ్మకు త్వరలో ఆధార్



**తిరువనంతపురం:** కేరళ బామ్మ భగీరథి అమ్మ మళ్లీ వార్తల్లో నిలిచారు. ఆమె త్వరలో ఆధార్‌కార్డును పొందనున్నారు. భగీరథి..105 ఏండ్ల వయసులో నాలుగో తరగతి పాసై ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్న సంగతి తెలిసిందే. నాలుగో తరగతిలో పాసైన సంతోషం ఉన్నా.. ఆధార్‌కార్డు లేకపోవడంతో పింఛన్ పొందలేకపోతున్నానని ఇటీవల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం మీడియాలో రావడంతో స్పందించిన ఓ జాతీయ బ్యాంకు అధికారులు కొల్లాం జిల్లాలోని ఆమె ఇంటిని ఇటీవల సందర్శించారు. ఆధార్ నమోదుకు అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. 'వృద్ధాప్యం వల్ల భగీరథి అమ్మ వేలి ముద్రలు చెరిగిపోవటంతో ఆధార్ నమోదు యంత్రం స్వీకరించలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రక్రియ పూర్తి చేశాం' అని ఓ అధికారి పేర్కొన్నారు. బామ్మకు రెండు రోజుల్లోగా ఆధార్ కార్డు వచ్చే అవకాశమున్నదని చెప్పారు.



ఢిల్లీలోని బ్రిజ్‌పురి ప్రాంతంలో ఉన్న అరుణ్ మాడ్రన్ ప్రైవేట్ స్కూల్‌ను దుండగులు మంగళవారం ధ్వంసం చేశారు. పుస్తకాలు, కంప్యూటర్లు, బెంచీలు, స్కూల్ వ్యాన్లు, ఇతర సామగ్రిని దగ్ధం చేశారు. దాదాపు రూ.70 లక్షల నష్టం సంభవించింది. చిన్నారుల నవ్వులతో కళకళలాడే భవనం.. ఇప్పుడు శ్మశానాన్ని తలపిస్తున్నదని యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది.



### సీబీఐ.. ఇంటర్‌పోల్..
## పసిపాప కోసం!



**న్యూఢిల్లీ:** సినిమాను తలపించే కథ ఇది. మూడేండ్ల చిన్నారి కోసం తల్లిదండ్రుల మధ్య నడిచిన పోరులో పలు నాటకీయ మలుపులు చోటుచేసుకున్నాయి. ఢిల్లీకి చెందిన అమన్ లోహియా ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమారుడు. భార్య కిరణ్ కౌర్ చర్మవ్యాధి నిపుణురాలు. వీరికి మూడేండ్ల కుమార్తె రైనా ఉన్నది. విభేదాల కారణంగా విడిపోయిన ఈ జంట.. కుమార్తె సంరక్షణ బాధ్యత కోసం కోర్టు మెట్లెక్కారు. న్యాయస్థానం ఆ బిడ్డను తల్లికి అప్పగించింది. వారంలో మూడు రోజులు కూతుర్ని కలవొచ్చని తండ్రికి సూచించింది. విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్ట్‌ను సమర్పించాలని లోహియాను ఆదేశించింది. అయితే గతేడాది ఆగస్టు 24న బిడ్డను కలిసిన లోహియా చిన్నారిని తీసుకొని దుబాయ్‌కి చెక్కేశాడు. డొమినికా దేశపు పాస్‌పోర్ట్‌ను సంపాదించిన ఆయన.. నేపాల్‌గుండా దుబాయ్ చేరాడు. అంతర్జాతీయ అంశాలు ముడిపడి ఉండడంతో హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. రంగంలోకి దిగిన సీబీఐ.. ఇంటర్‌పోల్ సాయంతో లోహియాను అదుపులోకి తీసుకుని చిన్నారితో సహా స్వదేశానికి తీసుకొచ్చింది. శుక్రవారం ఆ బాలికను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. లోహియాపై కేసులు నమోదుచేశారు.

# శిథిల హస్తినాపురం

## ఈశాన్య ఢిల్లీలో యుద్ధానంతర పరిస్థితులు

- ప్రభావిత ప్రాంతాల్లో ఇండ్లకే పరిమితమైన ప్రజలు
- నగరం విడిచి వెళ్తున్న అనేక కుటుంబాలు.. 38కి పెరిగిన మృతులు
- 'విద్వేష వ్యాఖ్యల'పై కేంద్రానికి కోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** దేశ రాజధాని శిథిల నగరంగా మారింది. మత ఘర్షణలు కాస్త తగ్గుముఖం పట్టినా.. ప్రభావిత ప్రాంతాల్లో శ్మశాన వైరాగ్యం రాజ్యమేలుతున్నది. ఈశాన్య ఢిల్లీలో ఏ వీధిలో చూసినా బూడిదకుప్పగా మారిన వాహనాలు, ధ్వంసమైన దుకాణాలు.. ఇలా యుద్ధానంతర పరిస్థితులను గుర్తుకు తెస్తున్నది. జీవనోపాధి కోల్పోవడం, భయానక పరిస్థితుల నేపథ్యంలో అనేక కుటుంబాలు నగరాన్ని విడిచి వెళ్తున్నాయి. గురువారం అత్యధిక శాతం ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. కొన్ని చోట్ల హిందువులు, ముస్లింలు ఐక్యంగా రోడ్లమీదికి వచ్చి శాంతియుత ర్యాలీలు నిర్వహించారు. మరోవైపు రాళ్లదాడిలో గాయపడి దవాఖానల్లో చికిత్సపొందుతున్నవారిలో గురువారం మరో 11మంది దుర్మరణం చెందారు. దీంతో మృతుల సంఖ్య 38కి పెరిగింది. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. యుమునావిహార్ ప్రాంతంలో సాయంత్రం 4 గంటలకు కొన్ని అల్లరిమూకలు స్వైరవిహారం చేస్తూ.. పలు వాహనాలకు నిప్పు పెట్టాయి. హింస నేపథ్యంలో 10, 12 తరగతులకు గురు, శుక్రవారాల్లో జరుగాల్సిన పరీక్షలను సీబీఎస్‌ఈ వాయిదా వేసింది.

### క్రమంగా అదుపులోకి..

ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం భారీగా భద్రతా బలగాలను మోహరించింది. పోలీసులు, పారా మిలిటరీ సిబ్బంది నగర వీధుల్లో కవాతు నిర్వహించారు. పరిస్థితి క్రమంగా అదుపులోకి వస్తున్నదని ప్రత్యేక కమిషనర్ ఎస్‌ఎన్ శ్రీవాత్సవ తెలిపారు. హింసపై సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు రెండు 'ప్రత్యేక దర్యాప్తు బృందాలను' (సిట్) ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 48 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశామని, 130 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన అల్లరిమూకలు వాట్సప్ గ్రూప్‌ల్లో చర్చించుకొని ప్లాన్ ప్రకారం హింసకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



విధ్వంసానికి సాక్ష్యంగా నిలుస్తున్న ఈశాన్య ఢిల్లీలోని ఓ వీధి

### ప్రతివాదిగా కేంద్రం

విద్వేష వ్యాఖ్యలు చేసిన ముగ్గురు బీజేపీ నేతలపై (కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్, పర్వేశ్ వర్మ) ఎఫ్ఐఆర్ నమోదుచేయాలంటూ దాఖలైన పిటిషన్ మీద ఢిల్లీ హైకోర్టు గురువారం కూడా విచారించింది. ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్రం పరిధిలోని అంశమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. దీంతో కోర్టు.. ఈ కేసులో కేంద్రాన్ని ప్రతివాదిగా చేర్చేందుకు అంగీకరించింది. మూడు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

### రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ బృందం

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసింది. హోంమంత్రిగా అమిత్ షా పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించింది. రాజీనామా చేయాల్సిందిగా ఆయనను ఆదేశించాలని రాష్ట్రపతిని కోరింది. కేంద్ర ప్రభుత్వం రాజ ధర్మాన్ని పాటించేలా చూడాలని విన్నవించింది.

### మావాళ్లుంటే రెట్టింపు శిక్ష: కేజ్రీవాల్

హింస కారకులను కఠినంగా శిక్షించాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. నిందితుల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్)వారు ఉంటే రెట్టింపు శిక్ష వేయాలని సూచించారు. హింసలో ఆప్ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్ పాత్ర ఉన్నదన్న ఆరోపణల నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం.. ఇండ్లు పూర్తిగా ధ్వంసమైతే రూ.5 లక్షలు, పాక్షికంగా ధ్వంసమైతే రూ.2.5 లక్షలు చెల్లిస్తామన్నారు. మరోవైపు కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆప్ వర్గాలు తెలిపాయి. ఆయనపై పోలీస్ విచారణ ముగిసే వరకు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు చెప్పాయి. ఐబీ అధికారి అంకిత్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు తాహిర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హింసను ఖండించిన అమెరికా సంస్థ

ఢిల్లీలో హింసపై అమెరికాకు చెందిన కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడం ఆందోళన వ్యక్తం చేసింది. ముస్లింలు, ఇతర వర్గాల ప్రజలకు రక్షణ కల్పించాలని మోదీ ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఈ విషయాన్ని అనవసరంగా రాజకీయం చేస్తున్నారని భారత విదేశాంగ శాఖ విమర్శించింది.

## ఆప్ నేత ఇంట్లో పెట్రోల్ బాంబులు, యాసిడ్‌ప్యాకెట్లు



చాంద్‌బాగ్‌లోని ఆప్ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్ ఇంటిపై భారీగా పెట్రోల్ బాంబులు, యాసిడ్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. పోలీసులు ఆయనకు చెందిన ఓ పరిశ్రమను కూడా సీజ్ చేశారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్‌శర్మ హత్యలో తాహిర్ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే ఇవన్నీ నిరాధార ఆరోపణలని ఆయన చెప్తున్నారు. అల్లర్ల నేపథ్యంలో తాను కుటుంబంతో కలిసి సోమవారమే ఇంటిని ఖాళీ చేశానన్నారు.



తాహిర్ ఇంటిపై యాసిడ్, పెట్రోల్ బాంబులు

## ఉద్యోగం తొలిగించారని హత్యాకాండ!

### అమెరికాలో ఐదుగురిని చంపిన దుండగుడు.. ఆపై ఆత్మహత్య

**మిల్‌వాకీ(అమెరికా):** అగ్రరాజ్యం అమెరికాలో మరోమారు కాల్పుల కలకలం చోటుచేసుకున్నది. ఉద్యోగం నుంచి తొలిగించారన్న అక్కసుతో ఓ ఉద్యోగి ఉన్మాదిగా మారాడు. కంపెనీలో పనిచేస్తున్న తోటి ఉద్యోగి గుర్తింపు కార్డును దొంగిలించి సంస్థలోకి ప్రవేశించిన దుండగుడు.. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఘటన తర్వాత తుపాకీతో తనకు తాను కాల్చుకుని దుండగుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిల్‌వాకీలోని మెల్సన్ కూర్స్ బీర్ల కంపెనీలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. దుండగుడు సంస్థ మాజీ ఉద్యోగి అని, ఘటనకు ముందు రోజే అతడిని ఉద్యోగం నుంచి యాజమాన్యం తొలగించిందని పోలీసులు తెలిపారు. ఉద్యోగం నుంచి తొలగించారన్న కక్షతోనే దుండగుడు ఈ కాల్పులకు పాల్పడ్డాడా? అన్న కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయ విద్యార్థినిపై లైంగికదాడి కేసు..
## 11 మంది దోషులుగా నిర్ధారణ

**రాంచీ, ఫిబ్రవరి 27:** గతేడాది జార్ఖండ్‌లో సంచలనం సృష్టించిన న్యాయ విద్యార్థినిపై లైంగికదాడి కేసులో 11 మందిని కోర్టు దోషులుగా తేల్చింది. వీరికి శిక్షను వచ్చే నెల 2న ప్రకటించనుంది. గతేడాది నవంబర్ 26న న్యాయ విద్యార్థిని ఒకరు రాంచీలోని సంగ్రామ్‌పూర్ ప్రాంతంలో తన స్నేహితుడితో మాట్లాడుతుండగా తొమ్మిది మంది వ్యక్తులు ఆమెను అపహరించారు. అనంతరం మరో ముగ్గురు వ్యక్తులు వీరితో చేరి లైంగికదాడికి పాల్పడ్డారు.

### ఒక్కొక్కరికి
## 92,000!

**హాంకాంగ్, ఫిబ్రవరి 27:** హాంకాంగ్ ప్రభుత్వం తమ ప్రజలకు భారీ నగదు కానుకను ప్రకటించింది. నెలల తరబడి సాగిన ఆందోళనలు, కరోనా వైరస్ విజృంభన నేపథ్యంలో మాంద్యంలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థకు తిరిగి ఊపునిచ్చేందుకు ప్రతి శాశ్వత నివాసికి 10,000 హాంకాంగ్ డాలర్లను (దాదాపు రూ.92,000) అందజేయనున్నట్లు తెలిపింది. ఆర్థిక మంత్రి పాల్ చాన్ గురువారం వార్షిక బడ్జెట్ సందర్భంగా ఈ నగదు బహుమతిని ప్రకటించారు. 18 ఏండ్లు పైబడిన దాదాపు 70 లక్షల మందికి ఈ నగదును అందజేయనున్నారు. ఇందుకుగానూ 71 బిలియన్ హాంకాంగ్ డాలర్ల వ్యయం కానుంది. విదేశాల్లో నివసిస్తున్న వారికి కూడా ఈ కానుకను అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే పలు పన్ను ప్రయోజనాలను కూడా కల్పించింది. ఆర్థిక మాంద్యంతో తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు, వ్యాపార సంస్థలను ఆదుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చాన్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో హాంకాంగ్ గత 15 ఏండ్లలో తొలిసారి లోటు బడ్జెట్‌లోకి వెళ్లనుంది.

# జడ్జి బదిలీపై వివాదం

- ఢిల్లీ హింసాకాండ నేపథ్యంలో పోలీసులపై జస్టిస్ మురళీధర్ ఆగ్రహం
- గంటల వ్యవధిలోనే బదిలీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై వివాదం రాజుకున్నది. ఢిల్లీలో హింసాకాండకు ఆజ్యం పోసేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలపై కేసు నమోదు చేయనందుకు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ఆయనను బదిలీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'అర్ధరాత్రి ఉత్తర్వులు' సిగ్గుచేటు అని కాంగ్రెస్ ధ్వజమెత్తగా.. సాధారణ బదిలీని రాజకీయం చేస్తున్నారని ఆ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. జస్టిస్ మురళీధర్‌తో పాటు, మరో ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ రంజిత్ వసంత్‌రావ్ మోరే (బాంబే హైకోర్టు), జస్టిస్ రవి విజయ్ కుమార్ మాలిమత్ (కర్ణాటక హైకోర్టు)లను బదిలీ చేస్తూ కేంద్ర న్యాయ శాఖ బుధవారం రాత్రి వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. జస్టిస్ మురళీధర్‌ను పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తర్వాత ఈ బదిలీలకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఏఏ నిరసనలకు సంబంధించి బీజేపీ నేతలు పర్వేశ్ వర్మ, కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్‌లు చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదుచేయనందుకు ఢిల్లీ పోలీసులపై జస్టిస్ మురళీధర్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసిన గంటల వ్యవధిలోనే ఆయనను బదిలీ చేయడం గమనార్హం.



జస్టిస్ మురళీధర్

### కేంద్రం ప్రతీకార చర్యలు: కాంగ్రెస్

ఢిల్లీ హింస కేసులో బీజేపీ నేతలను రక్షించేందుకే జస్టిస్ మురళీధర్‌ను ఆకస్మికంగా బదిలీ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. న్యాయవ్యవస్థపై బీజేపీ అణచివేతను, ప్రతీకార రాజకీయాలను ఇది బట్టబయలుచేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ విమర్శించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'బదిలీకాని, ధైర్యశాలి జస్టిస్ లోయాను గుర్తుచేసుకుంటున్నాం' అని ట్వీట్‌చేశారు. అమిత్‌షా నిందితుడిగా ఉన్న (తర్వాత నిర్దోషిగా కోర్టు ప్రకటించింది) సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన జస్టిస్‌లోయా అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

### కొలీజియం సిఫార్సుల మేరకే బదిలీ: బీజేపీ

ఈ నెల 12న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకే జస్టిస్ మురళీధర్‌ను బదిలీ చేసినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. సాధారణ బదిలీ ప్రక్రియను కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని విమర్శించారు.



## అత్యంత వృద్ధుడిగా బ్రిటన్ వాసి?

**లండన్:** బ్రిటన్‌కు చెందిన 111 ఏండ్ల వృద్ధుడు, రిటైర్డ్ ఇంజినీర్ బోబ్ వెయిటోన్ పేరు ప్రపంచంలోకెల్లా అత్యంత వృద్ధుడిగా రికార్డులకెక్కనున్నది. గత ఆదివారం జపాన్‌కు చెందిన చిటెస్టు వాటనాబే (112) మరణించారు. ఆయన తర్వాత అత్యధిక కాలం జీవిస్తున్న వ్యక్తిగా వెయిటోన్ నిలువనున్నారు. 1908 మార్చి 29న వెయిటోన్ జన్మించారని బీబీసీ ఓ వార్తాకథనంలో తెలిపింది. ఈ వార్తలపై ఆయన స్పందిస్తూ.. 'నేను అత్యధిక కాలం జీవించి ఉండటం మీకు అద్భుతంగా కనిపించవచ్చు. కానీ నా జీవితంలోని ఘటనల్లో అది ఒక భాగం' అని తెలిపారు. వాటనాబే మృతి తర్వాత ప్రపంచంలోకెల్లా అత్యధిక కాలం జీవిస్తున్న వ్యక్తి కోసం రికార్డులను పరిశీలిస్తున్నామని గిన్నిస్ బుక్ అధికార ప్రతినిధి చెప్పారు.

## 'కోరేగావ్-భీమా': 348 కేసుల ఉపసంహరణ

**ముంబై:** కోరేగావ్-భీమా హింసకు సంబంధించి స్థానికులపై నమోదుచేసిన 348 కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించిందని గురువారం మహారాష్ట్ర శాసనమండలిలో రాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ శరద్ రాన్పిసే అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. 'కోరేగావ్-భీమా హింస విషయమై ఆ ప్రాంత స్థానికులపై నమోదైన 649 కేసుల్లో 348 కేసులను ఉపసంహరించాం. విచారణ పూర్తయిన తర్వాత మిగతా కేసులను కూడా ఉపసంహరిస్తాం' అని చెప్పారు.

## మహారాష్ట్ర బడుల్లో 'మరాఠీ' తప్పనిసరి

**ముంబై:** మహారాష్ట్రలోని అన్ని బడుల్లో 'మరాఠీ భాష'ను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లును ఆ రాష్ట్ర అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం మరాఠీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ బిల్లు ఆమోదం పొందడం విశేషం. బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి సుభాష్ దేశాయ్ మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ మాదిరిగా మహారాష్ట్రలోనూ మాతృభాషను ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తూ బిల్లు తీసుకొచ్చామని తెలిపారు.

## జైలుకు ఆజంఖాన్ కుటుంబం తరలింపు

**సీతాపూర్ :** ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆజంఖాన్, ఆయన భార్య తజీన్ ఫాత్మ, కుమారుడు అబ్దుల్లా ఆజంను గురువారం సీతాపూర్ జైలుకు తరలించారు. అబ్దుల్లా రెండు జనన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నట్లు, 2017 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించినట్లు కేసు నమోదైంది. కుమారుడు నకిలీ ధ్రువపత్రం కోసం సమర్పించిన అఫిడవిట్‌లో సంతకాలు చేసినందుకు ఆజంఖాన్, ఫాత్మపైనా కేసు నమోదైంది. బుధవారం వీరికి కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

## పాక్‌కు లక్ష చైనా బాతులు



***బీజింగ్, ఫిబ్రవరి 27:*** *ఆర్థికలోటుతో ఇప్పటికే సతమతమవుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌కు మిడతలు గొప్ప చిక్కు తెచ్చి పెడుతున్నాయి. అక్కడి వేలాది ఎకరాల గోధుమ పంటపై దాడి చేస్తూ ఆ దేశానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో ఆ దేశాన్ని ఆదుకునేందుకు డ్రాగన్ దేశం చైనా ముందుకొచ్చింది. ఇందులో భాగంగా పాక్‌కు లక్ష బాతులను పంపేందుకు సిద్ధమైనట్టుగా చైనా స్థానిక మీడియా సంస్థ పేర్కొంది. ఒక కోడి రోజుకు 70 మిడతలను తింటుంది. ఇదే సమయంలో ఒక బాతు 200లకు పైగా మిడతలను తినగలుగుతుందని జిజియాంగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ టెక్నాలజీకి చెందిన పరిశోధకుడు లిజి తెలిపారు. మిడతలను అరికట్టేందుకు రసాయనాలు ఉపయోగిస్తే పర్యావరణం దెబ్బతినడంతో పాటు పంటకు నష్టం కూడా వాటిల్లే ప్రమాదం ఉన్నదని.. అందుకే మిడతల్ని అరికట్టేందుకు బాతులు సరైన పరిష్కారం అని ఆయన చెప్పారు. ప్రస్తుతం పాకిస్థాన్‌కు ఎదురైన పరిస్థితే రెండు దశాబ్దాల క్రితం చైనాలోని జిజియాంగ్‌లో ఏర్పడింది. దీంతో మిడతలను అరికట్టేందుకు బాతులను రంగంలోకి దింపి చైనా సత్ఫలితాల్ని పొందింది.*

# అద్భుతం.. అత్యద్భుతం

- భారత పర్యటనపై ట్రంప్ ప్రశంసలు
- ద్వైపాక్షిక సంబంధాల్లో గణనీయ పురోగతి సాధించామని వ్యాఖ్య



**వాషింగ్టన్:** భారత్‌ను అద్భుతమైన దేశంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనియాడారు. తన పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాల్లో గణనీయ పురోగతి నమోదైందని చెప్పారు. సకుటుంబ సమేతంగా మంగళ, బుధవారాల్లో ట్రంప్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న ట్రంప్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. భారత్ అద్భుత దేశమని ప్రశంసించారు. మోదీ గొప్ప వ్యక్తి, గొప్ప నాయకుడని కొనియాడారు. తమకు అద్భుతమైన ఆతిథ్యం లభించిందన్నారు. తన పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాల్లో గణనీయ పురోగతి నమోదైందని, రెండు దేశాల మధ్య సంబంధాలు ప్రస్తుతం అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. భారత్‌తో పెద్ద ఎత్తున వాణిజ్యాన్ని నిర్వహించనున్నామని, వారు (భారత్) ప్రస్తుతం వందల కోట్ల డాలర్లను అమెరికాకు పంపుతున్నారని చెప్పారు. మరోవైపు, భారత్‌పై ట్రంప్ యంత్రాంగం సానుకూల వ్యాఖ్యలు చేయగా, అధ్యక్ష ఎన్నికల్లో ఆయనకు ప్రత్యర్థిగా నిలువనున్న డెమొక్రటిక్ పార్టీ నేత బెర్నీ శాండర్స్ మాత్రం విమర్శలు గుప్పించారు. ఢిల్లీ హింసపై ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా నాయకత్వ వైఫల్యమని ఆరోపించారు. 'భారత్‌లో 20 కోట్ల మంది ముస్లింలు ఉన్నారు. (ఢిల్లీలో) ముస్లిం వ్యతిరేక మూక దాడుల్లో 27 మంది మృతిచెందారు. చాలా మంది గాయపడ్డారు. అయితే అది భారత్ విషయమని ట్రంప్ చెబుతున్నారు. మానవ హక్కులకు సంబంధించి ఇది పూర్తిగా నాయకత్వ వైఫల్యమే' అని ఆయన విమర్శించారు. ఢిల్లీ హింసపై మోదీతో చర్చించలేదని, అది భారత్ అంతర్గత విషయమని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, అమెరికాలో కరోనా విజృంభించే అవకాశాలను ట్రంప్ తోసిపుచ్చారు. వైద్యాధికారుల వ్యాఖ్యలకు ఆయన భిన్నంగా స్పందించడం గమనార్హం. బహిరంగ సభలు రద్దు చేసుకునేందుకు, ఇంటి నుంచే పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# మృత్యుముఖం నుంచి స్వదేశానికి

- చైనా, జపాన్ నుంచి ఢిల్లీకి 195 మంది భారతీయులు
- 41 మంది విదేశీయులు కూడా

**న్యూఢిల్లీ/బీజింగ్/టోక్యో, ఫిబ్రవరి 27:** కరోనా(కొవిడ్-19)తాకిడికి గురైన ప్రాంతాల్లో చిక్కుకొని.. చావులోగిలి వరకూ వెళ్లిన భారతీయులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వదేశానికి తీసుకొచ్చింది. వైరస్ వెలుగుచూసిన చైనాలోని వుహాన్ నగరం నుంచి 112 మందిని, కరోనా ప్రబలడంతో జపాన్ తీరంలో నిలిచిపోయిన డైమండ్ ప్రిన్సెస్ నౌకలో ఉన్న మరో 124 మందిని ఢిల్లీకి చేర్చినట్టు గురువారం ఆ శాఖ వెల్లడించింది. వుహాన్ నుంచి వచ్చిన తాజా బృందంలో 76 మంది భారతీయులతోపాటు మరో 36 మంది విదేశీయులు(బంగ్లాదేశ్-23, చైనా-6, మయన్మార్-2, మాల్దీవులు-2, దక్షిణాఫ్రికా-1, అమెరికా-1, మడగాస్కర్-1) ఉన్నారని, జపాన్ నుంచి వచ్చిన వారిలో 119 మంది భారతీయులతో పాటు మరో ఐదుగురు విదేశీయులు(శ్రీలంక-2, నేపాల్-1, దక్షిణాఫ్రికా-1, పెరూ-1) ఉన్నారని తెలిపింది. కరోనాతో పోరాడుతున్న చైనాకు సాయం అందించడంలో భాగంగా.. వాయుసేనకు చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానంలో భారత్ బుధవారం 15 టన్నుల వైద్య సామగ్రిని వుహాన్‌కు పంపించింది. వైద్య సామగ్రిని చేర్చాక.. సీ-17 తన తిరుగు ప్రయాణంలో అక్కడ ఉన్న 112 మందిని తీసుకొచ్చినట్టు అధికారులు తెలిపారు. ఇంతకు ముందు ఎయిరిండియా సంస్థకు చెందిన రెండు విమానాల ద్వారా వుహాన్‌లోని దాదాపు 650 మంది భారతీయుల్ని కేంద్రం తీసుకురావడం తెలిసిందే.



ఢిల్లీలోని ఐటీబీపీ కేంద్రంలో దరఖాస్తులు నింపుతున్న బాధితులు

### దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన

కరోనా వ్యాప్తిని అడ్డుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ.. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్‌ను అభిశంసించాలని డిమాండ్ చేస్తూ ఆ దేశంలో ఓ పిటిషన్ దాఖలైంది. దీనికి మద్దతిస్తూ ఆ పిటిషన్ మీద దాదాపు తొమ్మిది లక్షల మంది పౌరులు సంతకాలు చేశారు. మరోవైపు, చైనాలో కరోనాతో బుధవారం 29 మంది మరణించారు. దీంతో మృతుల సంఖ్య 2,722కు చేరింది. కరోనా నేపథ్యంలో సౌదీ అరేబియా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నది. మక్కా, మదీనా మసీదు సందర్శన (ఉమ్రా యాత్ర)కోసం వచ్చే విదేశీయులకు వీసా జారీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. ఇంకోవైపు ఇరాన్ వైస్ ప్రెసిడెంట్ (మహిళా, కుటుంబ వ్యవహారాలు) మసౌమె ఎబ్తెకర్‌కు కరోనా సోకినట్టు ఆ దేశ అధికారులు గురువారం వెల్లడించారు.

## బీహార్‌లో కులాల వారీగా జనగణన!

**పాట్నా:** వచ్చే ఏడాది చేపట్టనున్న జనాభా లెక్కల ప్రక్రియను కులాల వారీగా జరుపాలని బీహార్ అసెంబ్లీ గురువారం తీర్మానించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)పై మంగళవారం అసెంబ్లీలో చర్చ జరిగిందని, ఈ సందర్భంగా కులాల వారీగా జనగణన జరుపాలంటూ సీఎం నితీశ్‌కుమార్ ప్రతిపాదించారని స్పీకర్ విజయ్ కుమార్ చౌదరి చెప్పారు. ఈ ప్రతిపాదనపై చేసిన తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించిందని తెలిపారు. దీనిని జనగణన అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరుతామన్నారు.

## టైర్ పేలడంతోనే ఆ బస్సు ప్రమాదం

**జైపూర్:** రాజస్థాన్‌లోని బుండీ జిల్లాలో బుధవారం జరిగిన ఘోరప్రమాదానికి బస్సు టైరు పేలడమే కారణమని తెలుస్తున్నది. పెండ్లి వారితో వెళ్తున్న మినీ బస్సు బుధవారం ఉదయం కోట-దౌసా జాతీయ రహదారిపై ఓ వంతెన వద్ద అదుపు తప్పి నదిలో పడిపోయింది. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శాంతి ధారివాల్ గురువారం అసెంబ్లీలో ప్రకటన చేస్తూ.. బస్సు టైరు పేలడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందని తెలిపారు.



పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఈశాన్య ఢిల్లీలో జరిగిన నిరసనలో హింసకు ప్రేరేపించినవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఒకవేళ ఆప్ నేత ఎవరైనా దోషిగా తేలితే వారు రెట్టింపు శిక్షను పొందుతారు.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**

ఢిల్లీలో శాంతిని పునరుద్ధరించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది. కానీ కాంగ్రెస్, ఆప్ హింసపై రాజకీయం చేస్తున్నాయి. దీన్ని మేము ఖండిస్తున్నాం. రెండు నెలలుగా హింసను ప్రేరేపించే చర్యలు జరిగాయి. డిసెంబర్‌లోనే 'పోరాటం పూర్తి చేయాలి' అని సోనియాగాంధీ పిలుపునిచ్చారు.

**ప్రకాశ్ జవదేకర్, కేంద్ర మంత్రి**



**చరిత్రలో నేడు**



**1749**
హెన్రీ ఫీల్డింగ్స్ రాసిన 'టామ్ జోన్స్' నవల తొలి ప్రచురణ విడుదల.

**1933**
జర్మన్ కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన అడాల్ఫ్ హిట్లర్.





**1997**
పాకిస్థాన్‌లో భూకంపం. 45 మంది మృతి.

చైనా తూర్పు ప్రాంతంలోని వెయిహే నగరంలోకి వచ్చే విదేశీయులను పద్నాలుగు రోజుల పాటు ఏకాంతంగా హోటళ్లలో బస చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో జపాన్, దక్షిణకొరియా నుంచి వచ్చిన వారిపట్ల ఈ నిర్ణయం తీసుకున్నది. కానీ ఈ నిర్ణయం పట్ల దక్షిణకొరియా విదేశాంగ మంత్రి కాంగ్ క్యుంగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చైనా నగరాల్లో అమలవుతున్న ఆంక్షలే విదేశీయులకూ వర్తిస్తాయి. ఇది వ్యాధి ప్రబలకుండా తీసుకున్న చర్యే తప్ప, దౌత్యపరమైన నిర్ణయం కాదు.

**గ్లోబల్ టైమ్స్**

శ్రీలంక ప్రధాని మహింద రాజపక్సా ఇటీవల ఒక పౌర సమాజ బృందంతో మాట్లాడుతూ తాము ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు జాతీయ పట్టిక ద్వారా పార్లమెంటులో స్థానం కల్పించబోమన్నారు. కానీ ఆయన ఆ మాట మీద నిలబడుతారా అనేది తెలువదు. జయవర్ధనే దేశాధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాజ్యాంగ సవరణ ద్వారా ఓడిపోయిన అభ్యర్థులను పార్లమెంటుకు నామినేట్ చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికల గొడవతో సంబంధం లేకుండా మేధావులు చట్టసభలో ప్రవేశించడానికి ఈ నిబంధన ను ఉపయోగించుకోవాలి. కానీ ఏ ప్రభుత్వమూ దీన్ని పాటించడం లేదు.

**ది ఐలాండ్**



# 'పురో'భివృద్ధి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగుతుండటం హర్షణీయం. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహరచనకు అనుగుణంగా పురపాలక మంత్రి కేటీఆర్ ముందుండి ఈ కార్యక్రమాన్ని నడుపుతుండటంతో- క్షేత్రస్థాయిలో నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వాములవుతున్నారు. ప్రభుత్వం పదిరోజుల కార్యక్రమంగా చేపట్టినా, దీనిని నిరంతర ప్రక్రియగా చెప్పుకోవచ్చు. నగరాల నిర్వహణలో, ప్రజల జీవనసరళిలో భారీ మార్పులకు ఈ కార్యక్రమం నాంది పలుకుతుంది. ప్రజాప్రతినిధులు ముందుండి నడిపించడం, స్థానిక నాయకత్వంలో, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచడం, ప్రజలను వివిధ అంశాలపై చైతన్యవంతం చేసి భాగస్వాములుగా మార్చడం దిశగా ఈ కార్యక్రమంగా సాగుతున్నది. మహబూబ్‌నగర్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కేటీఆర్ ఒక్కో జిల్లాలో పర్యటిస్తూ నాయకులను, అధికారులను, ప్రజలను ఉత్సాహపరుస్తున్నారు. నగరాలు పరిశుభ్రంగా, వసతులతో కూడి ఉండటమనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదు. నిధులు కేటాయించినంత మాత్రాన తీరేది కాదు. అది ప్రజల జీవన సంస్కృతికి సంబంధించినది. ప్రజలలో చైతన్యం తేవడం ద్వారా మాత్రమే సాధ్యమయ్యేది. అందువల్లనే కేటీఆర్ జిల్లాలు తిరుగుతూ, పాదయాత్రలు చేస్తూ, ప్రజలను పలుకరిస్తూ ఉత్తేజితులను చేస్తున్నారు. 12 నగరపాలక సంస్థలు, 128 పురపాలక సంఘాలలో ఈ ఉద్యమం ఉధృతంగా సాగుతున్నది.

గ్రామస్థాయిలో అమలుకు నోచుకోకపోతే, ఢిల్లీ స్థాయిలో ఎన్ని పథకాలు రచించినా ప్రయోజనం ఉండదని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ముఖ్యమంత్రుల సమావేశం సందర్భంగా ప్రధానికి వివరించారు. గ్రామస్థాయి నాయకులు తమకు కేటాయించిన నిధులను వినియోగించుకొని చేతులు దులుపుకొనే పరిస్థితులు ఉండకూడదు. అందుకనే మొదట పల్లె ప్రగతిపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ కొనసాగింపుగా పట్టణ ప్రగతిని చేపట్టింది. దేశవ్యాప్తంగా నగరాల పరిస్థితి కడు దయనీయంగా ఉన్నది. సమీప పల్లెలన్నీ కలిసిపోతున్నప్పుడు రహదారులను ప్రణాళికాబద్ధంగా నిర్మించరు. మంచినీటి, మురికి పారుదల వసతులను తగిన స్థాయిలో కల్పించరు. పరిశ్రమలు కాలుష్యం వెదజల్లుతుంటాయి. పారిశుధ్య వసతులను పట్టించుకోరు. పల్లెల్లో ఏది ఉన్నా లేకపోయినా సంప్రదాయబద్ధంగా రూపొందిన జీవనసరళి ఉంటుంది. ఆధునిక వసతులు లేనప్పటికీ అదొక లోపంగా కనబడదు. కానీ ఆధునికమైనవిగా చెప్పుకుంటున్న నగరాల్లో వసతులు లోపించడం వల్ల జనజీవనం దుర్భరంగా మారుతుంది. పల్లెల నుంచి పట్టణాలకు వలసలు భారీగా సాగుతూ ఉంటాయి. భవిష్యత్ పరిస్థితులను అంచనా వేసి ఇప్పటినుంచే తగు ఏర్పాట్లు చేసుకోకపోతే నగర సమస్యలు మరింత తీవ్రమవుతాయి. ఇప్పటికే నరకాలుగా మారిన నగరాలను మళ్ళా నివాసయోగ్యంగా మార్చడానికి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇంతకాలం పేరుకుపోయిన సమస్యలను ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించి పరిష్కరిస్తున్నారు. వసతులను మెరుగుపరచడంతోపాటు పచ్చదనాన్ని పెంచడానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు నిధుల కొరత లేకుండా చూడటం మరో విశేషం. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా వ్యవహరిస్తే తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది.

**ఆధునికమైనవిగా చెప్పుకుంటున్న నగరాల్లో వసతులు లోపించడం వల్ల జనజీవనం దుర్భరంగా మారుతుంది. పల్లెల నుంచి పట్టణాలకు వలసలు భారీగా సాగుతూ ఉంటాయి. భవిష్యత్ పరిస్థితులను అంచనా వేసి ఇప్పటినుంచే తగు ఏర్పాట్లు చేసుకోకపోతే నగర సమస్యలు మరింత తీవ్రమవుతాయి. ఇప్పటికే నరకాలుగా మారిన నగరాలను మళ్ళా నివాసయోగ్యంగా మార్చడానికి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.**

ప్రపంచవ్యాప్తంగా నగరాల నిర్వహణలో భారీ మార్పులు రాబోతున్నాయని నగరపాలన ప్రణాళికావేత్తలు చెబుతున్నారు. గృహనిర్మాణాల్లో కూడా మార్పులు రాబోతున్నాయి. నీటిని, ఇంధనాన్ని పొదుపు చేసే విధానాలు వస్తాయి. చెత్త, మురుగునీరుతో పాటు ఏదీ వృథాగా వదలడం జరగదు. వ్యక్తిగత వాహనాల కన్నా మాస్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు ప్రాధాన్యం పెరుగవచ్చు. వైపరీత్యాలను తట్టుకునేవిధంగా నగరాలను తీర్చిదిద్దవలసి వస్తుంది. 'స్మార్ట్ సిటీ'భావన కూడా బలపడుతున్నది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం నగర నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తుంది. డిజిటల్ ఆర్థికవ్యవస్థ తెచ్చే మార్పులు జీవనసరళిని మారుస్తాయి. కృత్రిమ మేధ వంటి కొత్త సాంకేతికతను వినియోగించడం వల్ల నగర జీవనంలో భారీ మార్పు వస్తుంది. వాహనాల మధ్య సమన్వయం నెలకొని ట్రాఫిక్ రద్దీ, సిగ్నల్ విధానాలు మచ్చుకు కూడా కనిపించవని నిపుణులు అంటున్నారు. కాలనీల నిర్వహణ, భద్రత కూడా కొత్త పరిజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ఇతర దేశాలలో ఇంతగా మార్పులు చోటు చేసుకుంటూ ఉంటే మనం ఇంకా చెత్త చెదారం ఏరిపారేసే దశలోనే ఉండకూడదు. తొందరగా జీవన విధానాలను మెరుగుపరుచుకొని, తాజా సాంకేతికతను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి. తెలంగాణ ఏర్పడకముందు రాజకీయ నాయకత్వం చిత్తశుద్ధితో వ్యవహరించక పోవడమే ప్రధాన సమస్యగా ఉండేది. కానీ ఇప్పుడు మంత్రి కేటీఆర్ పట్టణాల అభివృద్ధి విషయమై దూరదృష్టితో, చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారు. దీనికి అనుగుణంగా అధికార బృందం కూడా అలసత్వం లేకుండా చురుగ్గా వ్యవహరించాలి. ప్రజలు కూడా మరింత ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో భాగస్వాములై నగరజీవనాన్ని సుఖమయంగా చేసుకోవాలి.

**జనగళం**

## బాధితులకు అండగా ఉండాలి

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తండ్రిని కానిస్టేబుల్ కాలితో తన్నిన ఘటన అందరినీ కలిచివేసింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లోనూ వ్యతిరేకత వచ్చింది. ఈ ఘటన పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించడం అభినందనీయం. తెలంగాణ ప్రభుత్వం మొదటినుంచి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలుచేస్తున్నది. బాధితులు నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు మానవీయంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో ప్రస్తావించారు. దానికి అనుగుణంగా పోలీసులు వ్యవహరించాలి. బాధితులకు అండగా ఉండాలి.

**- ఎం.మధు, జనగామ**

## అనాథలకు ఉపాధి కల్పించాలె

రాష్ట్ర ప్రభుత్వం పాలనలో అద్భుతమైన సంస్కరణలు తీసుకువచ్చింది. అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నది. హరితహారంతో పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంచడానికి కృషిచేస్తున్నది. చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా సాగునీటి సమస్యను తీరుస్తున్నది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనాథల పట్ల సీఎం కేసీఆర్ తన ఔదార్యాన్ని చాటుకోవాలి. ఉపాధి కల్పించి తమ జీవితాల్లో వెలుగునింపాలని అనాథలు కోరుకుంటున్నారు.

**- యెలిశెట్టి శంకరరావు, మియాపూర్, హైదరాబాద్**

## సంయమనం పాటించాలి

ఈశాన్య ఢిల్లీలో పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసకు దారితీయడం దీంట్లో కొందరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. దేశ రాజధానిలో జరుగుతున్న ఈ ఘటనల పట్ల అంతటా ఆందోళన వ్యక్తమవుతున్నది. రోజురోజుకు పెరుగుతున్న మృతుల సంఖ్య చూస్తే యావత్ దేశం గుండె తరుక్కుపోతున్నది. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అట్లనే రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు ఇలాంటి సమయాల్లో సంయమనం పాటించాలి. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టకూడదు. అలానే దీనిపై రాజకీయం చేయకుండా ఉద్రిక్తతలు తగ్గించడానికి కృషిచేయాలి. నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోకుండా సమస్య పరిష్కారం కోసం పని చేయాలి. అప్పుడే శాంతియుత పరిస్థితులు నెలకొంటాయి.

**- బి.రామాంజనేయులు, హైదరాబాద్**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**



**కృపాకర్ పొనుగోటి**

# మతం పేరిట వివక్ష తగదు

**2019 డిసెంబర్‌లో పార్లమెంటు ఉభయసభలు జాతీయ పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించాయి. ఈ చట్టం దేశ ప్రజల్లో చాలారకాల భయాలు, ఆందోళనకు కారణమైంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి శరణార్థులుగా వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు, జైనులు, క్రైస్తవులకు ఈ చట్టం ప్రకారం పౌరసత్వం లభిస్తుంది. ఇలా శరణార్థులుగా వచ్చిన ముస్లింల ప్రస్తావన లేకపోవడంతో ఈ పౌరసత్వ సవరణ చట్టం చాలా వివాదాస్పదంగా మారింది.**

విదేశీ చొరబాటుదారులను గుర్తించి, వారిని ఏరివేసేందుకు పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చామని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంటున్నది. ఈ విధంగా దేశంలోని ప్రజలందరినీ కొత్తగా పౌరసత్వ నిరూపణ చేసుకోవాలనే ప్రమాదంలోకి నెట్టింది. పైగా పౌరసత్వ నిరూపణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం కఠినంగా మార్చింది. ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు డాక్యుమెంట్లు, పట్టాదార్ పాస్‌బుక్, భూ యాజమాన్య పత్రాలు, పన్ను రశీదుల వంటి పదిహేను రకాల పత్రాలేవీ పౌరుల పౌరసత్వ నిరూపణకు ఆధారాలు కాబోవని వార్తలు వస్తున్నాయి.

ఆధార్‌కార్డులు పొందిన 127 మంది తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని హైదరాబాద్‌లోని ఆధార్ ప్రాధికార సంస్థ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. కాగా పౌరసత్వ నిరూపణకు ఆధార్‌కార్డు కీలక డాక్యుమెంటు కాదని వినవస్తున్నది. ఈ సందర్భంలో ఆధార్ ప్రాధికార సంస్థ పౌరుల పౌరసత్వ నిరూపణపై విచారణకు నోటీసులు జారీ చేసింది. ఆధార్ సంస్థ తనకు లేని అధికారాన్ని చెలాయించడమేనని తీవ్ర విమర్శలు వచ్చాయి.

2019 డిసెంబర్‌లో పార్లమెంటు ఉభయసభలు జాతీయ పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించాయి. ఈ చట్టం దేశ ప్రజల్లో చాలారకాల భయాలు, ఆందోళనకు కారణమైంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి శరణార్థులుగా వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు, జైనులు, క్రైస్తవులకు ఈ చట్టం ప్రకారం పౌరసత్వం లభిస్తుంది. ఇలా శరణార్థులుగా వచ్చిన ముస్లింల ప్రస్తావన లేకపోవడంతో ఈ పౌరసత్వ సవరణ చట్టం చాలా వివాదాస్పదంగా మారింది.

పౌరసత్వానికి, మతాన్ని కలిపి చూపడం వల్ల, పౌరసత్వాన్ని మతం ప్రాతిపదికన ఈ చట్టం నిర్ణయించినట్లయింది. దీంతో అనేకమంది విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదని విమర్శించారు. రాజకీయాలను-మతాన్ని వేరువేరుగా చూడాలి. ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలన్నీ మత ప్రసక్తి లేని లౌకికవాద పునాదులపై నిర్మితమైనవే. భారతదేశ రాజ్యాంగ ప్రజాస్వామ్యం ఇందులో భాగమే. అధికరణం పద్నాలుగు-చట్టం ముందు అందరూ సమానులేనని పేర్కొంటున్నది. అధికరణం పదిహేను-కులం, మతం జెండర్, ప్రాంతం, భాష, జాతి మొదలగువాటి ప్రాతిపదికపై ఎవరి పట్లా వివక్ష చూపరాదని నిర్దేశిస్తున్నది. 1973లో కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో పౌరసత్వం వేరు, మతం వేరు. ఈ రెండు అంశాలను కలిపిచూడలేం. ప్రస్తుత సీఏఏ చట్టం శరణార్థులుగా వచ్చిన ముస్లింల ప్రస్తావన చేయలేదు. దీంతో పౌరులందరూ తాజాగా ఎవరి పౌరసత్వాన్ని వారే నిరూపించుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడినారు. అందుకే దేశ ప్రజలందరిలో ముఖ్యంగా దేశంలోని ముస్లిం, దళిత, ఆదివాసీ, బీసీ ప్రజల్లో అభద్రత, ఆందోళనలు నెలకొన్నాయి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో నలభై శాతం మంది ఎస్సీలకు, నలభై శాతం మంది ముస్లింలకు, నలభై నాలుగు శాతం మంది ఆదివాసులకు పుట్టిన తేదీ పత్రాల్లేవు. పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం ప్రతి పౌరుడూ/పౌరురాలూ ఇక్కడే పుట్టిపెరిగినట్టు వారసత్వ వృక్షంతో సహా రుజువులు చూపించాలి. నిరక్షరాస్యత, పేదరికం కారణంగా దళితులు, మైనారిటీలు, ఆదివాసులు, బీసీలు తాజా పౌరసత్వ నిరూపణ ప్రక్రియతో చిక్కుల్లో పడే ప్రమాదం ఎక్కువగా ఉన్నది.

చాలా సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి జీవోలు, నివేదికలు, నిర్ణయాలు పారదర్శకంగా ప్రజల ముందు ఉంచలేకపోతున్నాయి. రేషన్‌కార్డు, పింఛన్ కార్డు, ఉపకారం మొదలగు హక్కు పత్రాల్లో, ఓటర్ ఐడీ, ఆధార్ మొదలగు గుర్తింపుకార్డుల్లో సామాన్య ప్రజల పేర్ల నమోదులో ఎన్నో తప్పుల తడకలు మనం చూస్తున్నవే. చదువులేని, సాధారణ ప్రజలకు తమ గుర్తింపుకార్డుల్లో, హక్కు పత్రాల్లో అచ్చుతప్పులు పడిన తమ పేర్లను సవరించుకునే మార్గాలు, అవకాశాలు కూడా తెలియవు. అవకాశాల్లేని పరిస్థితుల్లో ఉంటారు. అచ్చుతప్పుల పర్యావసానంగా వారికి జరిగే నష్టాలకు, శిక్షలకు ఎవరిది బాధ్యత? ప్రజల కోసం ప్రభుత్వమా? ప్రభుత్వం కోసం ప్రజలా? ప్రజల కోసం చట్టాలా? చట్టాల కోసం ప్రజలా?

**పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దుచేయాలని, పుట్టుకతో వచ్చే సహజ పౌరసత్వాల నిరూపణకు కఠిన ప్రక్రియ అవసరం లేదని దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ నిరసనలను శాంతియుత పద్ధతుల్లో వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేకచోట్ల ప్రజలు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి తమ నిరసనలు తెలిపారు. జేఎన్‌యూ, జామియా మిలియా, హెచ్‌సీయూ, మనూ వంటి విశ్వవిద్యాలయాల్లో సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో మైనారిటీ మహిళల ఆధ్వర్యంలో రెండు నెలలకుపైగా నిరసన దీక్షా శిబిరం కొనసాగుతున్నది. దేశంలో కొన్నిచోట్ల నిరసనసభలు, సమావేశాలు, ఊరేగింపులపై దాడులు కూడా జరిగాయి.**

పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, పుట్టుకతో వచ్చే సహజ పౌరసత్వాల నిరూపణకు కఠిన ప్రక్రియ అవసరం లేదని దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ నిరసనలను శాంతియుత పద్ధతుల్లో వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేకచోట్ల ప్రజలు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి తమ నిరసనలు తెలిపారు. జేఎన్‌యూ, జామియా మిలియా, హెచ్‌సీయూ, మనూ వంటి విశ్వవిద్యాలయాల్లో సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో మైనారిటీ మహిళల ఆధ్వర్యంలో రెండు నెలలకు పైగా నిరసన దీక్షా శిబిరం కొనసాగుతున్నది. దేశంలో కొన్నిచోట్ల నిరసనసభలు, సమావేశాలు, ఊరేగింపులపై దాడులు కూడా జరిగాయి.

పౌరసత్వ సవరణ చట్టం రద్దు కోసం జరిగిన ఉద్యమాలలో దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు. అండగా నిలిచారు. ఇప్పటికే కేరళ, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు పౌరసత్వ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో అమలుచేయబోమన్నాయి. కేంద్రం ఈ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని తీర్మానాలు చేశాయి. పుదుచ్చేరి అసెంబ్లీ, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కూడా ఈ చట్టాన్ని రద్దుచేయాలని తీర్మానించాయి. అలాగే గ్రేటర్ హైదరాబాద్ పురపాలిక కూడా తీర్మానం చేసింది. దేశంలోని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక స్వపరిపాలనాసంస్థలు కూడా పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని, ఈ చట్టాన్ని రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ ఒక్కొక్కటిగా నిరసన బాటలో ముందుకొస్తున్నాయి.

నల్లధనాన్ని వెలికితీస్తానన్న కేంద్ర ప్రభుత్వం వెలికి తీయలేకపోయింది. జాతీయ బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయలు అప్పుగా తీసుకున్న కంపెనీలు, వ్యక్తుల నుంచి తిరిగి వెనక్కి రాబట్టలేకపోయింది. దళితులు, దళిత క్రైస్తవులు, ముస్లిం మైనారిటీలు, మహిళలపై లైంగికదాడులను నిలువరించలేకపోయింది. పెరుగుతున్న నిరుద్యోగం, ధరలను నియంత్రించలేకపోయింది. లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ శాఖను తెరిచింది. ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడానికి పూనుకుంటున్నది. విదేశీ పెట్టుబడులను నేరుగా అనుమతించింది. ఈ విధంగా ఆర్థిక, పాలనాసంక్షోభంలో ఎన్డీయే ప్రభుత్వం చిక్కుకుపోయింది. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే దేశ సరిహద్దు సమస్యలను, మతపరమైన ఉద్రిక్తలను రెచ్చగొట్టే కార్యక్రమాలను ముందుకు తెచ్చింది. ఇప్పుడు జాతీయ పౌరపట్టిక పేరుతో ప్రజలనెత్తిన జాతీయ పౌరసత్వ సవరణ చట్టం పిడుగును వేశారు. దేశప్రజల్లో పెల్లుబుకుతున్న అశాంతి, ఆందోళనలు, ఆగ్రహజ్వాలలు చల్లారంటే పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దుచేయాలి. లేదా నిబంధనలు సులభతరం చేయడం ఒక్కటే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందున్న మార్గం.

**(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)**

# జన సామాన్యంలోకి సైన్స్

**సైన్స్**



**డాక్టర్ నాగసూరి వేణుగోపాల్**

అది ఫిబ్రవరి 28వ తేదీ. 1928 సంవత్సరం. నలభై ఏళ్ల యువకుడి ఆవిష్కరణ ఒకటి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. అది కీలకమైన ఆవిష్కరణ. కాబట్టి ఆ వైజ్ఞానిక ఫలితం వెలుగుచూసిన రెండేళ్లకే నోబెల్ బహుమతి వరించింది. బ్రిటిష్ దాస్య పాలనలో మగ్గే దేశం నుంచి అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో పనిచేసే యువకుడు, తన ఆఫీసు పని తర్వాత, మహేంద్రలాల్ సర్కార్ ప్రారంభించిన ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టీవేషన్ ఆఫ్ సైన్స్ (IACS)లో పరిశోధన చేయడం ఏమిటి? కలకత్తాలో పనిచేసే ఈ తమిళ యువకుడు నోబెల్ బహుమతి పొందడం ఏమిటి? ఈ విషయాలు ఆలోచిస్తే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ఆ యువకుడు సి.వి. రామన్. ఆయనను కలువడానికి జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారు వేచి ఉండేవారు.

1925-35 మధ్యకాలం భారతదేశ సైన్స్ రంగానికి-మరీ ముఖ్యంగా భౌతికశాస్త్ర పరిశోధనలకు స్వర్ణయుగం.ఈ దశలోనే సి.వి.రామన్, ఎస్.ఎన్.బోస్, మేఘనాథ్ సాహా, సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ వంటివారు గొప్ప ఫలితాలను ఆవిష్కరించారు. పిమ్మట మనకు ఎన్నో విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, జాతీయస్థాయి ప్రయోగశాలలు వచ్చాయి. అంతరిక్షం, అణుకేంద్రక విజ్ఞానం వంటి రంగాల్లో ఎంతో పురోగతి సాధించాం. కానీ మన శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతులు రాలేదు. నోబెల్ బహుమతులు పొందిన మన శాస్త్రవేత్తలు మన పౌరులు కారు. ఈ ఆలోచన నాలుగు దశాబ్దాల నుంచి చర్చకు వస్తున్నది.

సి.వి.రామన్ శతజయంతి సంవత్సరానికి (1988) సమాయత్తమవుతున్నప్పుడు 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరించిన ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడం మొదలైంది. 1986 నుంచి ప్రారంభించినా 1988 నుంచి పెద్ద ఎత్తున జరుపుకుంటున్నాం. సందర్భానికి తగిన ఇతివృత్తాన్ని తీసుకొని ఈ జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. ఆ రోజున ప్రయోగశాలలు చేతులు చాచి రమ్మంటాయి. తమ పరిశోధనలను పరిశీలించమంటాయి. సైన్స్ అనేది పిల్లలకు, పరీక్షలకూ సంబంధించిన విషయం మాత్రమే కాదు. సైన్స్, టెక్నాలజీతో మన పంటలు, ఆరోగ్యం, ఆటవిడుపు, ఆయుర్దాయం మెరుగయ్యాయి. అలాగే మూఢనమ్మకాలు తగ్గాలి. కాలుష్యం తగ్గాలి. కానీ ఇవి జరుగకపోవడం విషాదం.

మన విద్యాలయాల్లో సైన్స్ బోధన చాలా రకాలుగా మెరుగుపడాల్సిన అవసరం ఉన్నది. మౌలిక సూత్రాలు పూర్తిగా అర్థం చేసుకోకుండా వాటి అనువర్తనాలు అందుకోవడం సాధ్యం కాదు. అందుకనే కొన్ని దేశాలు రాణించినంతగా మనం రాణించలేకపోతున్నాం. అదేవిధంగా బట్టీ పట్టడం ఆధారంగానే చదువులు సాగుతుండటం విషాదం. అలాకాకుండా ఆడుతూ పాడుతూ సైన్స్‌ను నేర్చుకుంటే చాలా ప్రయోజనం ఉంటుంది. నిజానికి సైన్స్ సెంటర్లలో ఇటువంటి ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే మన దేశ జనాభాకు తగినరీతిలో ఇవి అందుబాటులో లేకపోవడం ఒక లోపంగా చెప్పుకోవచ్చు. మరోవైపు కేవలం ఉపాధి దృష్టితో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాల వైపు మొగ్గి గట్టి పరిశోధనలు లేకపోవడం ఇంకా పెద్ద అనర్థదాయకం. ఈ పద్ధతులన్నీ పెద్ద ఎత్తున మారితేనే ఆ స్థాయిలో మన సైన్స్ విద్యా ప్రణాళిక, బోధనా పద్ధతులు, ప్రయోగశాలలు మారుతాయి.

సైన్స్ సూత్రాలు, నియమాలు పూర్తిగా ఆకళింపు కావాలంటే అవి ఆవిష్కరించబడిన తీరు, ఆవిష్కరించిన వ్యక్తి జీవిత నేపథ్యం బోధపడాలి. ఓడ



మీద ప్రయాణం చేస్తూ ఆకాశంలోని నీలపు రంగును, సముద్రంలోని నీలపు రంగును విశ్లేషించినవారు సీవీ రామన్. సీవీ రామన్ పలు అంశాలను లోతుగా పరిశీలించేవారు, అధ్యయనం చేసేవారు. ఆయన వైజ్ఞానిక పరిశోధనలకు మాత్రమే పరిమితం కాలేదు. సంగీతంలో మంచి పరిచయం ఉంది. ఇంకా మంచి చిత్రకారుడు కూడా! కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రవేశం పొందడమే లక్ష్యంగా కష్టపడేవారు, మార్కుల కోసం బట్టీలు పట్టేవారు వ్యక్తిత్వ సమగ్ర వికాసం ముఖ్యమని గ్రహించాలి.

**శాస్త్రీయ పద్ధతుల్లో సైన్స్ బోధించబడి ప్రచారం జరిగితే ప్రయోజనం ఉంటుంది. సైన్స్ కేవలం పాఠశాలలకు, కళాశాలలకు పరిమితం కాకుండా జన సామాన్యంలోకి వెళ్లాల్సి ఉన్నది. నిజానికి సైన్స్ కాంగ్రెస్ వంటి సమ్మేళనాలు శాస్త్రవేత్తల కలయికకు వారు పరస్పరం స్ఫూర్తి పొందడానికి ఉపయోగపడుతాయి.**

శాస్త్రీయ పద్ధతుల్లో సైన్స్ బోధించబడి ప్రచారం జరిగితే ప్రయోజనం ఉంటుంది. సైన్స్ కేవలం పాఠశాలలకు, కళాశాలలకు పరిమితం కాకుండా జన సామాన్యంలోకి వెళ్లాల్సి ఉన్నది. నిజానికి సైన్స్ కాంగ్రెస్ వంటి సమ్మేళనాలు శాస్త్రవేత్తల కలయికకు వారు పరస్పరం స్ఫూర్తి పొందడానికి ఉపయోగపడుతాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏటా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ జరిగిన పద్ధతిలో సైన్స్ ఎగ్జిబిషన్ కూడా పెద్ద ఎత్తున జరిగితే దానికి ప్రజలు విరివిగా వస్తే ఎంతో బాగుంటుంది. మనకున్న వనరులను మనం పరిశీలించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

దేశంలో ఏ నగరంలో లేనివిధంగా హైదరాబాద్‌లో మంచి ప్రయోగశాలలు చాలా ఉన్నాయి. నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వంటి గొప్ప ప్రయోగశాలలు ఉన్న తార్నాక ఏరియాలోవిజ్ఞాన ఉత్సవం ఏటా జరిగితే ఎంతో బాగుంటుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సైన్స్ అకాడమీ, పౌరులు, శాస్త్రవేత్తలు నడుం కట్టాలి. ఒకవారం పాటు శాస్త్ర, సాంకేతికరంగాల గురించి ముమ్మర ప్రచారం సాగించాలి. ఈ వారోత్సవం ఫిబ్రవరి 28న ముగిసేవిధంగా ఉండాలి.

2020 జాతీయ సైన్స్ దినోత్సవం ఇతివృత్తం 'వైజ్ఞానిక రంగంలో మహిళలు'. అన్నిరంగాల మాదిరిగానే సైన్స్‌లో కూడా మహిళల పట్ల వివక్ష ఉన్నది. పరిశోధనరంగంలో ఎక్కువ గంటలు తదేకదీక్షతో శ్రమించాల్సి ఉంటుంది. మహిళలకు పెళ్లి, పిల్లలు సంభవించే వయసులో పరిశోధన మందకొడి అయితే గొప్ప ఫలితాలు వచ్చే అవకాశం లేదు. ఇదే సమస్య. అయినా మనకు అన్నమణి, జానకీ అమ్మాళ్, అసిమా ఛటర్జీ, శకుంతలా దేవి వంటివారు ఆదర్శంగా నిలుస్తారు. గతంలోనే కాదు, ఇటీవల కాలంలో టెస్సీ థామస్ వంటి శాస్త్రవేత్తలు మనకు వెలుగు తారకల్లా కనబడుతారు.

వైజ్ఞానిక రంగానికి సంబంధించి లోతుగా చర్చించే సందర్భం జాతీయ సైన్స్ దినోత్సవం. ఈ సందర్భంగా మన వైజ్ఞానిక రంగంలో పురోభివృద్ధి, సమాజంపై ఆ ప్రభావంపై చర్చించుకోవాలి. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఈ సైన్స్ దినోత్సవం ఒక సందర్భం.

**(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



పట్టణప్రగతిలో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



ఖమ్మం నగరంలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెల రాజశ్రీ



మేడ్చల్ మున్సిపాలిటీలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి. చిత్రంలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

# 'ప్రగతి' పరుగులు

## నాలుగోరోజు ముమ్మరంగా 'పట్టణప్రగతి' పనులు

## మున్సిపాలిటీల్లో మంత్రుల పర్యటన

**నమస్తేతెలంగాణ,నెట్‌వర్క్:** రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రగతి ప్రణాళిక అమలు జోరందుకున్నది. నాలుగోరోజైన గురువారం మున్సిపాలిటీల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. రోడ్లు, మురుగుకాల్వలు, ఖాళీ ప్రదేశాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. డంప్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి శ్రమదానం చేస్తుండటంతో పట్టణాలు శుభ్రంగా మారుతున్నాయి.

### దేవరకొండలో మండలి చైర్మన్ గుత్తా..

నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పర్యటించారు. పట్టణ ప్రగతిలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### బాన్సువాడలో స్పీకర్ పోచారం..

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీలో పర్యటించిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 3,11వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి స్థానికులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పట్టణాన్ని బంగారు బాన్సువాడగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. 11వ వార్డులో కాలనీవాసులకు పోచారం వస్త్రంతో చేసిన చేతి సంచులను పంపిణీ చేశారు.

### భీమ్‌గల్‌లో మంత్రి వేముల

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పట్టణ ప్రగతితో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న భరోసా ప్రజల కండ్లల్లో కన్పించిందని మంత్రి వేముల పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 3, 14, 35, 42వ డివిజన్లలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పట్టణప్రగతిలో పాల్గొని మొక్కలు నాటారు. సూర్యాపేట మున్సిపాలిటీలోని పలువార్డుల్లో జరుగుతున్న పట్టణ ప్రగతి పనులను మంత్రి జగదీశ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి మాట్లాడుతూ పట్టణప్రగతి ద్వారా అన్ని ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంత్రి సబితాఇంద్రారెడ్డి 12 చెత్తసేకరణ ఆటోలు, 4 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. మేడ్చల్ మున్సిపాలిటీలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పట్టణప్రగతి పనులను పరిశీలించారు.



నల్లగొండ జిల్లా దేవరకొండ ఐదోవార్డులో మొక్కనాటి నీరుపోస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్

### నిరంతరం కొనసాగించాలి: ఎర్రబెల్లి

పల్లెప్రగతి కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మంత్రి ఎర్రబెల్లి, ఆ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను కలిశారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపామని సంఘం అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఏ రమేశ్, పండరీనాథ్, సురేశ్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



**"అమ్మా బాగున్నారా? మీకు తడి, పొడి చెత్త బుట్టలిచ్చారా?.. చెత్త తీసుకెళ్లే వాహనాలు వస్తున్నాయా?.. రోజూ నల్లా నీళ్లు వస్తున్నాయా? అని కరీంనగర్ జిల్లా జమ్మికుంట 27వ వార్డుకు చెందిన నూనె మల్లమ్మను కలెక్టర్ శశాంక అడిగారు. 'పట్టణ ప్రగతి'లో భాగంగా గురువారం హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో పర్యటించిన ఆయన.. ఇంటింటికీ వెళ్లి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. కలెక్టర్ ప్రశ్నకు స్పందించిన మల్లమ్మ .. చెత్త వాహనాలు రోజూ వస్తున్నాయని, నీళ్లు కూడా సరిపడా వస్తున్నాయని సంబురంగా సమాధానమిచ్చింది. - జమ్మికుంట**



పట్టణప్రగతిలో భాగంగా గురువారం సూర్యాపేట 33వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# ఆన్‌లైన్‌లో నిశ్చితార్థం

- అమెరికాలో ఉంగరాల మార్పిడి
- మదనాపురంలో వేదమంత్రాలు

**మదనాపురం:** అమెరికాలో స్థిరపడిన తెలంగాణకి చెందిన ఓ జంట వినూత్నంగా నిశ్చితార్థం జరుపుకొన్నది. వారు అమెరికాలో ఉంగరాలు మార్చుకోగా.. వారి పెద్దలు ఇక్కడ మిగతా తంతును పూర్తి చేశారు. వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన జక్కుల నాగన్నయాదవ్-అనురాధల రెండో కూతురు సాన్విశ్రుతి ఉన్నతవిద్య కోసం 2013లో అమెరికా వెళ్లి.. ప్రస్తుతం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే ఉద్యోగం చేస్తున్న వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన ఐలయ్యయాదవ్, శ్రీవాణి దంపతుల కుమారుడు వంశీకృష్ణకు సాన్విశ్రుతిని ఇచ్చి పెండ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఈమేరకు వివాహం నిశ్చయమైంది. ఈ నెల 17న నిశ్చితార్థం, 27న వివాహం చేయాలని ఇరుకుటుంబాల వారు నిర్ణయించారు. వంశీకృష్ణకు సెలవు దొరకకపోవడంతో నిశ్చితార్థం వాయిదాపడింది. పెండ్లికి కూడా సెలవు లభించకపోవడంతో పెండ్లి ముహూర్తం రోజునే నిశ్చితార్థం చేసుకోవాలని భావించారు. దీంతో ఇరు కుటుంబాల వారు మదనాపురం ఆంజనేయస్వామి ఆలయంలో, వేదపండితుల సమక్షంలో లగ్నపత్రిక రాసుకొని ఏప్రిల్ 12న అమెరికాలో పెండ్లి చేయాలని నిర్ణయించారు. ఇరు కుటుంబాల పెద్దలు ఇక్కడ నిశ్చితార్థతంతును పూర్తిచేయగా అమెరికాలో ఉన్న కాబోయే వధూవరులు ఒకరికొకరు ఉంగరాలు మార్చుకున్నారు. ఆ దృశ్యాన్ని మదనాపురంలో ఏర్పాటుచేసిన స్క్రీన్ ద్వారా ఇరు కుటుంబాలు వారి బంధువులతో కలిసి తిలకించారు.



అమెరికాలో ఉంగరాలు మార్చుకుంటున్న వంశీకృష్ణ, సాన్విశృతి.. మదనాపురంలో లగ్నపత్రిక నిశ్చయ తాంబులాలు మార్చుకుంటున్న ఇరు కుటుంబాల సభ్యులు

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- రాజీవ్ రహదారిపై ఘోరం
- గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్న కారు

**తిమ్మాపూర్ రూరల్:** రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ - ఇందిరానగర్ గ్రామాల మధ్య గురువారం నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన సింగరేణి ఉద్యోగులు కాసారపు వివేక్ చంద్ర (20), వేముల ప్రణయ్‌కుమార్ (28), తమ స్నేహితులు అంకరి స్వరాజ్, బియ్యాల శివకేశవతో కలిసి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు బుధవారం రాత్రి బయలుదేరారు. మార్గమధ్యంలో మద్యం సేవించారు. రామకృష్ణకాలనీ స్టేజీ దాటిన తర్వాత లారీని ఓవర్‌టేక్ చేయబోయి.. దానిని ఢీకొట్టారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న స్వరాజ్ పక్కన కూర్చున్న వివేక్‌చంద్ర, ప్రణయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. స్వరాజ్‌తోపాటు శివకేశవకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించి చికిత్స అందించారు. సంఘటనా స్థలాన్ని కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి కారణం మద్యం మత్తే అని తేల్చారు. కారు నడిపిన స్వరాజ్‌కు శ్వాస పరీక్షలు నిర్వహించగా ఎక్కువ మొత్తంలో ఆల్కహాల్ నమోదైనట్టు తెలిపారు. స్వరాజ్‌పై కేసు నమోదుచేసినట్టు సీఐ మహేశ్‌గౌడ్ వెల్లడించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# ఎరువుల ముఠా గుట్టురట్టు

- అనుమతి లేని క్రిమిసంహారక మందుల విక్రయం
- రూ. 41.80 లక్షల సరుకు సీజ్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ అనుమతిలేని క్రిమిసంహారక మందులను విక్రయిస్తున్న ఎరువుల ముఠా గుట్టు రట్టయ్యింది. కరీంనగర్ శివారు బొమ్మకల్‌లో రూ.41.80 లక్షల విలువైన సరుకును వ్యవసాయాధికారులు సీజ్‌చేశారు. ఫొరెట్-10జీ క్రిమిసంహారక గుళికలను బొమ్మకల్‌లోని గోదాంలో గుంటూరు శ్రీనివాస్ అక్రమంగా విక్రయిస్తున్నట్టు తెలుసుకున్న వ్యవసాయాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అక్కడ జరుగుతున్న దందాను చూసి అవాక్కయ్యారు. గాయత్రి ఆగ్రో ఏజెన్సీ పేరిట 2016లో కరీంనగర్‌లోని నాకాచౌరస్తాలో దుకాణం నిర్వహించేందుకు లైసెన్స్ తీసుకున్న శ్రీనివాస్.. బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని ఓ గోదాములో క్రిమి సంహారక గుళికలను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇతని వద్ద నుంచి రిటైల్ డీలర్లు, రైతులు కొనుగోలు చేస్తున్నట్టు తెలుసుకున్న కరీంనగర్ రూరల్ వ్యవసాయాధికారి సత్యం తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా 1,540 బస్తాల్లో సుమారు 38.05 టన్నుల అనుమతిలేని క్రిమిసంహారక గుళికలు ఉన్నట్టు గుర్తించారు. జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ అక్కడికి వెళ్లి ఇన్‌వాయిస్‌లు, పర్మిట్లు పరిశీలించారు. ఈ క్రిమిసంహారక మందులు చాలావరకు గుజరాత్‌లోని సర్దార్ పటేల్ కెమికల్ కంపెనీ నుంచి, కొన్ని ఏపీలోని గుంటూరు నుంచి వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో దుకాణాన్ని సీజ్ చేయించారు. శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# వైరస్‌తో 3వేల కోళ్లు మృత్యువాత

**వెంకటాపూర్(ములుగు):** ఉష్ణోగ్రతలు పెరుగడంతో వైరస్ విజృంభించి మూడు వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. ములుగు జిల్లాలోని వెంకటాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నది. 5 కోళ్ల ఫారాలలోని కోళ్లు మృతి చెందడంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు చనిపోయిన కోళ్లను పరిశీలించారు. వైరసే కారణమని అధికారులు భావిస్తున్నారు. కోళ్లకు సంబంధించిన నమూనాలను వరంగల్ ల్యాబ్‌కు పంపినట్టు సమాచారం. పౌల్ట్రీ రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ హామీ ఇచ్చారు. కోళ్లు మృత్యువాత పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు.



మృత్యువాతపడ్డ కోళ్లు

# జలహారం

- 'కాళేశ్వరం'లో గంగమ్మ పరవళ్లు
- లింక్-1,2లో దిగ్విజయంగా ఎత్తిపోతలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** కాళేశ్వర గంగ ఉప్పొంగుతున్నది. దిగువ నుంచి ఎగువకు పరుగులు తీస్తున్నది. భూపాలపల్లి జిల్లాలో లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఇక గురువారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో 1, 2, 7వ మోటర్లు నడిపారు. ఒక్కో మోటర్ 2,900 క్యూసెక్కుల చొప్పున మొత్తం 8,700 క్యూసెక్కుల నీరు మంథని మండలం సిరిపురంలోని పార్వతి బరాజ్‌లోకి చేరుతున్నది. ఈ బరాజ్ నుంచి నీటిని అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్ ద్వారా ఎగువన ఎల్లంపల్లి బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. పార్వతి పంప్‌హౌజ్‌లో 3, 4, 5, 6వ మోటర్లు నడిపిస్తుండగా, ఒక్కో మోటర్ ద్వారా 2,610 క్యూసెక్కుల చొప్పున 10,440 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి బరాజ్‌లోకి చేరుతున్నది. ఇక లింక్-2లో భాగంగా ధర్మారం మండలం నంది మేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో అధికారులు 3, 4వ మోటర్లను నడిపిస్తున్నారు. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కులు నంది రిజర్వాయర్‌లోకి తరలుతున్నది. ఇక్కడి నుంచి 7వ ప్యాకేజీలోని జంట సొరంగాల ద్వారా 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడ 2, 4వ పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, గురువారం కూడా వాటినే నడిపించారు. గాయత్రి పంపుహౌజ్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు గ్రావిటీ కాల్వ ద్వారా ప్రయాణించి 5.7 కిలోమీటర్ల దూరంలోని వరద కాల్వ జంక్షన్ పాయింట్‌కు చేరుకొని ఎడమవైపు ఎస్సారార్‌కు, కుడివైపు పునర్జీవ పథకంలో భాగంగా వరద కాల్వపై నిర్మించిన రాంపూర్ పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా గురువారం సాయంత్రం నాటికి 10.55 టీఎంసీల జలాలను ఎత్తిపోసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### ఎల్ఎండీకి 5,662 క్యూసెక్కులు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని ఎస్సారార్ నుంచి ఎల్ఎండీకి గురువారం 5,662 క్యూసెక్కుల నీటిని పంపించారు. ఎస్సారార్ జలాశయం నాలుగు రివర్స్ స్లూయిస్ ద్వారా దిగువకు నీటిని పంపుతున్నారు. ఎస్సారార్‌లో 25.272 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. కాగా ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి ఎల్ఎండీకి గురువారం 5,773 క్యూసెక్కుల నీరు రాగా, అంతే మొత్తంలో బయటికి వెళ్తున్నది. ఎల్ఎండీలో ప్రస్తుతం 10.926 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ డెలివరీ సిస్టర్న్ వద్ద ఉప్పొంగుతున్న గోదావరి జలాలు



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్ సమీపంలోని వరదకాల్వ ద్వారా ఎస్సారార్‌కు తరలుతున్న కాళేశ్వరం జలాలు

# తుంగభద్ర పుష్కరాలకు ఏర్పాట్లు

## అలంపూర్‌లో దేవాదాయశాఖ అధికారుల పర్యటన

**అలంపూర్, నమస్తే తెలంగాణ:** ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించనున్న తుంగభద్ర పుష్కరాలకు దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రంలో గురువారం దేవాదాయ శాఖ స్థపతి వల్లీ నాయగం అధికారులతోకలిసి పర్యటించి పనులను పరిశీలించారు. స్నానాలు, ఆలయదర్శనాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వల్లీ నాయగం చెప్పారు. దేవాదాయశాఖ అతిథి గృహంలో ఫర్నిచర్ ఏర్పాటు, ప్రహరీ నిర్మాణాం, పుష్కరఘాట్, ఆలయ పరిసరాల్లో ఫ్లోరింగ్, అమ్మవారి ఆలయ రాజగోపురానికి రంగులు వేయడం, ప్రసాదాల కోసం అదనపు కౌంటర్ల ఏర్పాటు తదితర పనులను పరిశీచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్థపతి దామోదర్, ఈఈ మల్లికార్జున్‌రెడ్డి, ఏఈ బాలయ్య, ఆలయ ఈవో ప్రేమ్‌కుమార్, ఆలయ సిబ్బంది ఆలయ ముఖ్య అర్చకుడు ఆనంద్ శర్మ తదితరులు ఉన్నారు.

# అర్వింద్‌పై కేసు పెట్టాలి

## పసుపు రైతులకు నమ్మకద్రోహం

## మీడియాతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**మల్లాపూర్:** పసుపు రైతులను మోసగించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై చీటింగ్ కేసు పెట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీ ఎన్నికల్లో పసుపు బోర్డు తీసుకొస్తానంటూ బాండ్‌పేపర్ రాసిచ్చి అర్వింద్ రైతులను మోసగించాడని ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..



పసుపు రైతులకు పసుపు పంటకు ప్రత్యేక బోర్డు కావాలని.. సుగంద ద్రవ్యాల బోర్డు కాదని స్పష్టం చేశారు. ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించి చెరుకు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చివరి గ్రామాలకు సాగు నీరు అందిచాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

# చిన్నారిపై సామూహిక లైంగికదాడి

**కరీంనగర్ క్రైం:** తొమ్మిదేండ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు, ఓ మైనర్ సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన బాలిక స్థానిక పాఠశాలలో చదువుతున్నది. చిన్నారి తల్లి నగరంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తుండగా, తండ్రి ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం చిన్నారి పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం తిరిగొచ్చింది. ఆ సమయంలో తల్లిదండ్రులిద్దరూ పనికివెళ్లడంతో బాలిక ఒంటరిగా ఉన్నది. ఇదే అదనుగా భావించిన ఇద్దరు యువకులు, ఓ బాలుడు ఆడుకుందామంటూ చిన్నారిని బయటకు పిలిచి లైంగికదాడికి పాల్పడ్డారు. బుధవారం బాలిక అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు లైంగికదాడి జరిగిందని గుర్తించారు. పోలీసులు పోక్సోచట్టం కింద కేసు నమోదుచేశారు. నిందితులకోసం పోలీసులు గాలిస్తున్నారు.

# నయీం అనుచరుడి అరెస్టు

**భువనగిరి అర్బన్:** నయీం అనుచరుడు మహ్మద్ మజార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు భువనగిరి టౌన్ ఇన్‌స్పెక్టర్ కాశిరెడ్డి గురువారం తెలిపారు. భువనగిరికి చెందిన ఫకీర్ కుమారుడు మజార్.. నయీం అనుచరుడిగా పనిచేశారు. ఈ క్రమంలో పట్టణ శివారులోని సర్వే నంబర్ 854లోని 27 ఎకరాల భూదందా కేసుల్లో ఇతను నిందితుడిగా ఉన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సిద్దిపేటలో ఉన్న మజార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

సెన్సెక్స్ **39,746** ↘143

నిఫ్టీ **11,633** ↘45

ముడి చమురు (బ్రెంట్) ↘52.21 డాలర్లు



## కియా కార్నివాల్ అదుర్స్

ఒకేరోజు పది కార్ల డెలివరీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** కియాకు చెందిన వాహనాలకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇటీవల దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన సరికొత్త లగ్జరీ ఎంపీవీ కార్నివాల్‌ను ఒకేరోజు పది మంది కస్టమర్లకు అందచేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.24.95 లక్షలుగా నిర్ణయించింది. మూడు రకాల్లో లభించనున్న ఏడు సీట్ల సామర్థ్యం కలిగిన వాహనం రూ.24.95 లక్షలు, ఎనిమిది సీట్లది రూ.25.15 లక్షలు, ఏడు సీట్లు కలిగిన ప్రీస్టేజ్ మోడల్ రూ.28.95 లక్షలు, తొమ్మిది సీట్లది రూ.29.95 లక్షలు, దీంతోపాటు ఏడుగురు కూర్చోవడానికి వీలుండే లిమోసిన్ మోడల్ రూ.33.95 లక్షలకు లభించనున్నది. బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన ఈ వాహనాన్ని 2.2 లీటర్ల వీజీటీ ఇంజిన్‌తో రూపొందించింది.

## హీరో సరికొత్త సూపర్ స్ప్లెండర్

ధర రూ.67,300



**దేశీయంగా** అత్యంత ప్రజాదరణ పొందిన సూపర్ స్ప్లెండర్‌ను బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించి మార్కెట్లోకి విడుదల చేసింది హీరో మోటోకార్ప్. ఈ బైకు ప్రారంభ ధరను రూ.67,300గా నిర్ణయించింది. 125 సీసీ ఇంజిన్ కలిగిన ఈ బైకు 10.73 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. పాత మోడల్‌తో పోలిస్తే 19 శాతం అధికం ఇది. రెండు రకాల్లో లభించనున్న ఈ బైకు సెల్ఫ్ స్టార్ట్, డ్రమ్ బ్రేక్ కలిగిన బైకు ధరను రూ.67,300గాను, సెల్ఫ్ స్టార్ట్, డిస్క్ బ్రేక్ మోడల్‌ను రూ.70,800కి విక్రయించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో బీఎస్-4 బైకుల ఉత్పత్తిని నిలిపివేసిన సంస్థ..ఇక నుంచి ప్రతి మోడల్ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపింది. ఇది వరకే స్ప్లెండర్ ఐస్మార్ట్, స్ప్లెండర్ +, హెచ్‌ఎఫ్ డీలక్స్, ప్లెజర్ + 110, డెస్టిని 125లను విడుదల చేసింది.



## ఒక చార్జింగ్‌తో 250 కిలోమీటర్లు

**మరో** విద్యుత్ కారును ప్రవేశపెట్టింది రెనో. పూర్తిస్థాయి బ్యాటరీ చార్జింగ్‌తో 250 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ట్వింగో జేడ్‌ఈ కారును అంతర్జాతీయ విపణిలోకి అందుబాటులోకి తీసుకొచ్చింది సంస్థ. కేవలం నాలుగు సెకండ్లలో సున్న నుంచి 50 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 135 కిలోమీటర్ల దూరం ప్రయాణించనున్నది.

## కారుపై వేలిముద్రకు రూ.5.8 లక్షలు



**మీ చేతి** వేలి ముద్రలు మీ కారుపై చూసుకోవాలనుకుంటున్నారా! అయితే విలాసవంతమైన స్పోర్ట్ కార్ల తయారీ సంస్థ పోర్షేకు చెందిన 911ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ కారును కొనుగోలు చేయాలనుకున్న కస్టమర్ చేతి వేలి ముద్రలతో పోలిన చిత్రాలను ఈ కారుపై డీజైన్ చేసి ఇవ్వనున్నది. ఇందుకోసం 7,500 యూరోల చార్జీ చేయనున్నది. మన కరెన్సీలో ఇది రూ.5.8 లక్షలు.




## 6.6 సెకండ్లలో 100 కి.మీ వేగం

### మార్కెట్లోకి స్కోడా ఒక్టావియా ఆర్‌ఎస్ 245

ధర రూ.35.99 లక్షలు

**దేశీయ** మార్కెట్లోకి లిమిటెడ్ ఎడిషన్‌గా ఒక్టావియా ఆర్‌ఎస్ 245 మోడల్ కారును ప్రవేశపెట్టింది స్కోడా ఇండియా. మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించిన ఈ కారు ధరను రూ.35.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధర ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 200 యూనిట్లు మాత్రమే విక్రయించనున్న ఈ కారుకోసం ముందస్తుగా లక్ష రూపాయలు చెల్లించి, www.buyskodaonline.co.in ద్వారా బుకింగ్ చేసుకోవచ్చునని కంపెనీ వర్గాలు సూచించాయి. 2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు కేవలం 6.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. అలాగే గంటకు 250 కిలోమీటర్ల దూరం ప్రయాణించనున్నది.



సింగరేణి ఉన్నతాధికారులతో రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

## మైనింగ్ వర్సిటీకి సిద్ధం!

**సాంకేతిక సేవలతో పరిశ్రమలు స్థాపించండి**

**ఆస్ట్రేలియా- ఇండియా బిజినెస్ ఎక్స్ఛేంజ్ సదస్సులో జయేశ్‌రంజన్ పిలుపు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

సాంకేతిక సేవలతో తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకురావాలని, మైనింగ్ విద్యలో అత్యుత్తమ యూనివర్సిటీ స్థాపనకు తాము అవకాశం కల్పించనున్నామని ఐటీ శాఖ ముఖ్య కారదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆస్ట్రేలియా- ఇండియా బిజినెస్ ఎక్స్ఛేంజ్ సదస్సులో సింగరేణి, ఎన్‌ఎండీసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గనులు, ఖనిజాలశాఖల అధికారులతోపాటు ఆస్ట్రేలియాకు చెందిన 11 ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. సింగరేణి వంటి బొగ్గు ఉత్పత్తి సంస్థతోపాటు సిమెంట్, గ్రానైట్, ఇసుక తయారీ విభాగాల్లో ఆధునిక సాంకేతికత ఎంతో అవసరమని, సంబంధిత యంత్రాలు, వస్తువులు ఆస్ట్రేలియా నుంచి ఇక్కడికి ఎగుమతిచేయడం కన్నా, ఇక్కడే పరిశ్రమలు స్థాపించుకొని వ్యాపారం నిర్వహించుకోవాలని ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటు విభాగంలో దేశంలోనే తెలంగాణ ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్నదని, త్వరలోనే అగ్రస్థానానికి చేరుకొంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. టీఎస్‌ఐపాస్ వల్ల ఇప్పటికే అనేక అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాయని, ఆస్ట్రేలియా కంపెనీలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### 85 మిలియన్ టన్నుల బొగ్గు: చంద్రశేఖర్

దేశ, రాష్ట్ర ఇంధన అవసరాల రీత్యా 2025 నాటికి 85 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నదని సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. ఇందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సహకారాన్ని అందిపుచ్చుకోనున్నట్టు తెలిపారు. 2006లో ఆస్ట్రేలియాకు చెందిన సిస్రో సంస్థతో బొగ్గు గనుల్లో వివిధసాంకేతిక అధ్యయనాలపై ఒప్పందం కుదుర్చుకొన్నామని, దీంతోపాటు రక్షణ, ఉద్యోగులకు పలు అంశాలపై శిక్షణ ఇప్పిస్తున్నామని వివరించారు. భూగర్భ, ఉపరితల గనుల్లో వివిధరకాల యంత్రాలు, టెక్నాలజీని ఆస్ట్రేలియానుంచి కొనుగోలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జీఎంలు రవిశంకర్, పీ సత్తయ్య, అడ్వయిజర్ మైనింగ్ డీఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# భారత్‌కు కరోనా దెబ్బ

## వైరస్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం కష్టం: డీఅండ్‌బీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** నిన్న మూడీస్.. నేడు డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్. భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావంపట్ల వరుస హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థిక మందగమనంలో నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న భారత్‌కు.. కరోనా వైరస్‌తో మరిన్ని కష్టాలేనని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీఅండ్‌బీ) గురువారం అభిప్రాయపడింది. కరోనా కారణంగా చైనా నుంచి ముడి సరుకు, విడి భాగాల సరఫరాల్లో అంతరాయం, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు ఏర్పడవచ్చని తమ ఆర్థిక సలహాదారు నివేదికలో అంచనా వేసింది. ఈ ప్రాణాంతక వైరస్ అదుపులోకి రాకపోతే దేశీయ ఉత్పాదక రంగమే కుంటుపడే అవకాశాలున్నాయని హెచ్చరించింది. 'కరోనా వైరస్ వ్యాప్తి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యాపార-వాణిజ్య పరిస్థితులు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతింటున్నది. భారతీయ సంస్థలను ఈ పరిణామం తీవ్రంగానే ప్రభావితం చేయవచ్చు' అని డీఅండ్‌బీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త అరుణ్ సింగ్ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఈ సమయంలో కరోనా వైరస్ విజృంభణ.. భారత ఎకానమీకి ఇబ్బందేనని వ్యాఖ్యానించారు. కరోనా వైరస్.. మహమ్మారిగా ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కష్టాలేనని మూడీస్ బుధవారం హెచ్చరించిన విషయం తెలిసిందే. భారత్‌పైనా దీని ప్రభావం తీవ్రంగా ఉండొచ్చని అంచనా వేసింది. గత నెల 30న కరోనా వైరస్ వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఇప్పటిదాకా చైనాలో ఈ వైరస్ బాధిత మరణాల సంఖ్య 2,744గా ఉన్నట్లు ఆ దేశ ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. మొత్తం కేసుల సంఖ్య దాదాపు 78,500లకు పెరుగగా, మళ్లీ ఈ వైరస్ విజృంభిస్తున్నదని చైనా చెబుతుండటం ప్రపంచాన్నే కలవరపెడుతున్నది. కరోనా దెబ్బకు మొబైల్, టెలివిజన్, ఆటో రంగాలకు చైనా నుంచి ముడి సరుకు సరఫరా నిలిచిపోగా, దేశీయ కంపెనీలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. చైనా పరిశ్రమలన్నీ మూతబడటంతో ఉత్పత్తి దాదాపుగా నిలిచిపోయింది. కాగా, ఈ జనవరిలోనూ పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 0.1-0.5 శాతంగానే ఉండొచ్చని ఈ సందర్భంగా డీఅండ్‌బీ అంచనా. డిసెంబర్ ఐఐపీ -0.3 శాతంగా నమోదైనది తెలిసిందే.



### ఇలాగే ఉంటే ఇబ్బందే

దేశ ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమపై కరోనా వైరస్ ప్రభావం ఇప్పటికైతే లేదు. మరో రెండు నెలలు పరిస్థితులు మెరుగుపడకపోతే మాత్రం ఇబ్బందే. ముడి సరుకు కొరతకు వీలుండొచ్చు. పరిశ్రమ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. త్వరలోనే అంతా సర్దుకోవచ్చు. నేనిప్పటి వరకు 20-23 మంది పారిశ్రామికవేత్తలను కలిసి కరోనా ప్రభావంపై ఆరా తీశాను. వారిలో నాకెలాంటి ఆందోళన కనిపించలేదు.

**- నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి**



### రూ.18 లక్షల కోట్ల నష్టం

కరోనా వైరస్ కారణంగా ప్రపంచ జీడీపీకి దాదాపు రూ.18 లక్షల కోట్ల నష్టం వాటిల్లవచ్చని పరిశ్రమ సంఘం పీహెచ్‌డీసీసీఐ అంచనా వేసింది. సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అంతరాయం.. కేవలం చైనా ఎగుమతుల్నే గాక, దిగుమతి దేశాల ప్రయోజనాలనూ దెబ్బతీస్తున్నదని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు డీకే అగర్వాల్ అన్నారు. దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యం పెరుగాలని, ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి తగ్గితే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభావితం కాకుండా ఉండవచ్చని పరిశ్రమకు సూచించారు.

### 4 శాతం తగ్గిన ఇంధన ధరలు

ఇంధన ధరలు క్రమంగా శాంతిస్తున్నాయి. కరోనా వైరస్ దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు గురువారం నాలుగు శాతం మేర తగ్గాయి. ఈ వైరస్ మరిన్ని దేశాలకు పాకుతున్నట్లు వచ్చిన భయాలతో గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్‌కు డిమాండ్ పడిపోయింది. ఏప్రిల్ నెల డెలివరీకిగాను బ్యారెల్ ఇంధన ధర 4.2 శాతం తగ్గి 51.20 డాలర్ల వద్ద నిలిచింది. వరుసగా ఐదు రోజులుగా తగ్గుముఖం పట్టడంతో క్రూడ్ ధర 52 వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ వైరస్‌తో చైనాలో మరణించేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, మరోవైపు దక్షిణ కొరియా, ఇటలీ. ఇరాన్, కెనడా, అమెరికాకు కూడా పాకుతుండటం కూడా గ్లోబల్ మార్కెట్లపై భయాలు చుట్టుముట్టాయి.

## ఐదోరోజు అదే తీరు..

**సెన్సెక్స్ 143, నిఫ్టీ 45 పాయింట్ల పతనం**

**కరోనా** భయాలు స్టాక్ మార్కెట్లను వీడటం లేదు. వరుసగా ఐదోరోజు దేశీయ ఈక్విటీ మార్కెట్లు కుదేలయ్యాయి. బ్యాంకింగ్, ఐటీ, ఇంధన రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికాగా, అలాగే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచింది. ఫలితంగా నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ఒక దశలో 500 పాయింట్ల వరకు కోల్పోయాయి. చివరకు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 143.30 పాయింట్లు పతనం చెంది 39,745.66 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 45.20 పాయింట్లు పడిపోయి 11,633.30 వద్ద స్థిరపడింది. వరుసగా ఐదు రోజుల్లో సెన్సెక్స్ 1,577.34 పాయింట్లు, నిఫ్టీ 492.60 పాయింట్లు పతనం చెందాయి. ఓఎన్‌జీసీ 2.61 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫిన్ షేర్లు ఒక్క శాతానికి పైగా పడిపోయాయి. వీటితోపాటు టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, అల్ట్రాసిమెంట్, ఐటీసీ, రిలయన్స్, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, సన్‌ఫార్మా 3.68 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. టైటాన్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్‌లు లాభపడ్డాయి.

# ఒక్క జీబీ డేటా రూ.35!

- నెలసరి కనీస కనెక్షన్ చార్జీ రూ.50
- ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలి
- పరిశ్రమ బతకాలన్నా.. ఏజీఆర్ బకాయిలు తీరాలన్నా తప్పదు
- వొడాఫోన్ ఐడియా డిమాండ్
- డీవోటీ, ట్రాయ్‌లకు లేఖ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఒక్క జీబీ (గిగాబైట్) మొబైల్ డేటా కనీస ధరను రూ.35గా నిర్ణయించాలని వొడాఫోన్ ఐడియా డిమాండ్ చేసింది. ప్రస్తుత ధరలతో పోల్చితే ఇది దాదాపు 7-8 రెట్లు అధికం కావడం గమనార్హం. ఒక జీబీ డేటా రూ.4-5కే లభిస్తున్నదిప్పుడు. అలాగే నెలసరి కనీస కనెక్షన్ చార్జీని రూ.50, ఔట్‌గోయింగ్ కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు వసూలు చేయాలన్నది. టెలికం శాఖ (డీవోటీ), టెలికం రెగ్యులేటర్ ట్రాయ్‌కు రాసిన ఓ లేఖలో ఈ మేరకు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ ప్రతిపాదించింది. నిజానికి కాల్స్, ఇంటర్నెట్ ధరలు 50 శాతం వరకు పెరిగి మూడు నెలలైనా కావడం లేదు. కాగా, మొబైల్ డేటా, కాల్స్ ధరలు పెరిగితేనే టెలికం పరిశ్రమ బాగుంటుందన్న వొడాఫోన్ ఐడియా.. అప్పుడే తాము ఏజీఆర్ బకాయిలనూ చెల్లించగలుగుతామని స్పష్టం చేసింది. ఏప్రిల్ 1 నుంచి ధరలను పెంచాలని సూచించింది. పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియా.. సుప్రీం కోర్టు ఆదేశంతో టెలికం శాఖకు రూ.53,038 కోట్ల ఏజీఆర్ బకాయిలను చెల్లించాల్సి వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటిదాకా కేవలం రూ.3,500 కోట్లనే ఇచ్చిన సంస్థ.. మిగతా నిధుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సాయం లేకపోతే బాకీలను కట్టలేమన్న సంకేతాలను ఇస్తున్నది.

### మావల్ల కాదు.. 18 ఏండ్ల సమయమివ్వండి

ఏజీఆర్ బకాయిలను ఇప్పట్లో తీర్చలేమని, బాకీలు చెల్లించడానికి 18 ఏండ్ల సమయం కావాలని వొడాఫోన్ ఐడియా ఈ సందర్భంగా కోరింది. వడ్డీ, జరిమానాలపై మూడేండ్ల మారటోరియంనూ డిమాండ్ చేసినట్లు పీటీఐకి సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. రూ.8 వేల కోట్ల జీఎస్టీ బకాయిలు ఇవ్వాలని కేంద్రాన్ని సంస్థ కోరిందని, వడ్డీరేటును 6 శాతంగానే నిర్ణయించాలని డిమాండ్ చేసిందని చెప్పారు. లైసెన్స్ ఫీజును భారీగా తగ్గించాలనీ, కాల్స్, డేటీ కనీస ధరలను పెంచాలన్నట్లు వివరించారు. తమకు 30 కోట్ల కస్టమర్లున్నారని, సంస్థలో 10 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, సంస్థను బతికించే నిర్ణయాన్ని తీసుకోవాలని విన్నవించినట్లు సదరు అధికారి వెల్లడించారు. మరోవైపు దీనిపై స్పందించేందుకు వొడాఫోన్ ఐడియా అధికార ప్రతినిధి నిరాకరించారు. ఇదిలావుంటే వొడాఫోన్ ఐడియా ప్రతిపాదనలకు భారతీయ సెల్యులార్ ఆపరేటర్ల సంఘం మద్దతు తెలిపింది. టెలికం పరిశ్రమను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ సమావేశమవుతున్నట్లు సమాచారం.

### చోక్సీ, మరొకరిపై రూ.5 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ:** మెహుల్ చోక్సీ, మరొకరిపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గురువారం రూ.5 కోట్ల జరిమానా విధించింది. గీతాంజలి జెమ్స్ వ్యవస్థాపక ఎండీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.14 వేల కోట్ల కుంభకోణం ప్రధాన నిందితుల్లో ఒకరే చోక్సీనన్న విషయం తెలిసిందే. చోక్సీతోపాటు గీతాంజలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనేశ్ సేథ్‌లపై స్టాక్ మార్కెట్ నిబంధనల ఉలంఘనకుగాను ఈ జరిమానా పడింది. పీఎన్‌బీ మోసం ప్రధాన నిందితుడు నీరవ్ మోదీకి మేనమామైన చోక్సీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ మామా-అల్లుళ్లు 2018 ఆరంభంలోనే విదేశాలకు పారిపోగా, లండన్‌లో చిక్కిన నీరవ్ జైల్లో ఉండగా.. చోక్సీ మాత్రం ఆంటిగ్వాలో తలదాచుకున్నాడు.




# వదంతులు నమ్మొద్దు

**చికెన్, గుడ్లు తింటే కరోనా వైరస్ వ్యాపించదు: పౌల్ట్రీ పరిశ్రమ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చికెన్, గుడ్లు తింటే కరోనా వైరస్ ఏమీ రాదని, అలాంటి వదంతులు నమ్మవద్దని వినియోగదారులకు పౌల్ట్రీ పరిశ్రమ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఇండస్ట్రీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో 'చికెన్, ఎగ్‌మేళా' చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ వి లక్ష్మారెడ్డి, నటి రష్మిక తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. నగరంలోని ఎర్రమంజిల్ ఎన్‌కేఎం హోటల్‌లో ఆల్ ఇండియా పౌల్ట్రీ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పౌల్ట్రీ సమాఖ్య, నెక్, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డి రాంరెడ్డి, కేజీ ఆనంద్, డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దని, చికెన్, గుడ్లను నిర్భయంగా తినవచ్చున్నారు. కరోనా (కోవిడ్-19) వైరస్‌కు చికెన్, గుడ్లకు ఏ విధమైన సంబంధం లేదని, ఎంతో సురక్షితమైన, బలవర్ధకమైన, మెరుగైన ఆహారమని డాక్టర్లు, పౌల్ట్రీ శాస్త్రవేత్తలు, పౌష్టికాహార నిపుణులు ధృవీకరించినట్లు గుర్తుచేశారు. ఇక ఇటీవల ఖమ్మం, వరంగల్‌లో కోళ్లు చనిపోవడానికి వాతావరణ మార్పులే కారణమని, సహజంగా చలికాలం ముగిసి ఒకేసారి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు ఇలా జరుగడం మామూలేనని చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పౌల్ట్రీ ప్రతినిధులు

### నేడు చికెన్, ఎగ్ మేళా

చికెన్, ఎగ్ మేళాకు తరలివచ్చే సందర్శకులకు ఉచితంగా స్నాక్స్ పంపిణీ చేయడం ద్వారా చికెన్, గుడ్డు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని భరోసా కల్పించడమే ఈ ప్రదర్శన ముఖ్య లక్ష్యమని పౌల్ట్రీ ప్రతినిధులు స్పష్టం చేశారు. 10 నుంచి 12 వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేసి 6 టన్నుల చికెన్, గుడ్లు సిద్ధం చేశామని చెప్పారు. కాగా, కరోనా భయాల నేపథ్యంలో తెలంగాణలో గత నెల రూ.300 కోట్ల అమ్మకాలు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.400 కోట్ల అమ్మకాలు పడిపోయాయి.

### చికెన్ విక్రయాలు ఢమాల్

**కరోనా** వైరస్ ప్రభావంతో దేశవ్యాప్తంగా గడిచిన నెల రోజుల్లో చికెన్ విక్రయాలు 50 శాతం మేర పడిపోయాయి. అలాగే ధరలు 70 శాతం దిగజారినట్లు గోద్రేజ్ అగ్రోవెల్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. చికెన్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియా వదంతులు రావడంతో డిమాండ్ పడిపోవడంతోపాటు ధరలు భారీగా తగ్గాయన్నారు. ఈ పుకార్లతో వచ్చే రెండు నుంచి మూడు నెలల వరకు చికెన్, కోడిగుడ్ల వినిమయం మరింత పడిపోనున్నదన్న ఆయన..దేశీయంగా కొరత ఏర్పడితే మాత్రం వీటి ధరలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గతంలో దేశవ్యాప్తంగా 75 మిలియన్ల బర్డ్స్ అమ్ముడవుతుండగా, ప్రస్తుతం 35 మిలియన్లకు పడిపోగా, ఫామ్ గేట్ వద్ద ధర రూ.100 నుంచి 70 శాతం తగ్గి రూ.35కి పరిమితమయ్యాయి. వాట్సప్‌లో వచ్చిన పుకార్లతో ఇండస్ట్రీతోపాటు రైతులపై ప్రభావం పడనున్నది.

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
జిందగీ
శుక్రవారం 28 ఫిబ్రవరి 2020
/nt.zindagi

దుస్తుల్లో ఎన్ని రకాల వెస్ట్రన్ వెరైటీలు వచ్చినా మన స్టయిల్ మనదే. పరికిణీ అంటే పదహారణాల తెలుగుదనానికి ప్రతీక. రోజువారీగా జీన్స్‌లు, చుడీదార్‌లు వేసినా.. పండుగొచ్చిందటే మన కట్టు.. మన బొట్టే.. హైలెట్టు. పండగ నాడే కాదు.. అకేషన్ ఏదైనా పరికిణీ కట్టేయండి. అందుకే ఈ వారం కొన్ని బెనారస్ పరికిణీలు మీకోసం.

# పరికించి చూడు.. పరికిణీ అందం!



చిలుకపచ్చ రంగు బెనారస్ పట్టు లంగా ఇది. దీనిమీద మొత్తం చిలుకల గోల్డెన్ వీవింగ్ చూడముచ్చటగా కనిపిస్తున్నది. ఎర్రని కంచి పట్టు డబుల్ బార్డర్ సూపర్‌గా మ్యాచ్ అయింది. ఎర్రని బెనారస్ బ్లౌజ్‌కి కింద ఆకుపచ్చని రాసిల్క్ మెటీరియల్‌ని అటాచ్ చేశాం. దీని మీద జర్దోసీ, కుందున్స్‌తో నింపేశాం. నెక్‌లైన్ దగ్గర థ్రెడ్, జర్దోసీ లైన్ ఇచ్చాం. ఎర్రని నెట్ దుపట్టాకి జర్దోసీతో కట్‌వర్క్ బార్డర్ అదనపు ఆకర్షణగా నిలుస్తున్నది.

గోల్డెన్ సెల్ఫ్ వీవింగ్ వచ్చిన బెనారస్ పట్టు లంగా సూపర్‌గా మెరిసిపోతున్నది. దీనికి బెనారస్ డబుల్ బార్డర్ ఇచ్చాం. బార్డర్ పైన ఆకుపచ్చని రాసిల్క్ మీద కుందన్స్‌తో బుటీస్ ఇచ్చాం. ఆకుపచ్చని రాసిల్క్ మీద జర్దోసీ, కుందన్స్‌తో వర్క్ చేశాం. ఎర్రని బెనారస్ స్లీవ్స్, దాని చివరన ఆకుపచ్చని రాసిల్క్ అటాచ్ చేశాం. దీనిమీద జర్దోసీ, కుందన్స్‌తో హెవీ వర్క్ చేశాం.

ఆకుపచ్చని బెనారస్ పట్టు లంగాకి సిల్వర్ జరీతో చెక్స్ ప్యాటర్న్ వచ్చింది. కింద బార్డర్ మీద నెమళ్ల డిజైన్ వీవింగ్ వచ్చింది. దీనికి ఎర్రని బెనారస్ పెద్ద బార్డర్‌ని అటాచ్ చేశాం. ఎర్రని రాసిల్క్ బ్లౌజ్ షోల్డర్ మీద జర్దోసీ, కుందన్స్, థ్రెడ్ వర్క్‌తో పెద్ద బంచ్ కుట్టాం. 3/4 బెనారస్ స్లీవ్స్ అదనపు ఆకర్షణగా నిలిచింది. ఎర్రని జార్జెట్ దుపట్టాకి ముత్యాలు, గోల్డెన్ జరీ బార్డర్ కరెక్ట్‌గా మ్యాచ్ అయింది.

గ్రాండ్‌గా కనిపించాలంటే ఈ పరికిణీ కట్టాల్సిందే! ఎర్రని నెమలి, ఏనుగు సెల్ఫ్ వీవింగ్ వచ్చిన బెనారస్ లెహంగా ఇది. దీనికి ఫుల్ జరీ వచ్చిన బార్డర్‌ని జత చేశాం. మధ్యలో ఎర్రని రాసిల్క్ మీద మిర్రర్ వర్క్ చేశాం. ఎర్రని రాసిల్క్ బ్లౌజ్ నెక్‌లైన్ మీద కూడా ముత్యాలు, అద్దాలతో హెవీగా వర్క్ చేశాం. బెనారస్ స్లీవ్స్‌కి చివరన కూడా ఇదే వర్క్ ఇచ్చాం. ఎర్రని జార్జెట్ దుపట్టా బార్డర్‌గా కూడా ముత్యాలు, అద్దాలతో హెవీగా వర్క్ చేయడంతో మరింత సూపర్ లుక్ సొంతమైంది.

**మాధవి చేశెట్టి**
ఫ్యాషన్ డిజైనర్
ఫెదర్స్ డిజైనర్ స్టూడియో
నిజాంపేట్ ఎక్స్‌రోడ్, హైదరాబాద్
ఫోన్ : 7893966553, 9177963333
www.facebook.com/feathersbtq

## అందుకే అనన్యకు.. అరుదైన అవార్డు



**'ఆస్ట్రేలియా** నేషనల్ యూనివర్శిటీ' ప్రతి ఏడాది భారతీయులకు ఫ్యూచర్ రీసెర్చ్ టాలెంట్ అవార్డులను ఇస్తుంటుంది. ఈ ఏడాది ఈ అవార్డు అనన్యకు వచ్చింది. అనన్య హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ప్రోగ్రామ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నది. 2020 క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాకింగ్ ప్రకారం ఏఎన్‌యూ, ఆస్ట్రేలియాలో 1వ స్థానంలో ఉంది. ప్రపంచంలో 29వ స్థానంలో ఉంది. ఈ అవార్డుతో అనన్య 2020 మే-జూలైలో కాన్బెర్రాలోని 'జాన్ కర్టిన్ స్కూల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్'లో అండర్ గ్రాడ్యుయేట్ పరిశోధనా శిక్షణ పొందనున్నది. ఇంజినీరింగ్ మూడేండ్లలో అనన్య హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసింది. అనన్య తండ్రి పోలీస్ ఆఫీసర్. తల్లి కుటుంబ బాధ్యతలు తీసుకుంటుంది. అక్క కాలేజ్‌లో ప్రొఫెసర్‌గా చేసి మానేసింది. వీరు ఒడిసాలోని బెర్హంపూర్ నగరానికి చెందినవారు. ప్రస్తుతం కుటుంబం భువనేశ్వర్‌లో స్థిరపడింది. పోలీస్ ఆఫీసర్ అయిన తండ్రే అనన్యకు రోల్‌మోడల్. ఎప్పుడూ సమాజం కోసం పాటుపడుతుంటాడు. తాను కూడా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉద్యోగాన్ని ఎంచుకుంటానంటున్నది. హైదరాబాద్‌లో స్టడీస్ బాగుంటాయి. అందుకే ఇక్కడ కాలేజ్‌లో చేరింది. ఏడు సెమిస్టర్స్ పూర్తయ్యాయి. ఆ సమయంలోనే ఏఎన్‌యూ స్కాలర్‌షిప్ కోసం అప్లై చేసుకునే అవకాశం వచ్చింది. దీనికి చాలామంది ఆన్‌లైన్ ద్వారా అప్లై చేశారు. అందులో ఎఫ్ఆర్‌టి అవార్డు అనన్యకు అందడం అదృష్టంగా భావిస్తుంది. అయితే.. ఈ అవార్డును 6000 డాలర్లుగా అందజేస్తారు. అవార్డులు ఎంపిక చేసిన భారతీయ విద్యార్థులకు 10-12 వారాలపాటు శిక్షణ ఉంటుంది. సైన్స్, హెల్త్ అండ్ మెడిసిన్, ఇంజినీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల పరిశోధనల్లో పాల్గొనడానికి అవార్డు సొమ్మును ఉపయోగించుకోవచ్చు. అనన్య భవిష్యత్తులో మాస్టర్స్ చేసి పీహెచ్‌డీ చేయాలనుకుంటున్నది. ఇంకా బయాలజీలో రీసెర్చ్ చేయాలని ఎదురుచూస్తున్నది.

**ఇక్కడ చదువుకుంటున్న స్టూడెంట్స్‌కి ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్శిటీ నుంచి అవార్డు రావడం మామూలు విషయం కాదు. అది కూడా కొన్ని వారాలపాటు శిక్షణ. ఆ అదృష్టాన్ని దక్కించుకున్న అమ్మాయి ఏ ప్రాంతానికి చెందింది. అవార్డును ఎలా చేజిక్కుంచుకున్నదంటే..**

## ఆవిరి పట్టు.. జలుబు పోయేట్టు!



- నీటిని బాగా మరిగించి అందులో కాస్త కర్పూరం, పసుపు వేసి ఆవిరి పట్టాలి. శ్వాస బాగా ఆడుతుంది. విక్స్, ఝండూబామ్ కూడా వేసుకొని ఆవిరి పట్టొచ్చు. ఇవేమీ అందుబాటులో లేనప్పుడు బాగా మరిగించిన నీటిలో పసుపు వేసి ఇంకాస్త మరిగించి ఆవిరి పట్టుకోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు జలుబు తగ్గేవరకు ఆవిరి పట్టుకోవచ్చు.
- జలుబు చేసినప్పుడు చికాకు కలుగుతుంది. త్వరగా అలిసిపోయినట్లుగా అనిపిస్తుంటుంది. అందుకే ఈ సమయంలో ఎక్కువ విశ్రాంతి తీసుకుంటే మంచిది. వేడిపాలల్లో చిటికెడు పసుపు వేసి పిల్లలకు తాగిస్తే జలుబు నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది.
- అల్లం, మిరియాల చాయి తాగినా లేదా వేడి ద్రవపదార్థాలను తీసుకున్నా జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల జలుబు నుంచి ఉపశమనం పొందొచ్చు.
- జలుబు చేసినప్పుడు శుభ్రత ముఖ్యం. తుమ్మినా, దగ్గినా చేతిరుమాలును వాడాలి. చేతిరుమాలును ఎప్పటికప్పుడు ఉతకాలి.

## పొడి చర్మం వేధిస్తున్నదా?



**వేసవి ప్రారంభంలోనే చాలామందిని డీహైడ్రేషన్ సమస్య వేధిస్తుంది. ముఖ్యంగా అలాంటివారి చర్మం పగుళ్లు తేలినట్లుగా కనిపిస్తుంటుంది. ముఖం తెల్లగా పొడిబారినట్లు నిర్జీవంగా కనిపిస్తుంటుంది. అలాంటివారు ఈ చిట్కాలు పాటిస్తే చాలు.**

- పొడిచర్మం ఉన్నవారు బయటికి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ ముఖానికి అప్లై చేయాలి. నల్లద్రాక్ష గుజ్జుకి కొంచెం తేనె కలిపి ప్రతి రోజూ స్నానానికి 20 నిమిషాల ముందు ముఖానికి రాసుకుని ఆ తర్వాత స్నానం చేస్తే చర్మానికి కావాల్సిన తేమ అందుతుంది.
- కొంచెం క్యారెట్, కొంచెం క్యాబేజీ, కొంచెం ఓట్స్ కలిపి మిక్సీ పట్టుకోవాలి. దానిలో కొంచెం పాలమీగడ, అరటీస్పూన్ తేనె, రెండు చెంచాల నిమ్మరసం కలపాలి. ఆమిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి.
- శరీరంలో నీటి శాతం తగ్గితే చర్మం పొడిబారుతుంది. పెదవులు చిట్లిపోతాయి. నీటిని ఎక్కువగా తాగాలి. నీరు ఎక్కువగా తాగడం ఇష్టం ఉండని వారు నీటిశాతం ఎక్కువ ఉన్న పండ్లు తీసుకోవాలి.
- ముఖం, పెదవులు పగిలినట్లుగా అనిపిస్తుంటే కాస్తంత రోజ్‌వాటర్‌లో కొబ్బరి నూనె కలిపి ముఖంపై మర్దన చేయాలి. రోజూ రాత్రి నిద్రపోయే ముందు ముఖానికి రాసుకుంటే మంచిది. పెదాలకు కొబ్బరి నూనెతో మర్దన చేయడం వల్ల పెదాలు పగలకుండా ఉంటాయి. కొబ్బరి నూనె పెదాలకు రాసుకొని బ్రష్‌తో మెల్లిగా మర్దన చేసుకోవచ్చు.
- చర్మం పొడిబారడం, గోకితే పొట్టులేవడం వంటి సమస్యలతో బాధపడేవారు రోజూ రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు కొబ్బరి నూనెను శరీరానికి రాస్తే సరి. పొడిబారిన చర్మం నుంచి, దురద నుంచి ఉపశమనం పొందవచ్చు.

## అందుకోసం పేరుకూడా మార్చుకుంది!



**కళారంగంలో రాణించడానికి కులం, మతం అనేవి అడ్డుకాదని నిరూపించింది ఓ యువతి. ఆమె ప్రతిభ మత పెద్దల మనసును మార్చివేసింది. కట్టుబాటు గోడలను సైతం కూల్చివేసింది. రెండు శతాబ్దాల కళకు జీవం పోస్తున్న తొలి ముస్లిం యువతి ఆమె.**

**కర్ణాటకలోని** మంగళూరుకు చెందిన అర్షియా అనే యువతి యక్షగాన ప్రదర్శనలో తనదైన శైలిలో రాణిస్తున్నది. యక్షగాన కళకు రెండు వందల ఏండ్ల చరిత్ర ఉన్నది. అటువంటి కళారంగంలోఅడుగుపెట్టిన తొలి ముస్లిం మహిళగా ఆమె ఘనత సాధించింది. కర్ణాటకకు చెందిన ఈ కళ గురించి పురాణాల్లోనూ ప్రస్థావన ఉన్నదట. చిన్నప్పటి నుంచి ఈ కళపై ఆసక్తి పెంచుకున్నది అర్షియా. ఆమె పదో తరగతి చదివే సమయంలో ఉపాధ్యాయురాలు యక్షగాన ప్రదర్శనవైపు మళ్లించింది. అందుకోసం అవసరమైన ప్రోత్సాహాన్ని ఇచ్చింది. మంగళూరులోని కదలి కళాకేంద్రంలో యక్షగాన కళాకారుడు రమేష్‌భట్ వద్ద మెళకువలు నేర్చుకున్నది అర్షియా. ఆమె ఆసక్తిని గ్రహించిన మత పెద్దలు సైతం అర్షియాను ప్రోత్సహించారు. యక్షగాన ప్రదర్శనలో నైపుణ్యత సాధించిన ఆమె నిశంభాసుర, రక్తబీజాసుర, మహిషాసుర వంటి పాత్రలతో అలరిస్తున్నది. యక్షగాన కళాకారిణిగా రాణించేందుకు అర్షియా తన పేరును 'తనువిట్ల'గా మార్చుకున్నది. 'సంగీతం, నృత్యం, సంభాషణలు, మేకప్, కాస్ట్యూమ్స్ వంటి అంశాలన్నీ కలిసి ఉన్న యక్షగాన ప్రదర్శన పట్ల పాఠశాలలో చదువుకునే సమయంలో నేను ఆకర్షితురాలినయ్యాను' . తనువిట్ల పదేండ్ల వయసున్నప్పుడే తొలిసారిగా పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ప్రదర్శన ఇచ్చింది. ఆ సమయంలో ఆమె ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయురాలు అర్షియాకు అవసరమైన శిక్షణ ఇచ్చింది. ఎంతో కష్టతరమైన పాత్రలకు సైతం తనువిట్ల జీవం పోస్తున్నది. శ్రీనివాసకళ్యాణం, సుదర్శనోపాఖ్యానం, శాంభవి పాత్రలను పోషించి అందరి ప్రశంసలూ అందుకున్నది. టయోటా షోరూమ్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న 'తనువిట్ల' యక్షగానప్రదర్శనలో ఎంతో ముఖ్యమైన అంశం 'చెండే'(పెర్కషన్ వాయిద్యం)' నేర్చుకుంటున్నది.




విష్వక్‌సేన్, రుహానీశర్మ, నాని, శైలేష్, ప్రశాంతి

# సూపర్‘హిట్’ అనిపించింది

‘కొన్నేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే వాల్‌పోస్టర్ సంస్థ మంచి కంటెంట్, ప్రతిభకు బ్రాండ్‌గా నిలవాలన్నదే మా అభిలాష. తెలుగు సినిమా ప్రగతిలో కొంతైనా మేము భాగమవ్వాలనే ఆలోచనతో ఈ నిర్మాణ సంస్థను ప్రారంభించాం’ అని అన్నారు హీరో నాని. ఆయన సమర్పణలో రూపొందిన చిత్రం ‘హిట్’. విష్వక్‌సేన్, రుహానీ శర్మ జంటగా నటించారు. శైలేష్ కొలను దర్శకుడు. ప్రశాంతి తిపిరినేని నిర్మాత. నేడు ఈ చిత్రం విడుదలకానుంది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో నాని మాట్లాడుతూ ‘నిర్మాతగా ‘అ!’ సినిమాతో తొలి ప్రయత్నంలో రెండు జాతీయ అవార్డులు అందుకున్నాం. ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచబోతున్నాం. అరుదైన జోనర్‌లో రూపొందిన చిత్రమిది. ఓవర్‌కాన్ఫిడెన్స్‌తో ‘హిట్’ అనే టైటిల్ పెట్టామని తొలుత భయపడ్డాను. సినిమా చూసిన తర్వాత ఆ భయాలన్నీ తొలగిపోయాయి ‘సూపర్‌హిట్’ అని పేరు పెడితే బాగుండేదనిపించింది. సాధారణంగా విడుదల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రేక్షకులకు సినిమా నచ్చుతుందా లేదా అనే టెన్షన్ ఉంటుంది. ఈ సినిమాకు ఆ టెన్షన్ లేదు. ప్రేక్షకుల్ని ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందోనని ఎదురుచూస్తున్నాం. ప్రామిస్ అనే పదాన్ని నేను అరుదుగా వాడుతుంటాను. థియేటర్‌కు వచ్చిన వారందరూ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారని ప్రామిస్ చేస్తున్నాను’ అని తెలిపారు. నిజాయితీతో కూడిన థ్రిల్లర్ సినిమా ఇదని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించామని దర్శకుడు అన్నారు. తొలి సినిమాకు పూర్తి భిన్నమైన పాత్రను ఈ సినిమాలో పోషించానని రుహానీశర్మ చెప్పింది. ‘సినిమా విడుదల దగ్గరపడుతున్న కొద్దీ మాటలు రావడం లేదు. ముఖాలపై ఉన్న నవ్వు సినిమా పట్ల మాలో ఉన్న నమ్మకాన్ని చాటిచెబుతున్నది’ అని విష్వక్‌సేన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి తిపిరినేని పాల్గొన్నారు.


కృతి గార్గ్

# ‘రాహు’పై పోరాటం

అభినయానికి ఆస్కారమున్న పాత్రలతో మంచి నటిగా పేరుతెచ్చుకోవాలన్నదే తన అభిమతమని చెప్పింది కృతిగార్గ్. ఆమె కథానాయికగా నటించిన చిత్రం ‘రాహు’. సుబ్బు వేదుల దర్శకుడు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. గురువారం హైదరాబాద్‌లో కృతిగార్గ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ ‘మహిళా ప్రధాన చిత్రమిది. నా పాత్ర నేపథ్యంలో కథ మొత్తం సాగుతుంది. చిన్నతనంలోనే తల్లికి దూరమై హిస్టారికల్ బ్లైండ్‌నెస్ సమస్యతో బాధపడే భాను అనే యువతిగా నా పాత్ర విభిన్నంగా ఉంటుంది. అనుకోకుండా ఓ నేరస్తుడి కారణంగా ఆమె జీవితం ప్రమాదంలో పడుతుంది. అంతర్గతంగా తనలో ఉన్న సమస్యను అధిగమిస్తూ రాహు లాంటి శత్రువుతో భాను ఎలాంటి పోరాటం చేసిందన్నది ఆసక్తిని పంచుతుంది. భావోద్వేగాలతో పాటు యాక్షన్‌కు ప్రాధాన్యముంటూ నా పాత్ర ఛాలెంజింగ్‌గా ఉంటుంది. జైపూర్ నా స్వస్థలం. సినిమాలపై చిన్నతనంలోనే ఇష్టం మొదలైంది. హిందీలో కొన్ని వెబ్‌సిరీస్‌లు చేశాను. తెలుగులో ‘2అవర్స్ లవ్’లో హీరోయిన్‌గా నటించాను. ఇది నా రెండో సినిమా. అందంగా ఉన్న వారు ఎవరైనా గ్లామర్ పాత్రలు చేయగలరు.అందుకు భిన్నంగా మంచి నటిగా గుర్తింపును తెచ్చుకోవాలనుంది. అలాగని గ్లామర్ పాత్రలకు వ్యతిరేకం కాదు. ఈ సినిమాలో అందం, అభినయం సమ్మిళితంగా నా క్యారెక్టర్ ఉంటుంది’ అని తెలిపింది.

# స్ఫూర్తిమంతంగా ఉండాలి


దుల్కర్ సల్మాన్

‘మంచి కథలు, దర్శకులతో పనిచేసే అవకాశం దొరుకుతుంది కాబట్టే నాలుగు భాషల్లో సినిమాలు చేస్తున్నాను ఇందులో ఎలాంటి క్యాలికులేషన్స్, వ్యూహాలు లేవు. ఎక్కడైనా ఓ మంచి సినిమా చేయడానికే నేను ప్రాధాన్యతనిస్తాను’ అని అన్నారు దుల్కర్ సల్మాన్. ‘ఒకే బంగారం’, ‘మహానటి’ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం ‘కనులు కనులను దోచాయంటే’ నేడు విడుదలకానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో దుల్కర్ సల్మాన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

రొమాంటిక్ కామెడీతో ఫాస్ట్ ఫేజ్‌లో సాగే థ్రిల్లర్ సినిమా ఇది. నటుడిగా తెలుగులో నన్ను కొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. బాలీవుడ్‌లో అబ్బాస్ మస్తాన్ సినిమాల మాదిరిగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. తెలుగు, తమిళ సెన్సిబిలిటీస్‌కు దగ్గరగా ఉన్న కథ కావడంతో రెండు భాషల్లో విడుదలచేస్తున్నాం. దర్శకుడు గౌతమ్‌మీనన్ ఈ సినిమాలో ఓ కీలక పాత్రను పోషించారు. ఆయన పాత్ర స్టైలిష్‌గా ఉంటుంది.

**రీమేక్‌లు చేయను..**

నాన్న మమ్ముట్టితో పాటు మలయాళంలోని ఇతర నటులంతా ఏడాదికి ఐదారు సినిమాలు చేస్తున్నారు. సినిమాల ఎంపికలో నేను సెలెక్టివ్‌గా ఉండటం వల్ల మూడు చిత్రాలకు మించి నటించలేకపోతున్నాను.నా మనసుకు నచ్చిన కంఫర్టబుల్‌గా అనిపించిన చిత్రాలే చేస్తాను. ఎంచుకున్న కథలు స్ఫూర్తిమంతంగా ఉండాలని కోరుకుంటాను. రీమేక్‌లు, సీక్వెల్స్‌లకు నేను దూరంగా ఉంటాను. సినిమా చూస్తున్నప్పుడు ఇంతకుముందు స్క్రీన్‌పై ఎప్పుడూ చూడని కొత్త అనుభూతి కలగాలి. తెలుగులో ఓ పెద్ద సినిమాలో నటించబోతున్నాను. ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదలకాబోతున్నది.












నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 28 ఫిబ్రవరి 2020

సూర్యుని అత్యంత అరుదైన 'మండే ప్లాస్మా' దృశ్యాలను తొలిసారిగా శాస్త్రవేత్తలు చిత్రీకరించారు. విస్తృత సౌర పరిశోధనలలో ఇవి ఎంతగానో ఉపయోగపడగలవని వారు భావిస్తున్నారు.

విశ్వశోధన

## సూర్యాగ్ని బుడగల తొలిచిత్రాలు



**చూడటానికి** 'బెల్లం చిక్కీ'లా కనిపిస్తున్న ఈ చిత్రం సూర్యునిలోని భగభగమండే ప్లాస్మాకు చెందిన అతిసూక్ష్మ ప్రదేశమంటే మనకు నమ్మకం కలగదేమో. అమెరికాకు చెందిన మాయి (Maui) ద్వీపంలో నిర్మాణంలో ఉన్న, ప్రపంచ అతిపెద్ద సౌర టెలిస్కోప్ 'డానియల్ కే ఇన్యుయే సోలార్ టెలిస్కోప్' సహాయంతో శాస్త్రవేత్తలు ఇటీవల సూర్యుని ఉపరితలం మీది ఈ దృశ్యాలను చిత్రీకరించగలిగారు. తొలిసారిగా పొందిన, ఈ అరుదైన చిత్రాలు అక్కడ లోతుల్లోంచి పైకి ఎగజిమ్ముతున్న మరిగే ప్లాస్మా తీరును వెల్లడిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. సూర్యగోళం మీది సుమారు 30 కి.మీ. పరిధిలోని ఉపరితల ప్రదేశాన్ని వారు ఇలా దృశ్యబద్ధం చేసిన క్రమంలో వారికి ఇవి వెలుగుచూశాయి. సూర్యునిమీది మొత్తం 36,500 కి.మీ. చుట్టుకొలత (భూమికన్నా మూడురెట్లు ఎక్కువ)తో కూడిన ప్రదేశాన్ని చిత్రీకరించే లక్ష్యంతో అమెరికా ప్రభుత్వరంగ సంస్థ అయిన 'నేషనల్ సైన్స్ ఫౌండేషన్' (ఎన్‌ఎస్‌ఎఫ్)కు చెందిన పై టెలిస్కోప్‌ను నిర్మిస్తున్నట్టు చెబుతున్నారు.

జంతువింత

## సొరచేపల రక్త ఘ్రాణశక్తి!



**రక్తం** వాసనను పసిగట్టడంలో భారీతెల్ల సొరచేపల (Great white sharks) శక్తి అసాధారణం. కొన్ని మైళ్ల దూరం నుంచే ఇవి రక్తాన్ని గుర్తిస్తాయి. చడీ చప్పుడు కాకుండా వేటాడి చంపడంలో ఆరితేరిన ఈ భయంకర చేపలు సుమారు 3 మైళ్ల దూరంలోంచే రక్తం వాసనను పట్టేస్తాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. సుమారు 25 గ్యాలన్ల బకెట్ నీటిలో ఒక్క రక్తం చుక్క పడ్డా ఈ సొరచేపలు వాసనతో గ్రహించేయగలవని వారన్నారు. సుమారు 6.1 మీటర్ల పొడవు వరకు పెరిగే దీని బరువు దాదాపు 1,905–2,268 కేజీల వరకు ఉంటుంది. 2014లో జరిగిన ఒక అధ్యయనంలో భారీతెల్ల సొరచేప ఆయుర్దాయం సుమారు 70 ఏండ్లను మించినట్లు వారు గుర్తించారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన అఖాతాలలో కనిపించే ఈ సొరచేప 1,200 మీటర్ల (3,900 అడుగులు) లోతున, గంటకు 56 కి.మీ.పైబడిన వేగంతో ఈదుతుంది.

# విజ్ఞాన ఫలాపేక్ష ఎక్కడ?

సైన్స్ రుచి తెలియని చీకటి బతుకులను గురించి ఎన్నిసార్లు చెప్పుకున్నా తక్కువే! చీకట్లో కూడా కనిపిస్తున్న భావంతో మనకు తిండి గురించి తెలుసనుకొని తింటున్నాం. కానీ, పత్రహరితం (క్లోరోఫిల్) గురించి తెలుసుకొని, ఆకులలో జరుగుతున్న అద్భుతాన్ని అర్థం చేసుకొని తింటే అన్నం అయినా, లేక మరొకటి అయినా అందులోని అసలు కొత్త రుచి తెలుస్తుంది. దాని పేరే సైన్స్ రుచి!




**అందరమూ** మూడుపూటల బుద్ధిగా కూర్చుని తింటాం. మరి, ఆ తిండి ఎక్కడ్నించి వచ్చిందని ఆలోచించే వాళ్ళు చాలా తక్కువ. 'అదేమన్నమాట? కష్టపడి సంపాదించుకుంటున్నాం, తింటున్నామని' అనుకోవచ్చు. తినడానికి పంటలు, జంతువులు ఉన్నాయి కదానీ అనుకోవచ్చు! 'ఈ పంటలు, జంతువులు ఎక్కడినుంచి వస్తున్నాయి? ఎందుకు అంతగా లభ్యమవుతున్నాయి? ఎట్లా ఆ విధంగా అవి పెరుగుతున్నాయి?' అన్నవి తెలుసుకోవాల్సిన ప్రశ్నలు!

ఈ భూమిమీదికి మనకన్నా ముందు మొక్కలు వచ్చాయి. అవి పెరిగి చెట్లు అయ్యాయి. ఒక చెట్టును గమనిస్తే దాని నిండా రకరకాల ఆకులుంటై. అరటిచెట్టు ఆకులు వెడల్పుగా ఉంటే, చింతచెట్టు ఆకులు చిన్నవైనా చాలా ఎక్కువగా ఉంటాయి. మొత్తం కలిసి ఒక పెద్ద విస్తీర్ణాన్ని అవి ఏర్పాటు చేసుకుంటాయి. 'ఈ ఆకులు మనకు తిండి పెట్టే కర్మాగారాలు' అన్న సంగతి చాలామందికి అర్థమై ఉండదు. అందుకే, మనం సైన్స్ గురించి తెలుసుకోవాలి. తినే తిండి గురించి తెలియని వాళ్లకు ఇంకా మిగతా విషయాలు ఏం తెలిసినట్టు లెక్క?

ఆకులలో ఒక అద్భుతమైన కార్యక్రమం (కిరణజన్య సంయోగక్రియ) ద్వారా 'పిండి పదార్థం' తయారవుతుంది. ఇది అటువంటి, ఇటువంటి అద్భుతం కాదు, అద్భుతాలకే అద్భుతం! ఆ పిండి కారణంగానే మొక్కలు, పొదలు, చెట్లు, మహావృక్షాలు అన్నీ అంతగా పెరుగుతాయి. ఆ మొక్కలను తిని కొన్ని రకాల జంతువులు బతుకుతాయి. ఆ జంతువులను మరికొన్ని జంతువులు తింటాయి. కొన్ని జంతువులు మొక్కలను, జంతువులను అన్నింటినీ తింటాయి. ఇక, మనిషి అనే మన జాతిమాత్రం దొరికిన ప్రతి చెత్తా తినే రకం. చాలారకాల జంతువులుకూడా తినని కొన్ని పదార్థాలను అనేకమంది తింటుంటారు. ఈ మాట అంటున్నప్పుడు అసలైన సర్వమానవ సౌభ్రాతృత్వం కనబడుతున్నది. మొత్తానికి ప్రపంచంలోని మొక్కలనుండి మహావృక్షాలవరకు, చీమలనుండి మహామృగాలవరకు అన్నింటికీ తిండి పెట్టేది 'ఆకులు' అన్న సంగతిని మనం మొదట గుర్తించాలి. 'ప్రాణదాతలు'గా గుర్తించి అన్ని రకాల చెట్లకు వినయ విధేయతలను ప్రదర్శించాలి.

### దోసకాయలో ఎండ!

సైన్స్‌లో ఎదురయ్యే అనుమానాలను మనం సానుభూతితో తెలుసుకోవాలి. అందిన సమాచారాన్ని విశ్లేషించుకొంటే మరొక రకమైన రుచి దొరుకుతుంది. విజ్ఞాన విషయాలకు సంబంధించి ఆలోచిస్తే సైన్స్ రుచి దొరుకుతుంది. జొనాతన్ స్విఫ్ట్ (Jonathan Swift) అనే రచయిత గురించి చాలామందికి తెలియకపోవచ్చు. గలివర్ (Gulliver`s Travels) అన్న పేరు మాత్రం చాలామంది వినే ఉంటారు. ఆ పాత్రను సృష్టించింది ఈ రచయితే! ఆ పాత్రద్వారా అతను ఎన్నో వింత విషయాలను వెల్లడించాడు. జోనాతన్ స్విఫ్ట్ కొంచెంగా సైన్స్ రుచి తెలిసిన మనిషి. అతను కొంటె (వ్యంగ్య) మాటలతో రచనలు చేస్తాడు. *1726లో అతనొక పుస్తకం రాశాడు. అందులో 'దోసకాయలోనుంచి ఎండను బయటకు లాగే ప్రయత్నం జరుగుతున్నది' అని రాశాడు. అది చమత్కారం, సరదా కోసమే అయినా, 'దోసకాయలు ఎండ ఆధారంగా పెరిగాయి. కనుక వాటిలో ఎండ ఉంటుంది' అన్నది అర్థం చేసుకోవాలి. సైన్స్ రుచి ఇలా ఉంటుంది.*

ఆకులలో పచ్చనిరంగు ఉండడం మరొక అద్భుతం. దానిని 'ఆకుపచ్చరంగు' అనేవరకు అది వ్యాపించింది. ఈ రంగు కారణంగానే మనకు పిండిపదార్థం (తిండి) దొరుకుతున్నదన్నది, ఇది మరొక అద్భుతం. ఇదికూడా మామూలు అద్భుతం కాదు, మొత్తం జీవప్రపంచానికి ఆధారంగా నిలిచిన అద్భుతం. ఆకుపచ్చ రంగుకు కారణం 'క్లోరోఫిల్' అనే పదార్థం. మొదట ఆకులు సూర్యుని వెలుతురును గ్రహిస్తాయి. ఈ విషయాన్ని మనం పట్టించుకున్నట్లు కనిపించదు. నీడలో వేసిన మొక్కలు చక్కగా పెరగవు. గోడపక్కన వేసిన మొక్కలు ఎండ ఎటువైపుంటే అటు పెరుగుతాయి. గోడవైపు కొమ్మలుకూడా ఎండవైపు తిరుగుతాయి. ఈ ప్రపంచమంతా, కనీసం ఆకుపచ్చని చెట్ల ప్రపంచమంతా సూర్యునివైపు చూసి పెరుగుతున్నట్టు అర్థమవుతుంది. ఎండ మరీ వేడిగా ఉంటుంది. అది నేలను చేరేవరకు కొంత చల్లబడుతుంది. అట్లా చల్లబడిన ఎండ ఆకులకు ఉపకరిస్తుంది. అక్కడ జరిగే కార్యక్రమమే చాలామందికి ఈరోజు వరకూ పూర్తిగా అర్థంకాలేదు.

1866లో ఆస్ట్రియా దేశంలో ఒక పరిశోధకుడు మొక్కలకు వేడికిగల సంబంధాన్ని మొట్టమొదటిసారి గుర్తించాడు. 'ఎండా, వేడి ఉంటే కానీ మొక్కలు పెరగవు' అని చెప్పాడు. సముద్రంలో పరచుకొని ఉన్న డెస్మిడ్స్, డయటమ్స్ వంటి కొన్ని రకాల చిన్న మొక్కలు మొదలు, మహావృక్షాలదాకా ఈ ఆకుపచ్చని ఆకులు, వెలుగు సహాయంతో పనిచేసే రసాయన కర్మాగారాలు. అంటే, 'కొత్త పదార్థం తయారయ్యే చోట్లు' అని అతను తేల్చి చెప్పాడు. అప్పట్లో అందరికీ అది వింతగా వినిపించింది. ముందు ఎవరికీ నమ్మకం కలగలేదుకూడా. ఇంటిమీద 'ఫొటోవోల్టాయిక్ సెల్స్'తో సౌరశక్తిని గ్రహించి విద్యుచ్ఛక్తిగా వాడుకోవడం మనలో కొంతమంది చూసే ఉంటారు. ఇందుకు అసలైన నమూనా ఆకులు. వాటిలో కరెంటు పుట్టదు. పిండి పదార్థం పుడుతుంది. ఇలాంటి విషయాలు తెలిసినప్పుడు కూడా ఆశ్చర్యపడని వారికి ఈ ప్రపంచంలో మరే విషయమూ ఆశ్చర్యం కాదు. అలాంటి వారి బతుకులు చాలా పొడిపొడిగా నడుస్తాయి.

వృక్షశాస్త్రం అని ఒక ప్రత్యేక విజ్ఞానశాస్త్రశాఖ ఉంది. అది నిన్న మొన్న పుట్టలేదు. కలకాలంగా ఉంది. కానీ, అందులోని వారికి చాలారోజులవరకు 'మొక్కలు పెరగడానికి వెలుగు అవసరం' అన్న విషయం అర్థంకాలేదు. ఇంతకన్నా విచిత్రమైంది ఇంకొకటి ఉండదు. సైన్స్ తీరు అలాగే ఉంటుంది. ఒక విషయాన్ని ముందుగా

### రాత్రివేళలో అది తలకిందులు!

వియెన్నాలో ఇంజెన్‌హౌస్ అనే వైద్యుడు కొన్ని ప్రయోగాలు చేశాడు. 'వాళ్ళ అమ్మానాన్నలు, వంశంలో వాళ్లు సైన్సు రుచి బాగా తెలిసిన వాళ్ళు' అన్న సంగతి మనకు సులభంగానే అర్థమవుతుంది. అది ఇంటి పేరు. ఇక, ఈ మనిషికి పెట్టిన పేరు జాన్. అందరికీ తెలిసిన నాలుగు అక్షరాల జాన్ కాదు. జనవరి నెలకు మొదటి మూడు అక్షరాలతో మాత్రమే ముద్దుగా పెట్టుకునే పేరు అది. ఈ మొదటి నెల పేరుగల డాక్టర్‌గారు తన పరిశోధన ఫలితాలను *1779*లో ప్రకటించాడు. అందులో అతను మొక్కల పెరుగుదలకు వెలుతురు ప్రాముఖ్యాన్ని అనుమానం లేకుండా ప్రకటించాడు. అంతేకాకుండా, 'ఎండవేడిమిలో మొక్కలు ఒక విషవాయువును పీల్చుకుంటాయి. మనకెంతో ఉపకరించే మరొక వాయువును బయటకు వదులుతాయనీ' గమనించినట్లు ప్రకటించాడు. ఇవాళ, ఈ సంగతి చిన్న పిల్లలుకూడా చెబుతారు. రాత్రిపూట ఈ వ్యవహారం కొంతవరకు తలకిందులవుతుందన్న సంగతి చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. మొక్కలు బొగ్గుపులుసు వాయువు (కార్బన్ డై ఆక్సైడ్)ను పీల్చుకొని ఆమ్లజని (ఆక్సిజన్/ ప్రాణవాయువు)ని బయటికి వదులుతాయి. అది మిగతా జీవులకు ప్రాణం పోస్తుంది.

ఊహించి,
తరువాత తత్సం
బంధ వివరాలను సేకరించి, వాటి సంబంధాలను, పూర్వాపరాలను అర్థంచేసుకున్నప్పుడే విషయం అర్థమవుతుంది. 'ఆహా' అనిపిస్తుంది. ఒక కొత్త సూత్రం పుడుతుంది. ఒక కొత్త అవగాహన కలుగుతుంది. అదీ సైన్స్ రుచి!

1688లో లండన్‌లోని రాయల్ సొసైటీలో ఒక సమావేశం జరిగింది. అక్కడ ఎడ్మండ్ హేలీ ఒక చిత్రమైన విషయాన్ని అందరిముందు ప్రకటించాడు. చెల్సీ అనేచోట తోట ఉంది. మామూలుగానే అక్కడ ఒక తోటమాలి ఉన్నాడు. అతను అందరిలాంటివాడు కాదు. అనవసరంగా అన్ని విషయాలను పరిశీలిస్తుంటాడు. ఈ కాలపు పద్ధతిలో చెప్పాలంటే 'సైన్స్ చూపు' కలవాడు. పెద్దమాటల్లో చెప్పాలంటే 'వైజ్ఞానిక దృక్పథం కలవాడు'. ఆ తోటమాలి హేలీకి ఒక సంగతి చెప్పాడు. 'ఎండ తగులకుండా పెట్టిన మొక్కలు కొంత కాలానికి పాలిపోతాయి' అని. 'కొంతకాలానికి అవి వాడి చచ్చిపోతాయని కూడా' చెప్పాడు. ఈ సంగతులు అతను ఊహించి చెప్పలేదు. సైన్స్‌కు ఆధారమైన పరిశీలన, ప్రయోగాల ఆధారంగా చెప్పగలిగాడు. హేలీ అంతకన్నా కొంచెం ఎక్కువ సైన్సు దృష్టితో ఆలోచించే మనిషి. అప్పటికే ఎన్నో సంగతులను గమనించి అందరికీ చెప్పాడు. తోటమాలి చెప్పిన సంగతి అతనికి సత్యంగా తోచింది. దాన్ని అతనుకూడా తప్పకుండా పరిశీలించి ఉంటాడు. అప్పుడు అతనికి ధైర్యం కలిగింది. 'వెజిటబుల్ లైఫ్' అంటే మొక్కలు. అది కొనసాగాలంటే మొక్కలకు ఎండ తగిలేలా ఏర్పాటు చేయాలని అతను ధైర్యంగా రాయల్ సొసైటీలో ప్రకటించాడు.

ఎడ్మండ్ హేలీ ఖగోళశాస్త్రం గురించి పరిశీలించేవాడు. అతను వచ్చి మొక్కలగురించి ఒక సంగతి చెబితే ఎవరైనా విన్నారా? మనిషి ఎప్పుడూ ఒకే రకంగా ఉంటాడు. నాటికీ నేటికీ మనిషి తీరులో తేడా లేదు. కొత్త సంగతి చెప్పిన వారిమీద విరుచుకుపడడం మనిషికి అలవాటు. తరువాత అనుమానించడం అతని స్వభావంలో భాగం. అంతేకానీ, 'తాము విన్నది నిజమై ఉండవచ్చు' అన్న భావన చాలా తక్కువమందికి కలుగుతుంది. ఎడ్మండ్ హేలీ అంటే సైన్స్ రుచి అప్పటికే అనుభవించిన మనిషి. కొత్తగా ఆ రుచిని అనుభవించిన తోటమాలి ఆలోచనలను అతను సులభంగా అందుకోగలిగారు. అందరూ అంత సులభంగా ఆ సంగతులను అందుకోవడం, నాటికి, నేటికీ అనుమానంగానే ఉంటుంది. ఇందులో ఆశ్చర్యం లేదు. తెలిసిన ఆరు రుచులకు జతగా 'ఉమామీ' అనేది మరొకటి వచ్చిందని, అది ఇంచుమించు వగరులాంటిదని కొన్నేండ్లుగా పరిశోధకులు చెబుతున్నారు. ఐనా, ఇప్పటికీ అది ప్రజలలోకి రాలేదు. నిజంగా ఉన్న ఒక రుచి పరిస్థితే ఇలా ఉంటే, కేవలం ఆలోచనలలో అనుభవించవలసిన సైన్స్ రుచి అంత సులభంగా అందుతుందా?

ఇంజెన్‌హౌస్ (Ingenhousz) ఈ ప్రపంచ మనుగడకు కారణమైన రసాయనిక చర్యను కనుగొన్న గొప్ప పరిశోధకుడు. తన పని తాను చేసుకుని చప్పుడు కాకుండా ఈ డాక్టర్ పడుకుని ఉంటే, కిరణజన్య సంయోగ క్రియ (తిండి లేదా పిండి పదార్థం తయారయ్యే పద్ధతి) గురించి తెలియడానికి మరికొంతకాలం పట్టి ఉండేది. తరువాత నెమ్మదిగా మొక్కలు పిండి పదార్థం తయారుచేసే కార్యక్రమం గురించి అర్థం చేసుకున్నారు. 'కర్బన ద్వి ఆమ్లజనిదము' అని చెప్పిన కార్బన్ డై ఆక్సైడ్‌ను వాతావరణం నుంచి గ్రహించి మొక్కలు సూర్యరశ్మి ఆధారంగా చక్కెర పదార్థాలను తయారు చేస్తాయి. ఇందులో నీటికి కూడా ప్రధానమైన పాత్ర ఉంది. చాలాచోట్ల బీట్ దుంపలనుండి కూడా చక్కెరను తయారుచేస్తారు. ఆ సంగతి మనవాళ్లకు ఎక్కువగా తెలియదు. ఈ చక్కెర ఒక రకం. దాన్ని 'సుక్రోజ్' అంటారు.

అందరికీ తెలియవలసిన విషయాలు కొన్ని ఎవరికీ పట్టకుండా ఉండిపోతే జీవితంలో కొంత రుచి కోల్పోయినట్టు లెక్క. కానీ, అదే పనిగా ఈ విషయాలనే పట్టించుకుంటే మరికొన్ని రకాల రుచులూ దూరమవుతాయి. పాట వింటే, సినిమా చూసినట్టే, మిగతా సరదాలు అన్నింటినీ పట్టించుకున్నట్టే, అప్పుడప్పుడు సైన్సుగురించి కూడా పట్టించుకుంటే జీవితంలో పస పెరుగుతుంది. ఆసక్తికరమైన అంశాల ఆధారంగా సైన్స్ రుచిని పెంచుకోవాలి. దాన్ని అందరితో పంచుకోవాలి.

**డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

ఎవరేమన్నారు?



గణితం రాసింది గణిత శాస్త్రజ్ఞుల కోసమే!

**- నికోలస్ కోపెర్నికస్**

జయంతి: 19 ఫిబ్రవరి,
వర్ధంతి: 24 మే
జీవితకాలం:
క్రీ.శ.1473–1543

ప్రత్యేకం

## ఆధునిక విధాతలు!

**మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ ఏడు దశాబ్దాలలో సైన్సు పరిశోధనలలో, ప్రత్యేకించి విజ్ఞానశాస్త్ర రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందింపజేయడం, ఇదే సమయంలో సామాన్యులకు సైన్సు ఫలాలను అందించడం వంటివాటి పరంగా ఇంకా సాధించవలసింది ఎంతో ఉందన్నది సుస్పష్టం.**

**'శాస్త్రవేత్తలు** కేవలం ఆభరణాలు కాదు. మానవజాతి విధికి విధాతలు' అని ఒక సందర్భంలో మన దేశానికి చెందిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ అన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శాస్త్రీయ దృక్పథం నేడెంతో అవసరమని భారత మాజీ రాష్ట్రపతి, సుప్రసిద్ధ అంతరిక్ష శాస్త్రవేత్త ఏ.పీ.జే. అబ్దుల్ కలాం పేర్కొన్నారు. ఇవాళ్టి 'జాతీయ సైన్స్ దినోత్సవ' వేళ ఈ తరహా స్ఫూర్తిదాయక మాటలను మరొక్కసారి మననం చేసుకొన్నప్పుడు అవి ఎంతవరకు కార్యరూపం దాల్చాయన్న అంశం మనముందుకు వస్తుంది.




భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 'ఫిబ్రవరి 28న' తేదీని 'జాతీయ సైన్స్ దినోత్సవం' (National Science Day) గా ప్రకటించింది. 1928లో సర్ సి.వి.రామన్ 'రామన్ ఫలితాన్ని' కనుగొనగా, 1930లో ఈ ఆవిష్కరణకు నోబెల్ బహుమతి లభించింది. శాస్త్రవేత్తల కృషిని గుర్తుచేసుకొంటూ ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. శాస్త్ర విజ్ఞానం ప్రజలందరి సొత్తు కావాలన్నదే దీని ముఖ్యోద్దేశ్యం. కాంతి, పదార్థాల మధ్య జరిగే చర్య ఫలితంగా కాంతి పరిక్షేపం (చెదిరిపోవడం: scattering) చెందుతుంది. ఇందుకు 'సముద్రజలాలపై సౌరకాంతి ప్రసరణ' ఒక చక్కని ఉదాహరణ. అప్పుడు కాంతిలోని నీలంరంగు అధిక మొత్తంలో చెదరడంతో సాగరజలాలు మన కంటికి నీలంగా కనిపిస్తాయి. ఇదే వారు కనుగొన్న పరిశోధనాంశం. పదార్థాలలో దాగున్న అణువుల బంధాన్ని, నిర్మాణాన్ని దీని ద్వారా తెలుసుకోవచ్చు.

సర్ సి.వి.రామన్ కేవలం 36 ఏండ్ల వయసులోనే ఈ పరిశోధన (రామన్ ఎఫెక్ట్)ను కనుగొన్నారు. ఫలితంగా ఆయన నోబెల్ బహుమతితోపాటు మరెన్నో అవార్డులనూ పొందారు. 'భారతావని ఆర్థిక సమస్యలన్నింటికీ సైన్సే ఏకైక పరిష్కారమని' రామన్ ఏనాడో తెలిపారు. ఇవాళ మానవ కరోనావైరస్ (కోవిడ్–19) వంటి భయంకర అంటువ్యాధులను ఎదుర్కొనే సత్తాను సంపాదించుకోవాలంటే వైద్యవిజ్ఞాన శాస్త్రీయ పరిశోధనల రంగాలలో మరింత విప్లవాత్మక ప్రగతిని సాధించవలసి ఉంది.

**డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**
సెల్: 94404 32464

**ప్రస్తుత 'కొవిడ్-2019' (మానవ కరోనా వైరస్: 2019-nCoV) విజృంభణతో శాస్త్రవేత్తలకు అనేక రకాల ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వాటిలో భాగంగానే అసలు 'గబ్బిలాల వైరస్‌లు ఎందుకింత ప్రమాదకరంగా ఉంటున్నాయన్న' కోణంలో వారు పరిశోధనలు సాగిస్తే, ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనాయి.**

జంతుశాస్త్రం

## గబ్బిలాల వైరస్‌లు ఎందుకంత ప్రమాదకరం?

**గత కొన్నేండ్లుగా** ప్రపంచవ్యాప్తంగా విజృంభించిన సార్స్ (SARS), మెర్స్ (MERS), ఎబోలా (Ebola), మార్బర్గ్ (Marburg) వంటి కొన్ని అత్యంత ప్రాణాంతక అంటురోగాల విషక్రిములు (viruses) అన్నీ గబ్బిలాలనుంచి పుట్టినవే కావడం గమనార్హం. 'ఈ జంతువులనుండి సంక్రమించే విషక్రిములు (వైరస్‌లు) ఇంత ఘోరంగా (వేగంగా, తీవ్రస్థాయిలో మానవుల ప్రాణాలు తీసేలా) ఎందుకుంటున్నాయి?' అన్న దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగాయి. ఫలితంగా, ఈ వైరస్‌ల (విషక్రిముల) పట్ల గబ్బిలాలలో 'తీవ్రస్థాయిలో ప్రతిస్పందించగల రోగనిరోధక వ్యవస్థ' ఉన్నట్టు తేలింది. గబ్బిలాలను ఆశ్రయించిన వైరస్‌లు చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, దీంతో అవి సగటు (తక్కువస్థాయి) రోగనిరోధక వ్యవస్థతోకూడిన, మానవులు వంటి క్షీరదాలలోకి ప్రవేశించిప్పుడు 'తీవ్ర ప్రాణాంతక ఉపద్రవాన్ని' సృష్టిస్తున్నాయని వారు కనుగొన్నారు.

బర్కిలీ (అమెరికా) నగరంలోని 'యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా'కు చెందిన పరిశోధకులు ఈ తాజా అధ్యయనం నిర్వహించి పై ఫలితాన్ని సాధించారు. ప్రత్యేకించి మనుషులకు సంక్రమించిన కరోనా వైరస్‌లకు మూలమైన గబ్బిలాలలోని 'రోగనిరోధక వ్యవస్థ' ఈ తరహా వైరస్‌లకు శాశ్వత ప్రోత్సాహకారిగా ఉంటున్నట్టు వారు గుర్తించారు. ఇవే విషక్రిములు వాటి నుండి మానవులు వంటి క్షీరదాలలోకి వ్యాపించినప్పుడు అంతే వేగంగా నిరోధించగల వ్యవస్థలు ఉండటం లేదు. దాంతో అత్యల్ప సమయంలోనే అవి అసాధారణ రీతిలో పెరిగిపోతున్నట్టు వారు పేర్కొన్నారు. మరోవైపు వివిధ కారణాలవల్ల గబ్బిలాల నివాసాలకు అంతరాయం కలుగుతున్నదని, దీంతో వాటిపై ఒత్తిడి పెరిగి పోతున్నదని వారన్నారు.



ఈ కారణంగా మరింత ఎక్కువ స్థాయిలో గబ్బిలాలనుండి లాలాజలం, మలమూత్రాలు విడుదలవుతుండడంతో వాటిద్వారా వైరస్‌లు ఇతర జంతువులకు పాకుతున్నట్టు వారు తెలిపారు. గబ్బిలాల పరిశోధనకే ఏర్పడిన ప్రాజెక్ట్ 'బ్యాట్ వన్ హెల్త్' (Bat One Health Research Network: BOHRN) ఈ జంతువులు నివాసప్రాంతలను నష్టపోవడానికి, వాటి నుండి వ్యాపించే వైరస్‌లు ఇతర జంతువులు, మానవులలోకి వ్యాపించడానికి మధ్యగల లంకెను బహిర్గత పరిచింది. ఈ తాజా పరిశోధన ఈలైఫ్ (eLife) ఆన్‌లైన్ జర్నల్‌లో ప్రచురితమైంది.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)లో ఏఈ, ఏఏవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

### సీడాక్‌లో

**నోయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 132
- **పోస్టులవారీగా ఖాళీలు:** ప్రాజెక్ట్ మేనేజర్–10, ప్రాజెక్ట్ ఇంజినీర్–122.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంసీఏ/ ఎంఈ/ ఎంటెక్/ పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 11
- **వెబ్‌సైట్:** https://cdac.in

### ఎల్ఐసీలో 218 ఖాళీలు

- **పోస్టులు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్
- **పేస్కేల్:** ప్రారంభ వేతనం నెలకు రూ.57,000/- (సుమారుగా)
- **మొత్తం ఖాళీలు:** 218
- **పోస్టులవారీగా ఖాళీలు:** అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్–29, ఎలక్ట్రికల్–10, ఆర్కిటెక్ట్–4, స్ట్రక్చరల్–4, ఎలక్ట్రికల్/మెకానికల్–3)– 50, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏ–40, ఆక్చూరియల్–30, లీగల్–40, రాజభాష–8, ఐటీ–50)– 168 ఉన్నాయి.
- **అర్హతలు:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈ/ బీటెక్, బీఆర్క్, ఎంఈ/ ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2020, ఫిబ్రవరి 1 నాటికి 21–30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ద్వారా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** https://licindia.in

### కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో

**కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **పోస్టు:** షిప్ డిజైన్ అసిస్టెంట్లు
- **మొత్తం ఖాళీలు:** 30 (మెకానికల్–9, ఎలక్ట్రికల్–21)
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజినీరింగ్) ఉత్తీర్ణత, అనుభవం.
- **వయస్సు:** మార్చి 4 నాటికి 30 ఏళ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 4
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

### మైనారిటీ గురుకులాల్లో

**తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాలయాల సంస్థ 2020-21 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలలో కింది తరగతుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

- **తరగతులు:** 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సహా 204 పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలు, 83 జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు.
- **అర్హతలు:** సంబంధిత కింది తరగతి ఉత్తీర్ణత. తెలంగాణలో జన్మించి ఉండాలి. నిర్దేశించిన వార్షిక ఆదాయం ఉండాలి. మైనారిటీలు, నాన్-మైనారిటీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
- **పరీక్షతేదీ:** ఇంటర్–ఏప్రిల్ 12, ఐదో తరగతి– ఏప్రిల్ 18, ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు– ఏప్రిల్ 20న పరీక్ష నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** http://tmreis.telangana.gov.in

epaper.ntnews.com

# సగర్వంగా సెమీస్‌కు

## హ్యాట్రిక్ విజయంతో నాకౌట్‌లో భారత్

### ఉత్కంఠ పోరులో కివీస్‌పై పైచేయి.. మళ్లీ మెరిసిన షఫాలీ వర్మ


షఫాలీ వర్మ (46)

**పొట్టి ప్రపంచకప్‌లో దుమ్మురేపుతున్న భారత మహిళల జట్టు.. హ్యాట్రిక్ విజయాలతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బ్యాటింగ్‌లో తక్కువ పరుగులే చేసినా.. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకొని అదుర్స్ అనిపించింది. రికార్డు స్ట్రయిక్‌రేట్‌తో విజృంభిస్తున్న యంగ్‌తరంగ్ షఫాలీ వర్మ కీలక పోరులో కసితీరా కొట్టడంతో భారీ స్కోరుకు బాటలు పడినా.. మిడిలార్డర్ మరోసారి పేలవ ప్రదర్శన కొనసాగించడంతో టీమ్‌ఇండియా తక్కువ స్కోరుకే పరిమితమైంది. మెగాటోర్నీ ప్రారంభం నుంచి అంచనాలకు మించి రాణిస్తున్న బౌలర్లు మరోసారి సమిష్టిగా కదం తొక్కడంతో కివీస్‌పై ఒత్తిడి కొనసాగించిన హర్మన్ గ్యాంగ్.. తుదికంటా ఆధిపత్యం కనబరిచింది. ఆఖర్లో భారీ షాట్‌లతో విరుచుకుపడిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ర్ కాస్త భయపెట్టినా.. ఉత్కంఠ భరితంగా సాగిన చివరి ఓవర్‌లో శిఖా పాండే తెలివైన బౌలింగ్‌తో టీమ్‌ఇండియాను విజయం వరించింది. ఈ విజయంతో సగర్వంగా సెమీస్‌లో అడుగుపెట్టిన భారత్.. ఇక కప్పు కొట్టడమే తమ లక్ష్యమని ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపింది.**

**మెల్‌బోర్న్:** వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత మహిళల జట్టు.. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఓపెనర్ షఫాలీ వర్మ (34 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులకు బౌలర్ల స్ఫూర్తిదాయక ప్రదర్శన తోడవడంతో న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన ఉత్కంఠ పోరులో టీమ్‌ఇండియా 3 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌ను ఓడించిన హర్మన్ గ్యాంగ్ ఈ విజయంతో మెగాటోర్నీలో సెమీస్ చేరిన తొలిజట్టుగా నిలిచింది. గ్రూప్-ఏలో భాగంగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఒక సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోగా.. ఈ గ్రూప్ నుంచి మరో స్థానం కోసం ఆస్ట్రేలియా (4 పాయింట్లు), న్యూజిలాండ్ (2 పాయింట్లు) పోటీపడుతున్నాయి. జంక్షన్ ఓవల్ మైదానంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత అమ్మాయిలు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేశారు. షఫాలీ వర్మ మరోసారి అదరగొట్టగా.. తానియా భాటియా (23; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులు చేసింది. కెర్ర్ (19 బంతుల్లో 34 నాటౌట్; 6 ఫోర్లు) టాప్‌స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి, శిఖ, రాజేశ్వరి, పూనమ్, రాధ తలా ఓ వికెట్ పడగొట్టారు. షఫాలీ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శనివారం శ్రీలంకతో భారత్ తలపడనుంది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఆస్ట్రేలియా గెలుపొందింది.

**4** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్‌కు చేరడం ఇది నాలుగోసారి.

### స్కోరు బోర్డు

**భారత్:** షఫాలీ (సి) హేలీ జెన్సెన్ (బి) కెర్ర్ 46, స్మృతి (బి) తహూహు 11, తానియా (సి) కెర్ర్ (బి) మైర్ 23, జెమీమా (సి) కెర్ర్ (బి) మైర్ 10, హర్మన్‌ప్రీత్ (సి అండ్ బి) కాస్ప్రెక్ 1, దీప్తి (సి) హేలీ జెన్సెన్ (బి) డివైన్ 8, వేద కృష్ణమూర్తి (ఎల్బీ) కెర్ర్ 6, శిఖ (నాటౌట్) 10, రాధ (రనౌట్) 14, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 20 ఓవర్లలో 133/8. **వికెట్ల పతనం:** 1-17, 2-68, 3-80, 4-93, 5-95, 6-104, 7-111, 8-133, **బౌలింగ్:** తహూహు 2-0-14-1, మైర్ 3-0-27-2, డివైన్ 2-0-12-1, అన్నా పీటర్‌సన్ 2-0-19-0, హేలీ జెన్సెన్ 3-0-20-0, కెర్ర్ 4-0-21-2, కాస్ప్రెక్ 4-0-19-1.

**న్యూజిలాండ్:** ప్రైస్ట్ (సి) రాధ (బి) శిఖ 12, డివైన్ (సి) రాధ (బి) పూనమ్ 14, సూజీ బేట్స్ (బి) దీప్తి 6, మ్యాడీ గ్రీన్ (సి) తానియా (బి) రాజేశ్వరి 24, కాటీ మార్టిన్ (సి) రోడ్రిగ్స్ (బి) రాధ 25, కెర్ర్ (నాటౌట్) 34, హేలీ జెన్సెన్ (రనౌట్) 11, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 20 ఓవర్లలో 130/6. **వికెట్ల పతనం:** 1-13, 2-30, 3-34, 4-77, 5-90, 6-130, **బౌలింగ్:** దీప్తి 4-0-27-1, శిఖ 4-0-21-1, రాజేశ్వరి 4-0-22-1, పూనమ్ 4-0-32-1, రాధ 4-0-25-1.

### అబ్బాయిలతో ఆడటం వల్లే..

మహిళల ప్రపంచకప్ ప్రారంభానికి ముందు అభిమానుల కండ్లన్నీ స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మీద నిలిస్తే.. మూడు మ్యాచ్‌లు ముగిసే సరికి యావత్ భారతంలో షఫాలీ గురించి చర్చ మొదలైంది. కండ్లు చెదిరే సిక్సర్లతో రెచ్చిపోతున్న ఈ 16 ఏండ్ల చిన్నది మహిళల టీ20ల్లో అత్యధిక స్ట్రయిక్‌రేట్ (147.97) కలిగిన క్రికెటర్‌గా చరిత్రకెక్కింది. ఈ మెగాటోర్నీలో ఆడిన మూడు ఇన్నింగ్స్‌ల్లో ఆమె 172.72 స్ట్రయిక్‌రేట్‌తో 114 పరుగులు చేయడం విశేషం. సచిన్ టెండూల్కర్‌ను దైవంలా భావించే షఫాలీ.. చిన్నతనంలో అబ్బాయిలతో కలిసి సాధన చేయడం వల్లే అలవోకగా భారీ షాట్లు కొట్టగలుగుతున్నానని పేర్కొంది. 'నేను ఎక్కువగా అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడేదాన్ని. నాతో సాధన చేసిన అబ్బాయిలకు కృతజ్ఞతలు. వాళ్ల వల్లే బాగా శిక్షణ పొందా' అని షఫాలీ తెలిపింది. మరోవైపు ఈ టీనేజ్ సంచలనం ఆటతీరుకు ముగ్ధుడైన మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్.. షఫాలీ 'రాక్‌స్టార్' అంటూ కితాబిచ్చాడు.

## ప్రపంచ సెయిలింగ్ టోర్నీలో

# ఝాన్సీ, ధరణి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ఇటలీలో జరిగే ప్రపంచ సెయిలింగ్ చాంపియన్‌షిప్ కుదించిన జాబితాలో రాష్ర్టానికి చెందిన ఝాన్సీ ప్రియ, ధరణి లావేటి ఎంపికయ్యారు. మే నెలలో ముంబైలో జరిగే జాతీయ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రదర్శన ఆధారంగా ప్రపంచటోర్నీలో వీరి తుది ఎంపిక ఆధారపడి ఉంది. వీరు జాతీయ సెయిలింగ్ టోర్నీలో సత్తాచాటితే భారత్ తరఫున బరిలోకి దిగే అవకాశం లభిస్తుంది. గతేడాది ఒమన్‌లో జరిగిన ఆసియా సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో ఆకట్టుకున్న ఝాన్సీ ప్రస్తుతం రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నది. జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో మన అమ్మాయిలు ఆకట్టుకోవడం వెనుక కఠోర శ్రమ దాగుందని హైదరాబాద్ యాచ్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ సుహేమ్ షేక్ అన్నారు. యాచ్‌క్లబ్ తీసుకొచ్చిన నావిక కార్యక్రమం ద్వారా అద్భుత ప్రతిభ కల్గిన సెయిలర్లు వెలుగులోకి వస్తున్నారని తెలిపారు. ఝాన్సీతో పాటు ఆమె సోదరి ధరణి, రవళి, వైష్ణవి ప్రస్తుతం రసూల్‌పూరలోని ఉద్భవ్ స్కూల్‌లో చదువుతున్నారు.

## ఖేలో ఇండియా టెన్నిస్ ఫైనల్లో ఓయూ


అనూష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయ (ఓయూ) విద్యార్థులు కొండవీటి అనూష, శ్రావ్య శివానీ సత్తాచాటారు. గురువారం ఢిల్లీ యూనివర్సిటీతో జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో అనూష 2-6, 6-4, 7-6 తేడాతో బనీసింగ్(ఢిల్లీ యూనివర్సిటీ)పై విజయం సాధించింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన మ్యాచ్‌లో అనూష అద్భుత పోరాటపటిమ కనబరిచింది. తొలి సెట్‌ను కోల్పోయినా పుంజుకుని పోటీలోకొచ్చిన అనూష వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపిస్తూ మ్యాచ్‌ను తన వశం చేసుకుంది. మరో పోరులో శ్రావ్య శివానీ 6-0, 6-4తో హర్షిత శివ్ (ఢిల్లీ యూనివర్సిటీ)పై అలవోక విజయం సాధించింది.



## సన్‌రైజర్స్ సారథిగా

# వార్నర్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్.. ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరిగి కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. బాల్ ట్యాంపరింగ్ ఉదంతంతో ఏడాది నిషేధానికి గురవడంతో.. ఐపీఎల్ కెప్టెన్సీ కోల్పోయిన వార్నర్ 2019 ఎడిషన్‌లో విలియమ్సన్ సారథ్యంలో అదరగొట్టాడు. గతేడాది బ్యాట్‌తో పాటు ప్రవర్తనతోనూ మెప్పించిన వార్నర్‌కే.. సన్‌రైజర్స్ తిరిగి కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. ఈ విషయాన్ని గురువారం ట్విట్టర్ ద్వారా స్పష్టంచేసింది. 'ఐపీఎల్ 2020లో సన్‌రైజర్స్‌కు సారథ్యం వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. రెండేండ్లుగా టీమ్‌ను నడిపించిన విలియమ్సన్‌కు ధన్యవాదాలు. ఈ అవకాశమిచ్చిన ఫ్రాంచైజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు. 13వ సీజన్‌లో ట్రోఫీ నెగ్గేందుకు శాయశక్తులా కృషిచేస్తాం' అని వార్నర్ వీడియోలో చెప్పాడు.

## మరో సాహసానికి

# గోలి శ్యామల



**హైదరాబాద్:** తెలుగు సీనియర్ స్విమ్మర్ గోలి శ్యామల మరో సాహసానికి సిద్ధమైంది. నాలుగు పదుల వయసులో ఇప్పటికే స్విమ్మింగ్‌లో అనితరసాధ్యమైన ఫీట్లను అందుకున్న శ్యామల మార్చి 14న ధనుష్‌కోటి(భారత్) నుంచి తలైమన్నార్(శ్రీలంక) వరకు ఈదబోతున్నది. దీనికి సంబంధించిన వివరాలను ఆమె మీడియాతో పంచుకుంది. తొలి తెలుగు మహిళ ఓపెన్ వాటర్ స్విమ్మర్‌గా రికార్డులకెక్కిన 47 ఏండ్ల శ్యామల 30 కిలోమీటర్ల దూరం ఈదేందుకు కఠోరంగా ప్రాక్టీస్ చేస్తున్నది. స్థానిక గచ్చిబౌలి స్టేడియంలో కోచ్ ఆయూష్ యాదవ్ శిక్షణలో మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నట్లు శ్యామల తెలిపింది.







